

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 1
నవంబర్ - 2021
'ప్లవ' కార్తీక మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi

***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**



# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


| | |
|---|---|
| మూసీ మాసపత్రిక రజతోత్సవాలు ... | 6 |
| ఒగ్గుకథలో ఉపమాలంకారం ... రాజిరెడ్డి మహేందర్ రెడ్డి | 7 |
| తెలుగు ఆకర గ్రంథాలు - గ్రంథ సూచికలు ... గోలి శ్రీలత | 13 |
| పద్య మనోహరం -22 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు | 16 |
| తెలంగాణ తొలితరం చారిత్రక పరిశోధకులు - ఆదిరాజు... కమలాకర శర్మ | 17 |
| తెలుగు సినిమా సాహిత్యంలో సంభాషణలు - ఒక పరిశీలన ... గంజి శశిధర్ | 21 |
| పదవినోదం ... డా. తాడేపల్లి పతంజలి | 24 |
| బంజారా నృత్య వైవిధ్యం ... ఆచార్య సూర్యా ధనంజయ్ | 25 |
| కవిత్వం - ప్రామాణికత ... ఎం. కురుమయ్య యాదవ్ | 31 |
| గ్రంథాంతరంగం 6 - ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర ... ఘట్టమరాజు | 33 |
| యోగసక్తా పరిణయం - పరిశీలన ... నారాయణదాసు మంజులచారి | 37 |
| అంతర్జాలంలో లఘుకవితా రూపాలు - పరిశీలన ... గొల్లపల్లి గణేశ్ | 41 |
| తెలంగాణ భాషా సంస్కృతి ... వై. సత్యనారాయణ | 43 |
| కాటమరాజు కథలు - 3, ఆచార్య తంగిరాల పరిష్కరణ ... డా.తోట వెంకటస్వామి | 47 |
| తెలుగు తాత్త్విక గేయాలు - ఉపనిషత్తుల ప్రభావం ... పి. శ్రీధర్ రెడ్డి | 50 |
| కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 16 ... టి. లక్ష్మీనారాయణ | 53 |
| శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి | 55 |


### కవితలు

దివ్వెల తల్లి! వరాల మల్లి!! ... ఆచార్య శ్రీవత్స - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; రైతే దేశానికి వెన్నుదన్ను ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 23; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 40; ఆశయాల దీపం - వెలుగుల ప్రతిరూపం ... వేదుల వరలక్ష్మి - 46; కాలం వెంటే మనిషి ... ఎస్. ఆర్. పృథ్వి - 52; నేను ... బి. అంజనీ దేవి - 58; దారి ... నరసింహారెడ్డి - 60; ఉస్మానియా విశ్వవిద్యాలయం ... డా. కందుల శ్రీను - 62.

### సమీక్షలు



| | |
|---|---|
| ఎనుగంటి గోపాల్ 'అమ్మనాన్న' కథల సంపుటి ... కస్తూరి వేణుగోపాల్ | 57 |
| ఆంధ్ర సారస్వత పరిషత్తు : తెలుగు భాషా సాహిత్య సేవ ... ఘట్టమరాజు | 59 |
| స్వీకృతి ... | 61 |


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## పరిణామం

పరిణతిః కాలే నాన్యథేతి పరిణామః... కాలముచే వేరైన పరిపాకమును పొందుటే పరిణామం. మార్పు అనే అర్థంలో పరిణామాన్ని ఉపయోగిస్తున్నాం. నిజానికి ఉన్నతివైపు చేరడమే పరిణామానికి అర్థం. నతము అంటే ఆకాశం, తల ఎత్తుకుని చూడడం అని అర్థం. ఉన్నతం అంటే కూడా అదే. నతము చుట్టూ పరిభ్రమించడమే పరిణతం. అంటే తామున్న స్థాయినుండి ఉన్నత స్థాయికి చేరడమే పరిణామం. రూఢి అర్థంలో మార్పుగా స్థిరమైంది.

జీవులన్నీ పరిణామం పొందుతూనే ఉన్నాయి. మనం కూడా పుట్టినప్పటి నుండి పరిణామాన్ని పొంది పెద్దవాళ్ళమై, జీర్ణమై పోతున్నాం. ఈ మార్పు శరీర పరంగా మారుతుంది. వాతావరణాన్ని పరిశీలించే విధానం మారుతుంది. మనం పెంచుకున్న లౌకిక, ప్రాకృతిక జ్ఞానాన్ని బట్టి ఈ లోకంలో ఇంకా సులువుగా బ్రతికే విధానం అర్థం అవుతుంది. ప్రకృతి మనకు ఇచ్చే ఎన్నో శక్తులను వినియోగించుకునే అవకాశాన్ని పెంచుకుంటూ ఉంటాం. శక్తిని వినియోగించుకునే విధానాన్ని బట్టి వ్యక్తి సులువైన జీవితాన్ని గడపడం తెలుస్తుంది. మన అవసరాలకు తగినట్లుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెంచుకుంటాం. వస్తు సముదాయాన్ని తయారు చేసుకుంటాం. ఇవన్నీ జ్ఞాన పరిమితిని ఇంకా పెంచుకునేందుకు సహకారాన్ని ఇవ్వాలి.

శారీరకమైన పరిణామం ప్రకృతి సహజంగానే సాగుతుంది. శరీర పరమైన మార్పులే కాకుండా మానసికమైన మార్పులు వచ్చినప్పుడే అసలైన పరిణామం. మనస్సు మార్పులకు తొందరగా ఇష్టపడదు. జ్ఞానం ఏర్పడుతున్నప్పుడు మాత్రమే మనస్సు యొక్క పరిణామం ఉన్నతం అవుతుంది. మనిషి క్రమంగా మనీషిగా మారడానికి అవకాశం కలుగుతుంది. తమోగుణమంతా అజ్ఞానంతో ఉండి, శరీర పరమైన మార్పులే తప్ప మానసికమైన మార్పులకు అవకాశాన్ని ఇవ్వదు. అది రజో గుణానికి, సత్వగుణానికి మారుతున్నప్పుడు తీవ్రమైన వేదనను అనుభవించాల్సి వస్తుంది. ఆ పరిణామానికి ఇష్టపడని వారికి జీవితం శరీరం ఉన్నంత వరకే. ఆ వేదనకు, మార్పుకు సిద్ధమైన వారికి జీవనం మరణానంతరం కూడా లభిస్తుంది.

మంచుముక్కగా ఉన్న స్థితికి వేడిని బాగా చేరిస్తే అన్నింటిలో ఇమిడిపోగలిగిన, ప్రవహించ గలిగిన గుణంతో విస్తరిస్తుంది. మారడానికి ఇష్టం లేనప్పుడు కాలక్రమంలో మంచు కూడా ఫాజిల్‌గా మారిపోతుంది. ప్రవహించే నీటికి కూడా ఇంకా ఇంకా వేడి చేరిస్తే రూపరహితమైన నీటి ఆవిరిగా మారి ప్రకృతిలో మమేకమౌతుంది. దాని వ్యాపనం ఇంకా ఎక్కువవుతుంది. స్థితి పరమైన ఈ పరిణామం కావాలంటే వేడిని తోడు చేసుకోగలిగే ప్రయత్నం, ధైర్యం కావాలి. ఈ మార్పులు మనను ఇబ్బంది పెడతాయనో, నొప్పులకు గురి చేస్తాయనో, పూర్వపు రూపం, భావం మారుతుందనో భావించేవారు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటారు. అహంకరిస్తారు. మార్పుకు ఇష్టమైన వారు తాత్కాలికంగా ఇబ్బంది పడినా, అందరిలోనూ వ్యాపించడం, ఉపయోగ పడటం చేస్తారు. అందుకే వ్యక్తి పరిణమించాలి. దానికి ఉద్యుక్తులు కావాలి. మనోపరిణామమే అసలు పరిణామం. కష్టపడితే ఏదైనా మారవచ్చుననే కదా... డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం.

కాలానుగుణంగా, జ్ఞానానుగుణంగా, సాంకేతిక వ్యవహారానుగుణంగా ఎన్ని మార్పులు వస్తున్నా వాటిని వినియోగించుకుంటూ, ఇంకా సులువుగా ఉన్నత స్థాయికి చేరవచ్చు. మనస్సు క్రమంగా చైతన్యం వైపు దృష్టి సారించడమే అసలైన పరిణామానికి సంకేతం. ఆ పరిణామం పొందినవారే అమృతమయులు. ఆనంద ప్రియులు అవుతారు.

# దివ్వెల తల్లి! వరాల మల్లి!

ఆచార్య శ్రీవత్స
తిరుపతి, ఫోన్ : 9000 324 024





ఆత్మానంద జ్యోతివి!
ఆత్మీయుల కెపుడు నెయ్యమై యలరిన వి
శ్వాత్మకు రాలవు : తత కా
వ్యాత్మకు రోచిస్సుతో మహస్సుల నిమ్మా!!

ఈ దీపావళి మానవ
తా దివ్వెల వెలుగులయ్యె; తమకము లడగెన్
మేదిని గనె విజ్ఞానా
మోదమ్మె జగతికింక ముదమును గూర్చున్

అది దీపమా? కాదె! అసుర సంహారమ్ము
కావించి వెల్గిన కడిమి దివ్వె!
అది దీపమా? కాదె! అవనిలో నెలకొన్న
మౌఢ్యమ్ము తొలగింయె మహిత దివ్వె!
అది దీపమా? కాదె! అధికార పక్షాన
తేజమ్ము కలిగించు దిటవు దివ్వె!
అది దీపమా? కాదె! అభిఘాతి గుండెల్లో
గునపాలు దింపిన కొమ్ము దివ్వె!
చికిలి జన సమైక్యత కిద్ది చిహ్నమై ర
హించు సుప్రభాతావళి! హితము గూర్ప;
ఆగమించె సువర్ణ దీపాల వెల్లి!
నవ్య శోభావళి! సరసానందవల్లి!

జ్యోతివి విశాల జగతికి
జ్యోతిష్మతిని యెడలించి శోభిల్లంగా
ప్రాతిస్వికమై వరలగ
శ్వేతద్యుతులై రహించె స్నేహ ప్రియముల్

కనులు మిఱుమిట్లు గొలిపెడి కాంతులొలయ
జనుల హృదయాల ఆనంద సరణి వెలయ
వెలుగు వన్నెల చిన్నెల కులుకు వల్లి!
రావె! దివ్వెల తల్లి! వరాల మల్లి!





పలురకంబుల రవమతాబులు కులుక
మొలకలెత్తిన చెలిమి పంటలు ఫలింప
చిచ్చుబుడ్ల విహారాలు చెంగలింప
రమ్ము దీపావళీ! మహారాజ్ఞివగుచు
నవ్య జాగృతావళీ! రమ్ము భావ్యముగను
'అమృతవర్షిణి' వై యిక నడుగు పెట్టు.

# మూసీ మాస పత్రిక 'రజతోత్సవాలు'

తెలంగాణలో పత్రికల అవసరాన్ని గుర్తించి, భారతి పత్రిక క్రమంగా మరుగు పడుతున్న దశలో హైదరాబాదు కేంద్రంగా మూసీ మాస పత్రికను ప్రముఖ చారిత్రక పరిశోధకులు స్వర్గీయ బి.ఎన్.శాస్త్రిగారు 1980లో ప్రారంభించారు. ఆనాటి లెటర్ ప్రెస్‌లో వారు కష్టపడుతూ, వారి గ్రంథ రచనలు కొనసాగిస్తూ 1986 వరకు నిర్వహించారు. 1986లో తమ బృహత్తర రచనల్లో పడిపోయిన సందర్భంలో మూసీ మాసపత్రిక నిర్వహణ వారికి ఇంకా కష్టతరమై ఆగిపోయింది.

1997 నవంబర్‌లో వారి మిత్రులు దానిని తనకు అమ్మమని అడిగినప్పుడు, సాహిత్య పత్రికలను అమ్మడం కాదు, నిర్వహించుకోగలిగితే చాలు అని వారికి ఉచితంగా ఇచ్చివేశారు. కాని వారు 4 మాసాలు కూడా నిర్వహించలేక పోయారు.

ప్రారంభించి ముగించడం అనే విషయం ఇష్టంలేక ఈ కార్యక్రమానికి సహకరించడానికి ఇష్టపడి మేమిద్దరం (కమలాకర శర్మ, మనోహరి) సిద్ధమయ్యాం. అప్పటి నుండి ఇప్పటివరకు 24 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. 2000 నుండి 2002 మధ్యలో శ్రీ శాస్త్రిగారి ఆరోగ్య పరిస్థితి సరియైన విధంగా లేకపోవడం వల్ల ఒడిదొడుకులను ఎదుర్కొన్నా, తర్వాత కేవలం పత్రిక నిర్వహించబడితే చాలు అనుకుంటూ మేము, ఎవరైనా సహకరించినప్పుడు ప్రత్యేక సంచికలు వేస్తూ ఇప్పటివరకు కొనసాగిస్తూనే ఉన్నాం. ఆర్థిక, శారీరక ఒత్తిడులున్నా ఇది నిర్వహించడంలోని ఆనందం వల్ల, కార్యనిర్వహణ ఇప్పటివరకూ జరుగుతూనే ఉంది.

ఎన్నో ప్రత్యేక సంచికలు, ప్రత్యేక గ్రంథాలను ఈ 24 సంవత్సరాలలో మూసీ ప్రచురిస్తూనే ఉంది. మేము ఎప్పుడు ఎవరిని ఏ వ్యాసం అడిగినా అందరూ ఇప్పటివరకూ ఏ మాత్రం ఆలస్యం కూడా లేకుండా అందిస్తూనే ఉన్నారు. వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలను సమర్పించుకుంటున్నాం. ఇటీవల మూసీ సాహిత్య ధార నిర్వహణలోనూ, పత్రికా నిర్వహణలోనూ డా. అట్టెం దత్తయ్య గారు సహకరిస్తున్నారు.

2021 నవంబర్ నుండి 2022 అక్టోబర్ మధ్యలో ఇది 25వ సంవత్సరం. ఈ సంవత్సరం మొత్తం అవకాశం ఉన్న మంచి కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రయత్నం మొదలైంది. ఈ సంవత్సరం మూసీ మాస పత్రిక నుండి కొన్ని సదస్సులు, ప్రత్యేక ఉపన్యాసాలు, గ్రంథ ప్రచురణలు, చేద్దామనే సంకల్పం ఉంది. ఇంతకు ముందు మూసీ పత్రికలో ప్రచురించిన వ్యాసాల పరంపరను వారి సహకారాలతో తిరిగి ప్రచురించే ఆలోచనలు కూడా ఉన్నాయి. ఇంకా విధానపరమైన నిర్ణయాలు పూర్తి స్థాయిలో తీసుకోలేదు.

మూసీ పాఠకులకు, సాహితీవేత్తలకు... ఈ సంవత్సరం ఎటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందో, ఏ రకంగా ముందుకు వెళ్తే బాగుంటుందో, ఎటువంటి మార్పులు తీసుకుని వస్తే బాగుంటుందో... సలహాలను ఇవ్వాలని కోరుకుంటున్నాం. మీరు ఇచ్చే సలహాలను అనుసరించి, మన పరిమితుల్లో నూతన కార్యక్రమాలను నిర్వహిద్దామని, దానినిబట్టి మా కార్యాచరణను ప్రకటిస్తామని తెలియజేస్తున్నాం. ఇంతకాలం సహకరించిన అందరికీ మరీ మరీ ధన్యవాదాలతో ... నూతనోత్సాహంతో ఇంకా అందరి సహకారాన్ని ఆశిస్తూ.... నమస్సులు....

**– సాగి కమలాకర శర్మ, మనోహరి**

## తుకారాం అభంగం

**హరిహరాభేదము**
**చేయవలదు వాదము**
**హరిలోన హరుని జూడు**
**హరుడి నంటి నుండి హరి జోడు**

**ఒకరి హృదయ మొకరు నిలువ**
**అంతరంగ శుద్ధికి చొరువ**
**ఇక్షురస సముద్ర చందమై**
**సాగు భేదభావము విడువ**

**ఏకాఏకు లిద్దరొక్కరే**
**ఏలుబడికి బిల్వపత్రమే**
**హరికి వామాంగము హరుడు**
**హరుడి దక్షిణాంగము శ్రీహరి**

**తుకా పలుకు నొకటే కాయం**
**చేయబోకు మనసుల గాయం**




**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
**ఆదిలాబాద్.**
**ఫోన్ : 83283 33720**

# ఒగ్గు కథలో ఉపమాలంకారం

**రాజిరెడ్డి మహేందర్ రెడ్డి,** తెలుగు సహాయాచార్యులు, సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

ఫోన్ : 995 952 5955


తెలంగాణ జానపద కళారూపాలన్నింటిలో విశేష ప్రాచుర్యం పొందిన విశిష్ట ప్రదర్శన కళారూపం ఒగ్గు కథ. కథాసూత్రాన్ని ఆధారంగా చేసుకుని దమరుకం, డోలు, డప్పు వంటి వాద్య సంగీత సహకారంతో కథకు తగ్గట్టు లయబద్ధమైన అడుగుల నృత్యంతో, హావభావ ప్రదర్శనలతో ఆశువుగా చేసే కథాగాన ప్రదర్శన ఒగ్గుకథ. సంగీత, సాహిత్య, నాట్యముల సమాహారకళగా భాసిల్లిన ఒగ్గుకథ సాహిత్యంలోని సంవిధాన నైపుణ్యాలు పండిత పామరులను రంజింపజేస్తాయి. శిష్ట సాహిత్యానికి ఏమాత్రం తీసిపోకుండా ఒగ్గు కథకులు కథాగానంలో ప్రయోగించిన ఉపమాలంకార విశేషాల గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

సాహిత్య పరిభాషలో అలంకారం అంటే చెప్పే విషయాన్ని ఎదుటి వారి మనసుకు హత్తుకునేటట్లు మరింత అందంగా ఆకర్షణీయంగా చెప్పడం. అలంకారయుతమైన సాహిత్యం శ్రోతలను అలరిస్తుంది. చమత్కారంగా శబ్దాల్ని ప్రయోగించి సాహిత్యానికి అందాన్ని సమకూర్చేవి శబ్దాలంకారాలు కాగా భావ ప్రధానంగా అర్థవంతమైన పోలికలు చెప్పి ఆలోచనాత్మకమైన ఆనందాన్ని కలిగించేవి అర్థాలంకారాలు.

అర్థాలంకారాలలో పోలిక ప్రధానం. శిష్ట సాహిత్యంలో కవులు తీసుకున్న ఆకాశగంగ, స్వర్గం, హంసలు, అప్సరసలు వంటి పోలికల్ని ఊహాజనితమైన కృతిమ విషయాలు కాగా జానపద కళారూపమైన ఒగ్గు కథకులు గ్రహించే పోలికలు సన్నీల్ల కుండ, ఆంబోతు, రామచిలుక, లేగటావు, తంగేడుచెట్టు ఇవన్నీ నిత్య గోచలాలైన సహజ విషయాలు. ఇలాంటి సహజమైన పోలికలు గ్రహించి కథాగానం చేయడం వలన శ్రోతభావాన్ని సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. ఒగ్గు కథకులు ప్రయోగించే అర్థాలంకారాలు కూడా అ శబ్దాలంకారాలవలె సులభగ్రాహ్యమై అంతర్గతంగా ప్రాసాత్మకతను కలిగి ఉండి పండిత పామరులను రంజింపజేస్తాయి.

**కుంచమోలె కూలవడ్డది (మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గు కథ 8 వ భాగం )**

కుంచము ధాన్యాన్ని కొలిచే వస్తువు (సోల, తవ్వ, మానిక, అడ్డా, కుంచము ఇవి కొలతలు) ఎనిమిది తవ్వలకు కుంచము కొలత ప్రమాణము. పల్లీయులు నిత్యం ఉపయోగించేది తవ్వ. ఎప్పుడో ఒకసారి వాడేది కుంచం. తవ్వ చిన్నగా ఉండగా కొంచెం పెద్దగా ఉంటుంది. కొద్దిగా లావు పాటి మనిషి హఠాత్తుగా కూలబడి ఎటూ కదలలేని స్థితిలో ఉన్న సమయంలో కుంచమోలె కూలవడ్డది అని చెప్తారు. మల్లన్న గొల్ల కేతమ్మ కథలో రారాజు మల్లయ్య మందకాడ



దొమ్మరాటలు ఆడించి వారికి గొర్రెలను దానం చేస్తున్నాడని విన్న గొల్ల మాధవసాని కోపంతో పరుగు పరుగున వస్తూ దారిలో మల్లయ్య మహిమతో భూమికి పర్రె పుట్టి ఆ పర్రెల మాధవసాని కాలువడి కుంచవోలె కూలవడ్డది అని గయ్యాళి, నిండు శరీరంగల మాధవసానిని కుంచంతో పోల్చారు కథకులు.

కుంచం జడ పదార్థ వస్తువు. ఒకసారి కింద పడితే దాన్ని తీసి సరిగ్గా పెట్టేంతవరకు అది అలాగే ఉంటుంది. రేణుకా ఎల్లమ్మ కథలో జమదగ్ని కార్తవీర్యుని చేతిలో హతమయ్యాడని వార్త విన్న రేణుక ఎల్లమ్మ కుంచమోలె కూలవడి భర్తకోసం వల పోస్తుంది. ఇక్కడ ఆవేదనతో హఠాత్తుగా కూలబడి కదలలేని స్థితిలో ఉన్న వ్యక్తిని తెలిపే సందర్భానికి కూడా ఈ పోలికను ఉపయోగిస్తారు.

**ఆంబోతోలే అలతేరుతండు (మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గు కథ 9వ భాగం)**

సమాజంలో అనాది కాలంగా కొన్ని నియమ నిబంధనలు సహజంగానే ఆచరణలో ఉన్నాయి. వాటిలో కష్ట సమయంలో స్త్రీలు ఏడవచ్చుగాని పురుషుడు ఏడవరాదు. అనేది ఒకటి వలపోత ద్వారా స్త్రీలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తుంటారు. అలా బహిరంగంగా ఏడవడం ద్వారా హృదయం తేలికపడుతుంది. కానీ మగవాడి పరిస్థితి వేరు. అతడు బహిరంగంగా ఏడవడానికి వీల్లేదు. అలాగని మనసులో దుఃఖం పొందకుండా ఉండలేడు. పొంగి వస్తున్న దుఃఖాన్ని శోకం ద్వారానో, వలపోత ద్వారానో వ్యక్తం చేయలేడు. అలాంటి సమయంలో దుఃఖాన్ని ఆపుకుని ఆపుకుని ఎవరైనా ఆత్మీయులు దగ్గరికి రాగానే బావురుమంటాడు. అలాగే ఆంబోతు కూడా దానికి కష్టమో/దుఃఖమో కలిగినప్పుడు తనకు పరిచితమైన వ్యక్తి




కనిపించగానే అంబా అంటూ అరచి తన దుఃఖాన్ని వ్యక్తీకరిస్తుంది. అందుకే ఉపశమింప సాధ్యంకాని దుఃఖాన్ని గురించి చెప్పినప్పుడు ఆలోచనతో ఆంబోతోలె అలతేరిందు. అలతేరడం అంటే గుర్తుకు తెచ్చుకొని బాధపడటం.

మల్లన్న ఒగ్గుకథలో మల్లయ్య గొల్ల కేతమ్మతో వచ్చి తన పెళ్ళికి దేవతలనాహ్వానించగా పార్వతమ్మ వచ్చినప్పుడు తల్లి పార్వతి మీద పడి తన కష్టాన్ని గుర్తుకు తెచ్చుకునే సందర్భం. మరియు ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురాముడు తల్లి మీద ఉన్న నింద గురించి విన్నప్పుడు వారికి కలిగిన దుఃఖాన్ని కథకులు రారాజు మల్లయ్య ఆంబోతోలే అలతేరుతందు అని చక్కని ఉపమాలంకారంతో వర్ణించారు. సంప్రదాయ సాహిత్యంలో కథానాయకుడు విలపించడం నిషేధం. ఒకవేళ వినిపిస్తే రసాభాసం. కానీ మనిషన్న వాడికి సుఖదుఃఖాలు, రాగద్వేషాలు సహజం. అలాంటి సహజాతాల్లో ఒకటైన దుఃఖాన్ని సామాజిక నియమాలను అనుసరించి వ్యక్తపరిచే మగవాడి దుఃఖాన్ని ఆంబోతు దుఃఖంతో పోల్చడం ఒగ్గు కథకుల సహృదయతకు నిదర్శనం.

**సన్నీళ్ల కుండోలె సల్లబడ్డడు (మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గు కథ 2 వ భాగం)**

చల్లగా బతుకు బిడ్డ అనేది తెలుగునాట ఒక దీవెన. చల్లగ ఉండడం అంటే ప్రశాంతంగా ఉండడం. తల్లి మాటలు విన్న పరశు రాముడు సన్నీళ్ల కుండోలె సల్లబడ్డడు (ఎల్లమ్మ ఒగ్గుకథ) అప్పటివరకు కోపంతో ఉన్న వాడు శాంతి పొందిన సందర్భంలో ఈ పోలిక కనిపిస్తుంది.

బలిజ మేడలమ్మతో పంతం కట్టి బయలుదేరిన మల్లయ్యకు దారిలో అడవి అడ్డవుతుంది. మల్లయ్య కోపంతో అడవిని అంటువెడు తాడు. అడవిలో పక్షులు శోకిస్తే అది శివునికి మాల్యమై శివుని ఆజ్ఞతో పార్వతమ్మ గొల్లవేషం కట్టి మల్లయ్య వద్దకు వెళ్లి కోపంతో ఉన్న మల్లయ్యకు సల్ల తాగించగా సన్నీళ్ల కుండోలె మల్లయ్య సల్లవడ్డడు. (గొల్ల కేతమ్మ ఒగ్గు కథ 2 వ భాగం)

అప్పటివరకు కోపంగా ఉన్న వ్యక్తి శాంతాన్ని పొందాడు అనే విషయాన్ని నిత్య పరిచయ వస్తువైన సన్నీళ్ల కుండతో పోల్చి చెప్పారు.

**సొప్పకోలె సోలిపోతంద్రు (మల్లన్న కాపుల ఘట్టం 3వ భాగం)**

జొన్న, మక్కజొన్నల ఆకులను చొప్ప/ సొప్ప అంటారు. అది పశువులకు ఇష్టమైన గ్రాసము. తెలంగాణలో ప్రధానమైన ఆరుతడి పంట మక్కజొన్న. వర్షాధారంగా సాగు చేసే ఈ పంటలో వర్షాలు పడక ఎండలు దండిగా కొట్టినప్పుడు ఆకులు వాడిపోతాయి. పొడవుగా ఉండే ఈ ఆకులు వర్షం పడ్డప్పుడు దళసరిగా కనిపించి ఎండవేడికి వడలిపోతూ ఎటు వేస్తే అటు పడిపోతాయి.

మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథలో నీలమ్మ ధన గర్వంతో జంగమను కొట్టి శాపం వలన ధనం, రాజ్యం కోల్పోయి ఆరుగురు బిడ్డల్ని వెంటపెట్టుకుని అడవిపాలై నడుస్తుంటే కడుపుకన్నం లేక కంటికి నిదురలేక నీరసించిపోయిన నీలమ్మ కొడుకులు సొప్పకోలె సోలిపోతంద్రు (మల్లన్న కాపుల ఘట్టం)

అంతవరకూ రాజ భోగాలతో పెరిగిన పిల్లలు సంపదలు కోల్పోయి తిండి కరువై ఎండ వేడికి నడవలేక అలసిపోయిన విధానాన్ని సొప్పాకులతో పోల్చి చెప్పారు.

**ఎర్రంగ వండిన కొర్రసేనోలె - ఏడు మడుములు క్రుంగి పోయింది. (ఎల్లమ్మ ఒగ్గు కథ 11 వ భాగం)**

కొర్రలు, అంకెలు, సజ్జలు మొదలైనవి ఒకప్పుడు తెలుగునాట విరివిగా పండిన పంటలు కొర్రకంకి పంట కోతదశలో ఎర్రగా మారి వంగి ఉంటుంది. తలవంచినట్టు కనబడుతుంది. తప్పు చేసినప్పుడు అహం దెబ్బతిన్నప్పుడు మనిషి తల వంచుతాడు.

గంగమ్మ, కాళమ్మలు చెప్పిన దేహ బొంగురాన్ని తన ధైర్య సాహసాలతో సాధించి, 56 రాజ్యాల రాకుమారులను కాదని ఉక్కు స్తంభం పడగొట్టి, దేగను ఆధీనంలోకి తెచ్చుకుని బలిజరాజులు పెట్టిన పందెంలో గెలిచి గర్వంతో ఉప్పొంగిన పరశురాముడు తన తల్లి తప్పు చేసే తనను కన్నదనే విషయం విన్న తరువాత కృంగిపోయాడని తెలిపే సమయంలో ఎర్రంగ వండిన కొర్రసేనోలె పరశురాముడు ఏడు మడుములు కృంగిపోయిండని పోల్చి చెప్పినందున ఇది ఉపమాలంకారం. దృఢమైన కాడతో నిటారుగా ఉండే కొర్ర చేను చివరికి వంగి పోయినట్టు ధీరోదాత్తుడైన పరశు రాముడు క్రుంగిపోయాడని సహజంగా వర్ణించడం విశేషం.

**కాయలుగొట్టిన మామిడి వోలెరా కళ చిన్న పోయినాడు (ఎల్లమ్మ ఒగ్గు కథ 9 వ భాగం)**

మామిడి చెట్టు పూత, కాత దశలో నిండుగా చూడముచ్చటగా ఉంటుంది. మామిడి చెట్టు కాయలు పక్వానికి రాగానే తెంచడం పరిపాటి. ఇక్కడ కాయలు కొట్టిన అనే క్రియా విశేషణం ఉంది. కొట్టడం అంటే కాయలు రాల్చడం పూర్వపు రోజులలో మామిడి

చెట్లు చాలా పెద్దగా ఉండటం వలన కొమ్మకొమ్మకు వెళ్లి కాయల్ని జాగ్రత్తగా తెంచడం వీలయ్యేది కాదు. అందుకే కొమ్మల మీద ఒడుపుగా కూర్చుని పొడవాటి కర్రలతో కొడుతూ కాయలు రాల్చేవారు. అలా కొట్టినప్పుడు కాయలతో పాటు, ఆకులు, చిన్న కొమ్మలు కూడా రాలిపడి చెట్టుకున్న అందమంతా పోయి బోసిగా కనిపించేది. కాయ కొట్టడం అనేది చింతలు రాల్చడం, మామిండ్ల రాల్చడం అనే అర్థంలో నేటికీ తెలంగాణ ప్రాంతంలో వ్యవహరిస్తారు.


తన తల్లి ఎల్లమ్మ తప్పు చేసి తనను కన్నదనే విషయం తెలిసిన పరశురాముడు కాయలు కొట్టిన మామిడివలె కళ చిన్నబోయి ఉన్నాడని, భరింపరాని వేదనతో ఉత్సాహం కోల్పోయి విచార వదనంతో చిన్నబోయిన పరశురామున్ని కాయలు కొట్టడం వలన కాయలు ఆకులు కొమ్మలు రాలిపోయి కళ తప్పిన మామిడిచెట్టుతో పోల్చడం జరిగింది.

**నేల గీతలు గీస్తూ నెమలి వడికినట్లు ఏడ్చిండు (ఎల్లమ్మ ఒగ్గు కథ 11 వ భాగం)**

మౌనంగా రోదించడం అనే సందర్భంలో ఈ పోలిక చెప్తారు. పరశురాముడు తల్లి మీద పడిన నింద గురించి ఆలోచిస్తూ చిన్నబోయి కూర్చుని మౌనంగా బాధపడుతున్నాడని తెలియజేస్తూ నేల గీతలు గీస్తూ నెమలోలె వడికిండు/నెమలి వడికినట్టు ఏడ్చిండు. సాధారణంగా పక్షుల కన్నీరు పెద్దగా కనపడదు. పక్షి అరుపు ద్వారానే బాధను వ్యక్తం చేస్తుంది కానీ కన్నీరు కార్చినట్టు కనిపించదు. కానీ నెమలి మాత్రం కన్నీరు కారుస్తుంది. మగ నెమలి కన్నీరు త్రాగి ఆడ నెమలి గుడ్లు పెడుతుంది అనే కట్టుకథ కూడా లోకంలో ప్రచారంలో ఉంది. అందుకే పక్షుల అన్నింటిలో కన్నీరు కార్చే పక్షిగా గుర్తించబడిన నెమలి కన్నీరుతో పరశురాముని ఏడుపును పోల్చడం జరిగింది. ఈ ఉపమానానికి ముందు నేల గీతలు గీస్తూ అనే క్రియ పదం కనిపిస్తుంది. వ్యక్తం చేయలేని మిక్కిలి దుఃఖంతో, మౌనంగా కూర్చుని దీర్ఘాలోచనలో ఉన్న వ్యక్తి నేల మీద కూర్చోండి ఏదో ఒక కట్ట పుల్లతో నేల మీద గీతలు గీయడం పల్లెల్లో గమనించవచ్చు. ఆ గీతలలో ఎలాంటి విషయం ఉండదు. అలాగని ఊసుబోక గీసిన గీతలు కావవి. మనసు ఉ అచేతనావస్థలో చేసే క్రియ నేల గీతలు గీయడం. అలా మిక్కిలి బాధతో దీర్ఘాలోచనాపరుడై ఏం చేయాలో పాలుపోని స్థితిలో నేల గీతలు గీస్తూ కూర్చుని మౌనంగా రోదిస్తున్న పరశురామున్ని ఏడుస్తున్న నెమలితో పోల్చి చెప్పడం జరిగింది. కేవలం ఏడుపులోనే కాకుండా పెద్దగా ఉండడం, నల్లగా ఉండడం బ్రహ్మచారిగా ఉండడం వంటి లక్షణాల కారణంగా పరశురాముని నెమలితో పోల్చి ఉండవచ్చు.

**లేచిండు మల్లయ్య లేగటావు రీతి (మల్లన్న కాపుల ఘట్టం 8వ భాగం)**

**లేచిండు రాముడు లేగటావు రీతి (ఎల్లమ్మ ఒగ్గు కథ 10వభాగం)**




లేగటావు అంటే చిన్న లేగను కలిగి ఉన్న తల్లి ఆవు బిడ్డను విడిచి మేతకు వెళ్ళిన తల్లి ఆవు తిరిగి ఇంటికి రావడానికి సిద్ధపడే సమయంలో దాని కదలికలు (పడుకున్న స్థానం నుండి లేవడం, వేగంగా నడవడం) చాలా చురుకుగా ఉంటాయి. ఒగ్గుకథలో చాలా సందర్భాలలో రారాజు మల్లయ్య, పరశురాముడు ప్రయాణానికి సిద్ధమైన సమయంలో ఈ అలంకార ప్రయోగము కనిపిస్తుంది. స్త్రీ పురుష బేధం పాటించకుండా రారాజు మల్లయ్యను, పరశురామున్ని ఆవుతో పోల్చడం లాక్షణికులు నియమాలకు విరుద్ధమైనప్పటికీ ఒగ్గు కథకులు లింగ భేదం కన్నా లక్షణమే ప్రధానంగా భావించి పోలిక చెప్పి చక్కని ఉపమాలంకారం ప్రయోగం చేయడం విశేషం.

బలిజ మేడలమ్మతో పందెం కట్టి రారాజు మల్లయ్య మేడలమ్మ కన్నా అందమైన స్త్రీని పెళ్లాడటానికి బయలుదేరుతుంటే అడవి అడ్డమైంది. ఆ అడవిలో మల్లయ్య నడుస్తుంటే –

మాఘమ ఎండలు మలిపికొడుతున్నయి
దమనమ ఎండలు దండిగ కొడుతున్నయి
మీద ఎండగొట్టి క్రింద ధరణి కాలి
తామరంటి పాదం ధరణి మీద పెడితే ఓర్చి బుగ్గలచ్చి నవరసులు కారుతున్నయి

**ఎండకు మల్లయ్య మల్లెపువ్వోలె కాలిపోతుండు (గొల్ల కేతమ్మ ఒగ్గు కథ 3 వ భాగం)**

స్త్రీ పురుషుల శరీరభాగాల్ని పద్మాలతో పోల్చడం ప్రాచీన సంప్రదాయ సాహిత్యంలో విరివిగా కనిపిస్తుంది. (పాదపద్మాలు, ముఖపద్మం, కరకమలాలు ఇలా.....) ఇక్కడ క్లిష్టమైన సమాసపదంగా కాకుండా వినగానే సులభంగా అర్థ గోచరమయ్యే విధంగా పాదాల్ని తామర పువ్వుతో పోలుస్తూ తామర వంటి పాదం అని చెప్పిన కథకుని




మాటల్లో ఉపమాలంకారం కనిపిస్తుంది. జానపద సాహిత్యంలో క్లిష్టతకు తావు లేకుండా చెప్పే విషయం సూటిగా ఉంటుంది అనడానికి తామరంటి పాదం అనేది మంచి ఉదాహరణ. వీరుడైనప్పటికీ మల్లయ్య పాదాలు తామరల వలె సుకుమారమైనవని ఎండవేడికి, భూమి వేడికి ఆ పాదాలు ఓర్చుకుపోయి బొబ్బలచ్చి అవి చిట్లిపోయి రసి కారుతుందని కరుణారసాత్మకంగా వర్ణించారు. ఇలా పాదాలను తామరతో పోల్చి వెంటనే **"ఎండకు మల్లయ్య మల్లె పువ్వోలె కాలిపోతుండు"** అని మల్లయ్యను మల్లెపువ్వుతో పోల్చి చెప్పారు. ఈ సందర్భంలో కథానాయకున్ని పువ్వుతో పోల్చడం మీదుమిక్కిలి ఎండవేడితో వాడిపోయిన పువ్వులతో పోల్చడం నాయకుని పట్ల శ్రోతలకు అయ్యో పాపం అనుకునే విధంగా కరుణ రసపోషణకు కూడా కారణమైంది. మల్లయ్య మల్లెపువ్వు అని చెప్పడంలో శబ్ద సౌందర్యం కూడా వినిపిస్తుంది.

**తాటి చెట్టోలె ధరణి మీద పడ్డది. (వెండి గొర్రె పైడి గొర్రె కథ రెండవ భాగం)**

(వెండి గొర్రె పైడి గొర్రె ఒగ్గు కథలో ఆగొండ రాక్షసి ఆధీనంలో ఉన్న బ్రాహ్మణుల పిల్ల బాల రత్నాంగి చెప్పిన విధంగా మల్లయ్య ఆ రాక్షసి తలమీద బండి చక్రమంత ఉన్న సుడిలో దూకి రోకలి దొడ్డు బంగారి రోమాన్ని కత్తితోని ఖండించగానే ఆ గొండ రాక్షసి ప్రాణం బోయి అది తాటి చెట్టోలె ధరణి మీద పడ్డది.

తాటి చెట్టు పెద్దగా (పొడవుగా తల విస్తృతంగా) ఉంటుంది. దాని మొదలు నరికినప్పుడు కొమ్మలు లేకపోవడం వలన ఒక్కసారిగా నేల మీద పడుతుంది. అలాగే భీకరాకారంతో విరబోసుకున్న తలతో ఉన్న రాక్షసి ఒక్కసారిగా నేలకూలింది కావున ఒక్కసారిగా నేలమీద కూలిపోవడం అనే సమాన ధర్మం వలన రాక్షసిని తాటి చెట్టుతో పోల్చడం ఇందలి ఉపమాలంకారం.

**దొండకాయలోలె కండలెగురుతుంటె**

ఈ ప్రయోగంలో ప్రాసయతి వలన శబ్ద సౌందర్యంతో పాటు కండల్ని దొండకాయలతో పోల్చడం వలన ఉపమాలంకారం కనిపిస్తుంది. ఒగ్గు కథాగానంలో నేరుగా దండించే సందర్భాన్ని గురించి చెప్పినప్పుడు ఈ ప్రయోగం కనిపిస్తుంది. నీలమ్మ ధనగర్వంతో జంగమను కొట్టినప్పుడు, అడవిలో దొంగతనం చేసిన నీలమ్మను కాపువారు దండించినపుడు, కళ్యాణపట్నంలో బ్రాహ్మణుల, కోమట్ల, కాపువాళ్ళ ఇళ్ళల్లో పనిచేసిన నీలమ్మను జంగమయ్య శాపం వలన వాళ్లు కొట్టినప్పుడు దొండకాయలోలె కండలెగురుతుంటె వారు దండించారని చెప్పడం జరిగింది. దెబ్బలకు శరీరం మీద వాతలు తేలిన కండలను దొండకాయలతో పోల్చడం జరిగింది. కండలకు ప్రాసగా దొండకాయల్ని తీసుకున్నారని భావించినప్పటికి దెబ్బలకు కమిలిన శరీర భాగాలు దొండకాయల వలె ఉబ్బి ఎర్రగా మారాయనే అర్థం కూడా కనిపిస్తుంది. ఈ విధంగా శబ్ద మాధుర్యంతో కూడిన ఉపమాలంకార ప్రయోగం ఒగ్గు కథకుల పాండిత్యానికి చక్కని ఉదాహరణ అని చెప్పవచ్చు.

**మలకలంటి రాళ్లు వాయ్ మన్నువాడ దొక్కి వాయ్**
**పోకలంటి రాళ్లు వాయ్ పొడివాడ దొక్కి వాయ్**
**తవ్వలంటి రాళ్లు వాయ్ తవుడువాడ దొక్కి వాయ్**
**కుసుమలంటి రాళ్లు వాయ్ కుంకుంబడ దొక్కి వాయ్**
**ఉరుములు ఉరిమిన చందము వాయ్**
**ఊత గందిన చందము వాయ్**
**మెరుపులు మెరిసిన చందము వాయ్**
**మేటిదండు బయలెల్లెను వాయ్**
**దండు ఎల్లవట్టిరీ మంది ఎల్ల వట్టిరి ( ఎల్లమ్మ ఒగ్గు కథ )**

కార్తవీర్యార్జునుడు వేటకు బయలుదేరిన సమయంలో తన తోటలోకి బంగారు పంది రూపంలో వచ్చిన పరశురామున్ని పట్టుకునేందుకు బయలుదేరిన సమయంలో వీరుల ఉత్సాహాన్ని వర్ణిస్తూ చెప్పిన సందర్భంలోనిదీ గేయం.

కార్తవీర్యుని సైన్యంలోని వీరులు వెళ్తుంటే రాళ్లు నుగ్గు నుగ్గయ్యాయి. ఈ భావాన్ని ఒక్క మాటలో చెప్పి వదలకుండా రాళ్ల పరిమాణాన్ని నిత్యజీవితంలో కనిపించే వస్తువులైన పోకలు, తవ్వలు, కుసుమలతో పోల్చడం జరిగింది. అలాగే రాళ్లు నుగ్గునుగ్గుగా మారిన విషయాన్ని సైతం మన్ను, పొడి, తవుడు, కుంకుమ వంటి పొడి పదార్థాలతో పోల్చి చెప్పారు. రాళ్లను అది పొడిగా మారడాన్ని చక్కని ప్రాసలతో (పోక-పొడి, తవ్వ-తవుడు, కుసుమ-కుంకుమ) ఉపమాలంకార యుక్తంగా చెప్పడం విశేషం. దీనికి కొనసాగింపుగా ఉరుములు ఉరిమిన చందము మెరుపుల మెరిసిన చందము దండు బయలుదేరిందని కేవలం ఉపమానాలను తెలిపి ఉపమేయమైన సైన్యం యొక్క శబ్దాల్ని ఆయుధాల తళతళల్ని గోపనం చేసి వర్ణించారు.

వివిధ ఒగ్గుకథ లలో వివాహ ఘట్టాన్ని వర్ణించే సమయంలో పాడే కొట్నం పాటలో సైతం ఇలాంటి ఉపమాలంకారం కనబడుతుంది.

**మసికొక బొంతోలె నీవున్నవొయి నీవున్నవోయి - మాణిక్య మోలె నేనున్న బావ నేనున్న బావ**

**అంబటి కుండోలె నీవున్నవొయి నీవున్నవోయి – అంబట్ల తెడ్డోలె నేనున్న బావ నేనున్న బావ**

**చెట్టు మీద పిట్టోలె నీవున్నవొయి నీవున్నవోయి – చేసిన బొమ్మోలె నేనున్న బావ నేనున్న బావ**

**గుడి మీద కొంగోలే నీవున్నవొయి నీవున్నవోయి – గుళ్ళె లింగమోలె నేనున్న బావ నేనున్న బావ**

**దొంగోని కుక్కోలె నీవున్నవొయి నీవున్నవోయి – దొరసాని బిడ్డోలె నేనున్న బావ నేనున్న బావ (బీరప్ప ఒగ్గుకథ 3 వ భాగం)**

పాలగుండం లో స్నానం చేస్తున్న కామరతి దగ్గరకు బావ బీరయ్య మారు వేషం ధరించి వచ్చి నేను నీ బావ బీరయ్యను మనం పెళ్లి చేసుకుందాం అని అడుగుతాడు. వికారపు వేషంలో ఉన్న బీరయ్యను కామరతి అసహ్యించుకుంటుంది. ఆ సందర్భంలో ఆమెలోని అందాన్ని, గొప్పదనాన్ని మారువేషంలో ఉన్న బీరయ్య వికారపు రూపాన్ని చక్కని ఉపమానాలతో పోల్చి చెప్తుంది.

బీరయ్యను మాసిపోయిన మసిక బొంతతో, శుభ్రత లేని అంబటి కుండతో, అలంకరణ లేని చెట్టుమీది పిట్టతో, పాలిపోయిన గుడి మీది కొంగతో, భయం గొలిపే దొంగవాని కుక్కతో పోలుస్తూ కామరతిని మెరిసే మాణిక్యంతో, నాజూగ్గా సన్నగా ఉన్న అంబటి తెడ్డుతో, తీర్చిదిద్దిన బొమ్మతో, అలంకారయుక్తమైన గుడిలోని లింగంతో, ఆకర్షణీయమైన సంపద గల దొరసాని బిడ్డ తో పోలుస్తూ కామరతి నోట సాగే ఈ కథాగానం లో పాద పాదాన అనుప్రాసతో పాటు సందర్భానికి తగినట్టు ఔచిత్యవంతమైన పోలికలు కనిపిస్తాయి. అందవికారంగా ఉన్న బావ బీరయ్య పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని కామరతి ఆ విషయాన్ని నేరుగా చెప్పకుండా తన అందాన్ని మరింత గొప్పగా ఎదుట నిలిచిన బీరయ్య వికార రూపాన్ని మరింత తక్కువ చేసి వర్ణించింది. తద్వారా ఇంతటి అంతరం ఉన్న మన మధ్య సంబంధం పొసగదు అని పోలికల ద్వారా తన మనసులోని మాటను చెప్పకనే చెప్పింది. ఇందులో చెప్పబడిన మసిక బొంత, అంబటి కుండ, పిట్ట, కొంగ, కుక్క, మాణిక్యం, తెడ్డు, బొమ్మ, లింగం, దొరసాని బిడ్డ ఈ ఉపమానాలన్నీ కూడా జానపదులకు చిరపరిచితాలై ఉండడం వలన కథాగానం చేస్తున్నప్పుడే భావాన్ని సులువుగా గ్రహించగలుగుతాడు.

**అంకించి బొంకించి అల్ల నేర్పులు నేర్పి రాయసొంటోన్ని లక్కోలెజేసి అరచేతిల బెల్లం బెట్టి మోచేత నాకించి ( బీరప్ప కథ 3 వ భాగం )**

పాలగుండంలో స్నానం చేసి వస్తున్న కామరతిని బీరయ్య అడ్డగించి గొంగట్ల కూర్చుండబెట్టుకొని ఎత్తుకపోతానని అన్నప్పుడు వికార రూపంలో ఉన్న బీరయ్యతో వెళ్లలేక అలాగని అతని నుండి తప్పించుకునే మార్గం లేక అతనిమీద ఇష్టం ఉన్నట్టు నటించి




సొంపుగా మాట్లాడి ఇంటి దగ్గర దాచుకున్న ధనం తీసుకుని వస్తాను ఇక్కడే ఉండమని చెప్పి కామరతి తప్పించుకొని నాగులకొండకు చేరుకుంటుంది. ఈ సందర్భంలో తన మాటలలో కామరతి బీరయ్య మనసు మార్చిన విధానాన్ని చక్కని ఉపమాలంకారంలో వర్ణించారు. రాయి దృఢంగా ఉంటుంది, అది కరగటం కష్టసాధ్యం. లక్క మృదువైనది, కొద్దిగా వేడి తగిలిన కరిగిపోతుంది. కామరతి అంకించి బొంకించి అల్ల నేర్పులు నేర్పి అంటే రకరకాల అబద్ధాలు మాట్లాడి ఇప్పటికిప్పుడు ఎత్తుకుపోయి పెళ్లి చేసుకుంటాడని దృఢనిశ్చయంతో రాయిలాగా కఠినమైన నిర్ణయంతో/ మనసుతో ఉన్న బీరప్పను తన మాటలతో లక్కలాగా కరిగించింది అని అని బీరప్ప మానసిక స్థితిని ఏకకాలంలో రాయితో, లక్కతో పోల్చినందున ఇందులో ఉపమాలంకారం కనిపిస్తుంది. చివరగా **"అరచేతిలో బెల్లం బెట్టి మోచేత నాకించడం"** అని చెప్పడంలో ఒక సాధ్యమైన విషయాన్ని చెప్పి నమ్మించి వెళ్లిందని ధ్వన్యార్థం కూడా కనిపిస్తుంది.

**సన్నగ సున్నంల పుల్లోలె అయితడు .... (బీరప్ప ఒగ్గుకథ 3వ భాగం)**

మంద కావాలి చాలించిన బీరయ్య అక్కమాంకాళి అనుమతితో పెళ్లి కోసం బయలుదేరుతాడు. మధ్యలో మావురాల ఎల్లమ్మను కలుసుకుని నాగులకొండ నరభూపతి రాజు బిడ్డను పెళ్లి చేసుకునే ఉపాయం అడుగుతాడు. అప్పుడు రేణుకా ఎల్లమ్మ, నేను ఎరుకలసాని వేషంలో వెళ్లి ఎరుక చెప్పి నరభూపతి ఏడుగురు బిడ్డలను ఊరవతలి చందనాల బాయి దగ్గరికి వచ్చేటట్టు చేస్తాను. కానీ ఆ ఏడుగురిలో శుభ లక్షణాలు గల స్త్రీని గుర్తుపట్టి పెళ్లి చేసుకొమ్మని బీరయ్యకు చెప్తుంది. ఆ సందర్భంలో వివాహం చేసుకోబోయే స్త్రీకి ఉండవలసిన మంచి లక్షణాలు, ఉండకూడని చెడు లక్షణాలు గురించి తెలుపుతుంది. అరికాలికి మచ్చ ఉన్న పిల్లను పెళ్లి చేసుకుంటే ఆమె ఎప్పుడూ మందిల్లలోనే తిరుగుతదని, భర్తకు తిండి కూడా సరిగా పెట్టొద్దని తిండిలేక భార్య ఆదరణలేక మగవాడు కుంగిపోయి సన్నబడతాడని చెప్తూ అలా భార్య అనాదరణ వల్ల **"సన్నగ సున్నంల పుల్లోలె అయితడని వర్ణించారు"**

తమలపాకు మీద సున్నం రాయడానికి వీలుగా ఉపయోగించే పుల్ల సన్నగా ఉంటుంది. ఎందుకంటే పుల్ల లావుగా ఉంటే ఆకు

మీద ఎక్కువ సున్నంపడి తాంబూలం ఘాటుగా ఉంటుంది. అందుకనే తక్కువ పరిమాణంలో తీసుకోవడానికి వీలుగా సున్నంలో ఉపయోగించడానికి సన్నటి పుల్ల ను వాడుతారు. గ్రామీణ జీవనంలో ఆకు వేసుకోవడం (తాంబూల సేవనం) సహజంగా ప్రతి ఇంటిలో ఉండేది. అందరికీ సున్నంలో ఉపయోగించే పుల్ల ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి బక్కగా మారాడని చెప్పడానికి బదులుగా సున్నం పుల్లోలె అయిండని చక్కని ఉపమానంతో పోల్చడం వలన విషయ స్పష్టత కలుగుతుంది.

**పిడుకల కుచ్చోలె మంగలి కత్తుల మాలు కూలింది (బీరప్ప ఒగ్గుకథ 3 వ భాగం)**

గారడి వేషంలో బీరప్ప నాగులకొండ పట్నం చేరి నరభూపతిని ఏమార్చి, నరభూపతి బిడ్డ కామరతిని ఉంచిన మంగలికత్తులమాల మీదికి వెళ్లి కామరతిని గొంగట్లో పెట్టుకుని వచ్చేటప్పుడు తన కత్తితో దెబ్బ కొట్టగానే మంగలి కత్తులమాల పిడుకల కుచ్చు లాగా కూలిపోయిందని మంగలికత్తులను పిడకల కుచ్చుతో పోల్చి చెప్పినందున ఇందులో ఉపమాలంకారం కనిపిస్తుంది.

నాగులకొండ నరభూపతి రాజు బీరయ్య బారినుండి తన బిడ్డ కామరతిని కాపాడుకోవడానికి మంగలి కత్తులమాలులో ఉంచుతాడు. మంగలి కత్తి చిన్నగా పదునుగా ఉంటుంది. మాల అనేది మహల్ అనే పదానికి రూపాంతరం అంటే లోనికి వెళ్ళడానికి వీలులేకుండా గట్టి ఏర్పాట్లతో నిర్మించిన మేడ అని అర్థం చేసుకోవాలి. అటువంటి మంగలికత్తులమాల పిడుకల కుచ్చేలాగా కూలిపోయింది. పశువుల పేడతో చేసే పిడకలను వంట చెరుకుగా ఉపయోగిస్తారు. అలాంటి పిడకలను వానకు తడవకుండా ఒక మూలన పేర్చి ఉంచుతారు దాన్నే పిడకల కుచ్చు అంటారు. ఒక్కసారి క్రింది నుండి పిడకలు తీసేటప్పుడు ఆ కుచ్చు మొత్తం కూలిపోతుంది. ఇక్కడ పటిష్టమైన మంగలి కత్తుల మాలు సైతం బీరప్ప కత్తి దెబ్బకు పిడుకల కుచ్చే కూలినట్లు తేలికగా కూలిపోయిందని చెప్పడంతో అంతర్గతంగా బీరప్ప శక్తి సామర్థ్యాలు సైతం వెల్లడవుతున్నాయి.

**మేక సంద్లోలె మేము తల్లికిద్దరం (వరరచ్చ మల్లన్న ఒగ్గు కథ 2వ భాగం)**

మల్లన్న కళ్ళుగప్పి పోతుండంగ ధర్మయ్యతో పొందు చేసిన ఆకుమంచి ఎలాగైనా మల్లన్నను చంపి తమ పెళ్లికి అడ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నుతుంది. మల్లన్న వచ్చేవరకు వింత వ్యాధిగ్రస్తురాలిగా నటిస్తూ కోరల పెద్దపులి పాలు తెస్తేనే వ్యాధి తగ్గుతదని వైద్యులు చెప్పింద్రు అవి తెచ్చేదెవరన్నా అంటూ దొంగ ఏడుపులు ఏడుస్తుంది. చెల్లెలు బాధను చూసి చెల్లెలు మీద ప్రేమతో మేక సంద్లోలె మేము తల్లికిద్దరం ఎలాగైనా సరే పులి పాలు తెచ్చి నా చెల్లెను కాపాడుకుంటానని మల్లయ్య అనుకుంటాడు. తల్లికి పుట్టిన ఇద్దరు పిల్లలను మేకసంద్లతో పోల్చడంలో సహజత్వం కనిపిస్తుంది. పూర్వం ఎక్కువ సంతానం ఉన్న రోజులలో ఒకరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉంటే వారిని చాలా అపురూపంగా చూసుకునే వారు. పాలిచ్చే మేకకు, ఆవులకు, బర్లకు ఉన్నట్టు నాలుగు కాకుండా రెండు చన్నులు మాత్రమే ఉంటాయి. తమ తల్లి ఎలనాగదేవికి నేను నా చెల్లెలు ఆకుమంచిదేవి ఇద్దరమే సంతానం. మేం మేక సంద్లోలె మేము తల్లికిద్దరం ఇందులో నుండి నా చెల్లెలు ప్రాణం పోయే స్థితి వచ్చిందని వరరచ్చమల్లన్న బాధపడుతాడు. ఇద్దరు మాత్రమే ఉన్న సంతానాన్ని రెండు మాత్రమే ఉన్న మేక చన్నులతో పోల్చినందున ఇది ఉపమాలంకారం. సృష్టిలో రెండు మాత్రమే లేదా జంటగా ఉండే విశేషణాలెన్నో ఉన్నప్పటికీ ఇక్కడ ఒగ్గు కథకునికి మేక సంద్లే స్ఫురించడానికి ప్రధాన కారణం అతని వృత్తి జీవనమే. ఎందుకంటే ఒగ్గు కథకులయిన గొల్ల కురుమలకు గొర్ల పెంపకం, మేకల పెంపకం వృత్తి గా ఉంటుంది. అందుకే తాను నిత్యం గమనించే మేక చన్నులతో ఇద్దరు సంతానాన్ని పోల్చి చెప్పాడు.

కథకుని భాషలో కొద్దిగా అశ్లీలత కనిపించినప్పటికీ భావనలో ఔచిత్యవంతమైన విశేషము, చక్కని సమర్థవంతమైన సారూప్యత కనిపిస్తుంది.

**ముగింపు :** ఈ విధంగా ఒగ్గుకథా గానంలో అడుగడుగునా అనుప్రాసలతో కూడిన ఉపమాలంకారాలు కనిపిస్తాయి. ఇందులో కథకులు ఉపయోగించే ఉపమానాలు అన్నీ కూడా సహజసిద్ధాలుగా, పల్లె ప్రకృతిగత విశేషాలుగా విశేషించి శ్రోతలకు నిత్యగోచరాలుగా కనిపించేవి కావడం వలన కథాగానం లోని విషయం సులభగ్రాహ్యమవుతుంది. ఒగ్గు కథాగానంలో కన్పించే సహజసిద్ధమైన పోలికలతో కూడిన ఉపమాలంకారప్రయోగం పరిశీలించినపుడు ఉపమా కాళిదాసస్య అని పేరు గాంచిన కాళిదాసాది కవులకు ఇలాంటి జానపద కథాగానాలే మార్గం వేసాయనడంలో సందేహం లేదు.


1. **జానపద గేయ సాహిత్యము – బిరుదురాజు రామరాజు**
2. **జానపద గేయవాఙ్మయ వ్యాసావళి – నేదునూరి గంగాధరం**
3. **మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గుకథ**
4. **మల్లన్న కాపుల ఘట్టం**
5. **వరరచ్చ మల్లన్న ఒగ్గు కథ**
6. **ఎల్లమ్మ ఒగ్గు కథ**

# తెలుగు ఆకర గ్రంథాలు - గ్రంథ సూచికలు

**గోలి శ్రీలత,** సహాయ ఆచార్యులు, తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్సెట్టిపేట, మంచిర్యాల జిల్లా

ఫోన్ : 929 380 2345

**పరిచయం :** ఒక రంగానికి లేదా ఒక ఉద్దిష్ట అంశానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని సూచనామాత్రంగా, పరిచయాత్మకంగా, పథప్రదర్శ నాత్మకంగా, భవిష్యద్విస్తార కృషికి ప్రేరకంగా అందించే వాటిని "ఆకర గ్రంథాలు" అంటారు. వీటినే పరామర్శ గ్రంథాలు, సూచీ గ్రంథాలు, ఆచూకీ గ్రంథాలుఅని కూడ అంటారు. ఆంగ్లంలో Source Material Bibliographies, Reference Books అని కూడా అంటారు.

ఏ భాషకైనా, సాహిత్యానికైన ఆకర గ్రంథాల ప్రాముఖ్యత ముఖ్యమైనది. ఈ ఆకర గ్రంథాలు లేకపోతే ఆ రంగం ముందుకు కదలడం కష్టసాధ్యం. ఏదైనా ఒక రంగంలో అధ్యయనాన్ని కొనసాగించడానికి ఆ రంగంలో పనిచేస్తున్నవాళ్ళు ఆధారపడే గ్రంథాలను ఆకర గ్రంథాలు అని పిలుస్తారు. ఆలా తెలుగు సాహిత్య అభ్యసనం లేదా అధ్యయనం చేస్తున్న సాహితీ వేత్తలు, పండితులు వాళ్ళ సాహిత్య మెలకువలను నిరంతరాయంగా మెరుగు పరుచుకో వలసిన అవసరం నిత్యం ఉంటుంది. అందుకు అంతకుముందు వెలువడిన గ్రంథాల పరామర్శ అవసరం. అలా ఏదైనా ఒక రంగంలో ఉపయోగపడే గ్రంథాలను ఆధార గ్రంథాలుగా లేదా ఆకర గ్రంథాలు చెప్పుకోవడం పరిపాటి. ఈ ఆకర గ్రంథాలు అనే పదాన్ని సాహిత్య రంగంలో లేదా పరిశోధన రంగంలో వివిధ రకాలుగా నిర్వచించు కుంటున్నాం.

'ఆకరం' అంటే మూలస్థానం, దీన్నే ఇంగ్లీషులో ఆరిజిన్ (origin) అని అంటారు. ఒక భావాన్ని లేదా ఒక విషయాన్ని ఎక్కడి నుండి పట్టుకొచ్చాయో ఆ మూలమే 'ఆకరం'. దీనికి గల మరో రూపం సోర్స్ (source). ఆకరగ్రంథాలను ఆంగ్లంలో సోర్స్ బుక్స్ (source books) అని పిలుస్తారు. భవిష్యత్తులో పరిశోధనకు పనికొచ్చే ప్రాథమిక సమాచారాన్ని సమకూర్చేదే 'ఆకరగ్రంథం'.

**"ఈ ఆధార గ్రంథరచన అనగా సామాన్యమైన పని కాదు, అందును ముద్రణాది వ్యవస్థ లేనినాడు, అట్టి కార్యనిర్వహణ దుర్ఘటమనియే చెప్పవచ్చును. మొదటి ఆకర గ్రంథకర్తకు తన కాలమునకు ముందున్న గ్రంథముల విషయము చక్కగా తెలిసి యుండవలెను, రెండవది ఆయా గ్రంథములను సేకరించవలెను. మూడవది వానినన్నింటిని చదివి తాను సూచింపదలచిన పద్యములు గాని, శ్లోకములుగాని గుర్తు పెట్టుకొనవలెను. నాల్గవది - అట్టి వానిని శీర్షికల క్రింది విభాగించవలెను. అయిదవది - వానిని గ్రంథముగా వ్రాయించవలెను, ఇట్టి "పంచకరపాట్లు" పడిన గాని ఆకర గ్రంథము లోకములో నవతరించదు."** (నిడుదవోలు వేంకట రావు, వ్యాసం: తెలుగులో ఆకరగ్రంథాలు, భారతి పత్రిక, ఏప్రిల్ : 1940)

నిడుదవోలు వేంకటరావు గారు ఆకర గ్రంథాలను మూడు విధాలుగా వర్గీకరించారు. అవి

1. సంకలన గ్రంథములు (Anthologies)
2. లక్షణ గ్రంథములు (Work relating to prosody)
3. గ్రంథ సూచికలు (Catalogues)

(నిడుదవోలు వేంకటరావు, వ్యాసం: తెలుగులో ఆకరగ్రంథాలు, భారతి పత్రిక, ఏప్రిల్: 1940) ఇది వారి దృక్పథంలోని ఆకర గ్రంథాలకు వారు ఇచ్చే ప్రణాళికా పూర్వకమైన నిర్వచనం. గ్రంథ సూచికలు (Catalogues)

గ్రంథాలయంలోకి ప్రవేశించిన వెంటనే మనకు ఆ గ్రంథాలయం లోని పుస్తకాలకు సంబంధించిన సమాచారాన్ని అందించే ఒక పట్టిక అవసరం ఏర్పడుతుంది. ఆ పట్టిక లేనట్లైతే మనకు కావలసిన పుస్తకాన్ని వెతుకడంలోనే సమయం అంతా వృథా అవుతుంది. ఇక పుస్తకాన్ని చదువడానికి సమయం, శక్తి సరిపోదు. ఒకగ్రంథాలయ కేటలాగ్' అనేది గ్రంథాలయాలలోని అన్ని గ్రంథాలకు సంబంధించిన రిజిస్టరు. కేటలాగు అనేది ఒక వ్యవస్థ. అది వివిధ చోట్లలో ఉన్న అన్ని గ్రంథాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరచి ఉంచుతుంది.

గ్రంథాల సూచికలను స్థూలంగా గ్రంథాధారిత వాఙ్మయ సూచికలు, కవిజీవితాధారిత వాఙ్మయసూచికలు అని రెండు రకాలుగా విభజించవచ్చు.

**1.గ్రంథాధారిత వాఙ్మయ సూచికలు**

గ్రంథాలను ఆధారం చేసుకొని తయారు చేసే వాఙ్మయ సూచికలను గ్రంథాధారిత వాఙ్మయ సూచికలు అంటారు. ఇవి ముద్రిత గ్రంథాలు కావచ్చు, అముద్రితమైనవి కూడా కావచ్చు. అలాగే వ్యాసాలు, కథలు, నవలలు, నాటకాలు మొదలగు ఏదైనా వాఙ్మయం యొక్క సూచికలు కూడా ఉండవచ్చు. ఈ క్రింద తెలిపిన కొన్ని గ్రంథాధారిత వాఙ్మయ సూచికలను చూద్దాం.

**గ్రంథసూచిక (1863-1969)**

తెలుగు అకాడమి, హైదరాబాదు వారు 1972లో ప్రచురించిన ఈ గ్రంథం సంకలనకర్త శ్రీ వెలగా వెంకటప్పయ్యగారు. సామాన్య గ్రంథాలు, తత్త్వ-సామాజిక-భాషా-విజ్ఞాన-సాంకేతిక శాస్త్రాలు, కళలు, సాహిత్యము, చరిత్ర ఇందులోని అంశాలు.

ఈ గ్రంథసూచికలో నవలలు, నాటకాలు, కావ్యాలు వంటి సృజనాత్మక సాహిత్యాన్ని, మత వాఙ్మయాన్ని, తాత్కాలిక ప్రయోజనంతో వెలువడే పాఠ్యపుస్తకాలను, పత్రికలను, మొదలైన వాటిని వదిలిపెట్టి, తక్కిన సాహిత్య, వాఙ్మయరంగంలో 100 సంవత్సరాలలో వచ్చిన గ్రంథాలకు ఈ సూచికను పరిమితం చేశారు.

తెలుగులోనే గాక తెలుగుకు సంబంధించిన విషయాలపై ఇంగ్లీషులో వెలువడిన గ్రంథాలను కూడా ఈ సంచికలో చేర్చారు. విశ్వవిద్యాలయాలలో అముద్రితంగా ఉన్న తెలుగులో వచ్చిన పరిశోధన వ్యాసాలను (థీసిస్సులను) కూడా ఈ సూచికలో చేర్చారు.

**తెలుగు రచయితలు రచనలు (1875-1980)**

దీని సంకలనకర్త నేలనూతల శ్రీకృష్ణమూర్తి. 1875 నుండి 1990 వరకు భారతి మొదలగు వివిధ పత్రికలో వెలువడిన వ్యాసాల శీర్షికలు, రచయితల పేర్లు ఇందులో ఉన్నాయి. పరిశోధకులు కానీ, పాఠకుడు కానీ తనకు కావలసిన అంశాలమీద పూర్వ రచయితలు ఏయే రచనలు రాశారు, వాటి యొక్క శీర్షికలు ఏమిటి అనే అంశాలను ఈ గ్రంథం ద్వారా సులభంగా తెలుసుకోగలుగుతారు.

ఇది ఒక విధంగా నిఘంటువు లాంటిదే, దీనిని పరామర్శ గ్రంథం అని కూడా మనం అనవచ్చును. పరిశోధకుని యొక్క సాహిత్య పరిశోధన ప్రామాణికంగా ముందుకు సాగడానికి ఇలాంటి పరామర్శ గ్రంథాల ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. పరిశోధకులకు, రచయితలకు, గ్రంథాలయ నిర్వాహకులకు ఈ పుస్తకము ఒక కరదీపిక లాగా పనిచేస్తుంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ వారు నే.శ్రీకృష్ణమూర్తి గారి సంకలన కర్తృత్వంలో వ్యాసరచన సూచి అనే గ్రంథాన్ని 1977లో ప్రచురించారు. సాహిత్య పరిశోధకులకు ఎంతో శ్రమతో కూడిన అంశాలను కూడా సులభంగా, తక్కువ సమయంలో తెలుసుకునే విధంగా ఈ గ్రంథాన్ని తయారు చేసారు.

**వ్యాస రచనల సూచి (1875 1972)**

దీని సంకలనకర్త కూడా నేలనూతల శ్రీకృష్ణమూర్తి. పరిశోధకులకు, పరిశోధక విద్యార్థులకు, పాఠకులకు, సాహిత్య అభిమానులందరికీ ఎంతో ఉపయుక్త గ్రంథం. ఇందులో తెలుగు వారు అనేక విషయాలపై రచించిన వ్యాసాల వివరాలున్నాయి. ఎవరు ఏ పత్రికలో ఎప్పుడు రాశారో తెలుసుకోవడమనేది, చిన్నప్పుడు మనం ఇసుకలో సూది పెట్టి ఆడుకోవడం అనే ఆటలాగా ఎంతో శ్రమతో కూడుకున్న విషయం. అంతే కాకుండా ఎంతో కాలయాపన కూడా జరుగుతుంది. దానితోపాటు తెలుసుకోవాల్సిన అసలు విషయం పక్కకు పెట్టి, వేరే విషయాల మీద దృష్టి కేంద్రీకరించవలసి వస్తుంది. దానితో పరిశోధకుని యొక్క విజ్ఞానం పెరుగుతుందే కానీ, తనకు కావాల్సిన అంశాన్ని సరైన సమయంలో సమకూర్చుకోలేడు. అందువల్ల ఇటువంటి వ్యాససూచి ఒకటి అవసరం అయినది. చాలామంది తెలుగు రచయితలు వివిధ పత్రికల్లో రాసిన వ్యాసాలను సేకరించి ఈ సూచి గ్రంథాన్ని ఏర్పాటు చేసి, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి వారు ప్రచురించారు. ఇందులో 1875 -1972 సంవత్సరాల మధ్య వెలువడిన 94 తెలుగు పత్రికలలో వ్యాసాలున్నాయి.

**భారతీయ గ్రంథసూచి**

ఈ భారతీయ గ్రంథసూచి యొక్క సంపాదకుడు 1958-59, 1961-62 లలో బి.యస్. కేశవన్ మరియు 1965-66, 1973-74లలో కరణం రంగనాథరావు గార్లు. ఈ గ్రంథ సూచికలో మొదటి భాగము విషయ వర్గీకరణ క్రమములో ఉన్నది. రెండవ భాగము రచయితల పేర్లు, గ్రంథనామములు, విషయములు ఆధారముగా కూర్చబడిన అనుక్రమణిక ఉంది.

దీని ప్రకాశకులు కాశీనాధుని నాగేశ్వరరావు. ఇందులో 1927వ సంవత్సరము చివరివరకు ముద్రితమైన ఆంధ్ర గ్రంథముల జాబితా ఉంది. అంతేకాక ఆంధ్ర సాహిత్య పరిషత్తు పుస్తక భాండాగారంలోని, తంజావూరు సరస్వతీ పుస్తక భాండాగారంలోని, చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోని అనేక అముద్రితాంధ్ర గ్రంథాలను అకారాది సూచిక రూపంలో ఇచ్చారు.

ఒకసారి "మహారాష్ట్ర వాఙ్మయ సూచి'ని చూసినప్పుడు ఆంధ్ర వాఙ్మయ సూచిని కూడా తయారు చేయాలనే ఆలోచన కాశీనాధుని నాగేశ్వరరావు కలిగినదట. ముద్రిత అముద్రిత గ్రంథ పట్టికను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇది తర్వాతి తరం వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని భావించారు. ఈ పట్టిక ద్వారా కొన్ని తెలియకుండా మరుగున పడిపోయిన గ్రంథముల పేర్లను కూడా ఆ తర్వాతి తరం వారు గుర్తించి, వాటిని ఆ పుస్తకాన్ని వెతికి సంపాదించుకునే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఇందులో క్రమ సంఖ్య, కవి పేరు, కవికాలము, గ్రంథము పేరు, గ్రంథ వివరములు, విశేష విషయములు అనే అంశాలను తీసుకుని ఒక పట్టిక రూపంలో తీర్చిదిద్దారు.

**ఆంధ్ర వాఙ్మయ సూచిక**

దీనికి పోతూరి నాగభూషణం గారు సంపాదకత్వం వహించారు. దీనిలో 1927వ సంవత్సరం చివరవరకు ముద్రింపబడిన ఆంధ్ర గ్రంథముల యొక్క, కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు పుస్తక భాండాగారమున, తంజావూరు సరస్వతీ పుస్తక భాండాగారమున, చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున గల అముద్రితాంధ్ర గ్రంథముల యొక్కయు అకారాది సూచి ఇవ్వబడినది.

పైన తెలిపిన గ్రంథసూచికలే కాకా ఇంకా వరంగల్లు జిల్లా రచయితల వ్మాయ జీవిత సూచిక, ఆంధ్రనాటక దర్శిని, అక్షరక్రమ విషయ విభాగపూర్వకమగు తెలుగు వ్రాత ప్రతుల పట్టిక, తెలుగు వ్రాతప్రతుల వివరణాత్మక సూచిక, ఆంధ్ర రచయిత్రులు - సమాచార

సూచిక, విశ్వకర్మ వాఙ్మయ సూచిక, శాస్త్రీయ వాఙ్మయ సూచిక (1863–1965) మొదలగునవి కూడా ఉన్నాయి.

**2. కవి జీవితాధారిత వాఙ్మయ సూచికలు – పరిచయం**

పాఠకులకు, పరిశోధకులకు వాఙ్మయముతో పరిచయాన్ని కల్గించేవి వాఙ్మయ సూచికలు. వాఙ్మయసూచిక అనగా కేవలం గ్రంథముల పట్టిక (Catalogue) కాదు. ఆయా గ్రంథాల బాహ్య వివరాలతో పాటు వాటి అంతర విషయానికి సంబంధించిన జ్ఞానాన్ని కూడా కల్గించేవి. వీటి నిర్మాణంలో మొదట అన్నింటి వివరణ కాటలాగులో ఇచ్చి, ఆ తర్వాత వివరణలలో ప్రతి విషయం, రచనల గూర్చి సంక్షిప్త సమచారం ఇస్తారు. దీనివల్ల పరిశోధకుడికి గాని, పాఠకుడికి గాని ఆయా విషయాల యందు ఎక్కువ గల్గి, ఒక అవగాహన వచ్చి వాటిని సేకరించుకోగలుగుతాడు. ఈ కాలంలో ఎంత ముద్రణ సౌకర్యం పెరిగినప్పటికీ పాఠకుడు అన్ని పుస్తకాలను కొని చదివే స్థితిలో లేడు. అంతేకాకుండా ఒక విషయానికి సంబంధించి అనేకమంది రచించిన అనేక గ్రంథాలను కూడా సంపాదించడం కష్టం. అన్ని పుస్తకాలు కొని చదివలేని లోటును ఈ వాఙ్మయ సూచికలు కొంతవరకు తీర్చుతున్నవని చెప్పవచ్చు. ఈ క్రింద తెలుపిన కొన్ని కవి జీవితాధారిత వాఙ్మయ సూచికలు చూద్దాం.

**వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ సూచిక**

వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ సూచిక రచయిత ఆచార్య మసన చెన్నప్ప. వేటూరి ప్రభాకరశాస్త్రి వ్మాయ పీఠం తిరుమల తిరుపతి దేవస్థానం 2012లో అచ్చువేసారు. ఇది మసన చెన్నప్ప గారి పరిశోధన పుస్తకం. ప్రభాకరశాస్త్రి గారు వివిధ సాహితీ రంగంలో చేసిన కృషికి సంబంధించిన విషయాలను సులభంగా తెలుసుకుని ఆ విషయాలపై అధ్యయనం చేయడానికి ఈ గ్రంథం ఎంతో ఉపయోగ పడుతుంది.

**నిడదవోలు వెంకటరావు వాఙ్మయ సూచి.**

నిడదవోలు వెంకటరావు జీవితం వ్మాయ సూచిక అనే సిద్ధాంత వ్యాసాన్ని ఐదు భాగాలుగా విభజించడం జరిగింది. అవి జీవితం, వ్యక్తిత్వం, వాఙ్మయ సేవ, విశిష్టత, వాఙ్మయ సూచిక.

**రాయప్రోలు వాఙ్మయ జీవిత సూచిక**

ఇది వారికి 88వ పుట్టినరోజు కానుకగా సమర్పించబడినది. దీనిని కాత్యాయనీ విద్మహే గారు ఎంతో కష్టపడి తయారు చేశారు. దీనిలో సబ్బారావుగారి సంక్షిప్త జీవన రేఖాచిత్రం, తర్వాత కావ్యాలు, కావ్య సంపుటాలు, నాటకాలు, వచన రచనలు, వ్యాసాలు, ఇంగ్లీషు వ్యాసాలు, పీఠికలు, సంపాదిత గ్రంథాలు, తర్వాత అనువాదాలు (రాయప్రోలు చేసినవి), రాయప్రోలు రచనలకు హిందీ అనువాదాలు, ఇంగ్లీషు అనువాదాలు ఉన్నవి.

**విశ్వనాథ వాఙ్మయ జీవిత విశేషసూచిక (విమర్శిని) 1977**

దీని సంపాదకుడు కేతవరపు రామకోటి శాస్త్రిగారు. ఇది 1) ఆత్మచిత్రం, 2) వాఙ్మయచిత్రం, 3) జీవితచిత్రం. అని మూడు భాగాలుగా ఉంది. ఆత్మచిత్రంలో విశ్వనాథవారు స్వయంగా వివిధ పత్రికలకు వ్రాసిన వ్యాసములలో కొన్నింటిని పొందుపరిచినారు. దీనిలో నా తొలిరచన, నా గొప్ప రచన, నేను నా రచన వేయిపడగల లోని అంతరార్థము, నేను నా రచనాస్వభావము, పల్లెల శోభ తెలియని వారికి నా కావ్య సంపద అర్థం కాదు, అను తెలుగు వ్యాసాలతో పాటు My self -- My work, Speech of Dr.VSN, Vishwanatha Partician among Telugu poets అనే అంశములు కలవు.

ఇక వాఙ్మయ చరిత్రలో విశ్వనాథ వారి 18 రచనల గూర్చిన విమర్శన ఇందులో ఉంది. ఇక జీవిత చిత్రంలో 17 మంది తెలుగు పండిత ప్రముఖులు విశ్వనాథ గారిపై వెలుబుచ్చిన అభిప్రాయ వ్యాసావళి పొందుపరచబడియున్నవి. 1930 నుండి 1976 వరకు అక్కడక్కడ ఉన్న డైరీలలోని విషయాలను (ముఖ్యమైనవి) ఇవ్వడం జరిగింది.

**కొడవగంటి కుటుంబరావు –వాఙ్మయ జీవిత సూచిక**

కాత్యాయినీ విద్మహే గారు బహుశ్రమ కోర్చి సేకరించిన కుటుంబరావుగారి సంపూర్ణ సాహితీ సమాచారాన్ని దీనిద్వారా మనకు అందించారు. దీనిలో కొడవగంటి కుటుంబరావు గారి జీవితం గూర్చి ఆమెగారు పరిచయాత్మకంగా ఇచ్చిన సమాచారంతో కొ.కు. గారి గూర్చి కొంత అవగాహన ఏర్పడుతుంది. ఉదా:– వ్యాసాలు, వ్యాస సంపుటాలు, పీఠికలు, సమీక్షలు, కథలు, కథాసంపుటాలు, గల్పికలు, నవలలు, నవలాసంపుటాలు మొదలగునవి. కొ.కు వాఙ్మయ విమర్శనం, (తెలుగులో, ఇంగ్లీషులో పుస్తకాలు) కొ.కు గారి వ్యాసాలు వగైరా దేనిలో ప్రకటితమయ్యాయో వాటి వివరాలు, ప్రచురణ కర్తల వివరాలతో సహా ఆమె వివరించారు.

**కోవెల సుప్రసన్నాచార్యుల వాఙ్మయ జీవిత సూచిక**

దీనిని టి.శ్రీరంగస్వామి రచించారు. శ్రీలేఖ సాహితి విద్యారణ్యపురి వరంగల్లు వారు 1991లో ప్రచురించారు. ఎక్కువగా వ్మాయ జీవిత సూచికలు అన్నీ కాకతీయ, ఉస్మానియా, హైద్రాబాదు కేంద్ర విశ్వవిద్యాలయాల పరిశోధనల రూపంగా వచ్చినవే ఉన్నాయి. ఈ కోవెల సుప్రసన్నాచార్యుల – వాఙ్మయ జీవితసూచిక మాత్రం విశ్వవిద్యాలయేతరమైన శ్రీలేఖ సాహితీ సంస్థ ద్వారా వెలువడింది. టి. శ్రీరంగస్వామి గారు ఈ గ్రంథంలో కేవలం సుప్రసన్నగారి గ్రంథాల పట్టికనే కాకుండా సుప్రసన్నాగారి కావ్యాలపై సమీక్షను కూడా చేయడం జరిగింది. ఇలాంటి గ్రంథాలు భావి పరిశోధకులకు ఎంతగానో పనికి వస్తాయి. కాబట్టి ఇందులోని సమాచారం సరిగ్గా ఉండాలి. ఒకవేళ ఏదైనా సమాచారం దొరకకపోతే దొరకలేదని చెప్పాలి. ఒక వ్యాసం గురించి ఈ గ్రంథంలో చెప్పినప్పుడు ఆ


వ్యాసం ఏ పత్రికలో అచ్చయిందో, ఆ పత్రిక సంచిక, సంపుటి, తేదీలను తప్పనిసరిగా ఇవ్వాలి. ఇందులో 12, 13, 37 వ్యాసాలున్న శీర్షిక కింద ఇలాంటి విషయాలను ఇచ్చారు.

ఈవిధంగా పైన తెలిపిన గ్రంథసూచిలే కాకుండా తెలుగు సాహిత్యంలో ఇంకా ఎన్నో ఉన్నాయి. ప్రసిద్ధమైన కొన్నింటిని తీసుకొని, వ్యాస పరిధిని దృష్టిలో పెట్టుకొని స్థాలీపులకంగా కొన్నింటిని మాత్రమే ఇక్కడ వివరించాను. సాహిత్య పిపాసులలో మరింత జిజ్ఞాసను రేకెత్తించే ఇలాంటి గ్రంథసూచిలు రావల్సిన ఆవశ్యకత ఇంకా ఎంతో ఉంది.

# పద్యమనోహరం - 24


## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**ధనమునకు దానమును, దప**
**మున కాచారమును, రాజ్యమున కాజ్ఞయు, జీ**
**వనమునకు యశము, విద్యకు**
**వినయంబును, నీతులకు వివేకము ఫలముల్.**

అనేక సామాజిక బాధ్యతలను, మనిషి తన వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరించుకోవలసిన అవసరాన్ని చెప్పిన ఈ చిన్న పద్యం సుప్రసిద్ధ కవి కొఱవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక లోనిది.

ధన సంపాదన కేవలం తమ తమ స్వభావాల వరకే వినియోగిస్తే వానికొక గొప్ప రాణింపు లభిస్తుంది. అదేవిధంగా తపస్సనేది కేవలం తపస్సు కోసమో, వ్యక్తిగత వృద్ధి కోసమో కాకుండా తాను ఆ తపస్సు వల్ల పొందిన పారమార్థిక జ్ఞానాన్ని ఆచరణలో చూపి లోకానికి ఉపయోగపడాలి. రాజ్య రక్షణలో శాశించి కట్టడి కీర్తిని పొందాలంటే మంచి జీవనము కావాలి. నడవడిక సవ్యంగా ఉన్నప్పుడే లోకం అతనిని కీర్తిస్తుంది. అదేరీతిలో విద్య మనసిలో వినయాన్ని పెంచాలి. అహంకారాన్ని కాదు.

సాధారణంగా ధనార్జన ఒక్కోసారి మనిషిని పూర్తి స్వార్థపరుణ్ణి చేస్తుంటుంది. తన ధనార్జన తనవరకే నన్న సంకుచిత భావాల్ని పెంచుతుంది. వాని నుండి దూరమై విశాల దృష్టితో తన సమాజాన్ని గురించి ఆలోచించడానికి అతనిలో దానగుణం ఉండాలి. అంటే ధన సంపాదనకు ఫలం దానగుణం కావాలన్నది కవి హృదయం. అప్పుడే ఆ ధనానికి విలువ. తపస్సు ఆచరించేవారు పలు పారమార్థిక ప్రయోజనాలు పొందుతారు. వాటిని ఆచరణలో పెట్టడమే అతని ధ్యేయం కావాలి. ఆచరణ శూన్యమైన తపస్సు వ్యర్థం. మహాభారతం లోని కౌశికుని కథే దానికి సాక్ష్యం. కోపంతో కొంగను భస్మం చేయడం, పతివ్రతపై కోపగించుకోవడం వంటి లక్షణాలు తపస్వికి ఉండరాదు. చివరకు ఆచరణాత్మక ధర్మాన్ని ధర్మవ్యాధుని వల్ల తెలుసుకోగలిగాడు ఆ తపస్సంపన్నుడు. తన విధ్యుక్త ధర్మమే తపస్సు. దాన్ని ఆచరణలో చూపాలి. విస్తృత కీర్తి వ్యక్తి నడవడికపై ఆధారపడి ఉంటుంది. మంచి నడవడిక వల్ల కీర్తి వచ్చి మనిషి బ్రతుకు సార్థకమౌతుంది. అతని నడవడికయే తాను జీవించే సమాజానికి ఉపయుక్తమౌతుంది. అదేవిధంగా విద్య ఎంతనేర్చినా అది వినయ రహితమైతే శోభించదు.. అందుకే మన పూర్వులు "విద్యా దదాతి వినయం" అన్నారు. చదువు అహంకారాన్ని అధికం చేస్తే తనకు, తన సమాజానికి కూడా ప్రమాదం. అందుకని విద్యార్జనకు వినయమే ఫలం కావాలన్నది ఆశయం. ఏది మంచో, ఏది చెడో తెలుసుకునే వివేకం విద్య వల్ల వస్తుంది కనుక దాన్ని మానవ సంక్షేమానికి ఉపయోగించాలి. మానవ సంక్షేమమే తన సంక్షేమం కదా!

ఇంత చిన్న అందమైన కందం చెప్పిన కవిరాజు గోపరాజు నిజామాబాదుగా పిలువబడే ఇందూరు ప్రాంతంవాడు. వారి చినతాత గారైన కొఱవి సత్యనారన గారు మోదటి ఆంధ్ర కవితా పితామహుడు. అల్లసాని పెద్దన కన్నా పూర్వం ఈ బిరుదం కలిగిన కవి సత్యనారన. గోపరాజు ఇంటిపేరు "కొఱవి". ఇది నేటి మహబూబాబాదు జిల్లాలో వీరభద్రస్వామి కొలువై ఉన్న ఒక గ్రామం.

సంస్కృతంలోని విక్రమార్క చరిత్రము ఆధారంగా తెలుగులో రచించిన ఈ సింహాసన ద్వాత్రింశికలో విక్రమార్కుని మెట్లపై ఉన్న 32 బొమ్మలు చెప్పిన కథలున్నాయి. ఈ కథలలో విక్రమార్కుని సాహస ఔదార్యాలకు సంబంధించిన అనేక విశేషాలతో పాటు పలు సార్వకాలిక, సార్వజనీన సత్యాలు కూడా సందర్భోచితంగా పొందుపరుప బడినాయి.

# తెలంగాణ తొలితరం చారిత్రక పరిశోధకులు - ఆదిరాజు వీరభద్ర రావు

**డా. సాగి కమలాకర శర్మ**, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉ.వి. ఫోన్ : 9704 227744

నిరంతర మథనం వల్ల తాము తెలుసుకుని, సాధించిన నూతనాంశాలను, ఛేదించిన రహస్యాలను తరువాతి తరానికి అందించేవారు పరిశోధకులు. వీరికి తాత్కాలికంగా పేరు ప్రఖ్యాతులు కలగడం ఉండదు. కాని కాలక్రమంలో వారి పరిశోధనల ఫలితాన్ని తరువాతి తరాల వారు అనుభవించడం మొదలైన తర్వాత వారు ప్రాతఃస్మరణీయులవుతారు. అటువంటి చారిత్రక పరిశోధకులలో పేరెన్నిక గన్న వారు శ్రీ ఆదిరాజు వీరభద్ర రావు గారు.

తెల్లని తలపాగా లేక గాంధీటోపీ, ముడతలు పడిన పాతకోటు, నీరుకావి ధోవతి, బక్కచిక్కిన శరీరం, తాంబూల రంజితమైన బోసినోరు, ప్రసన్న మందహాసం, స్నేహపూర్ణమైన చూపులు, భుజముపై వ్రేలాడుతున్న సంచి, నిరాడంబర విగ్రహం .. ఇది ఆదిరాజు వీరభద్ర రావుగారి రూపం.

తెలంగాణాకు చెందిన తొలి చారిత్రక పరిశోధకులైన శ్రీ ఆదిరాజు వారు 16 నవంబర్ 1890న ఖమ్మం జిల్లా మధిర తాలూకా దెందుకూరులో జన్మించారు. తల్లిదండ్రులు వెంకమ్మ, లింగయ్య పంతులు. మిక్కిలి బీదవారైన లింగయ్య పంతులు గారు తన గ్రామంలోని కరోడ్గిరినాకాలో (కస్టమ్స్ ఆఫీస్) గుమాస్తా పనిచేస్తూ తక్కువ జీతంతో మర్యాదగా జీవితం గడుపుతున్నారు. విధివశాత్తు ఆదిరాజు వారికి ఐదు సంవత్సరాల ప్రాయంలోనే పితృవియోగం కలిగింది. తల్లి తాను చెల్లెలి ఇల్లు చేరుకొని కుమారుని పెద తండ్రి గారి వద్దకు పంపించింది.

పెదనాన్న ఆదిరాజు రామకృష్ణారావుగారు అప్పుడు చింతకాణి పోలీసు ఠాణాలో 'నవిసిందా' (లేఖరి) గా పనిచేస్తున్నారు. వారి పెంపకంలో వీరభద్ర రావు గారికి ఖమ్మం తాలూకా కొణిజెర్ల, చింతకాణి గ్రామాల్లో ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. వీధిబడి ఉపాధ్యాయుడు వీణె సీతారామయ్య గారు చక్కని బోధనాశక్తి గల పండితుడు. భారతీయమైన సంప్రదాయాలు, ఆచారాలు, వ్యవహారాలు, సాహిత్యం, గణితం మొదలైన అంశాలతో కూడుకున్న ఒకనాటి వీధిబడులుండేవి. ఆదిరాజు వీరభద్ర రావుగారి విద్యాభ్యాసానికి ఆ వీధిబడి చక్కని పునాది అయింది. తల్లి వెంకమ్మ గారు ఉన్నత విద్యావకాశాల కోసం తమ కుమారుని హైదరాబాదులో ఉన్న శ్రీమంతులు, ఉదారులు, తమ దూరపు బంధువులు అయిన హైదరాబాదు వాసులైన శ్రీ రావిచెట్టు రంగారావు గారి దగ్గరకు పంపినారు. రంగారావు గారి భార్య లక్ష్మీనరసమ్మ గారు, వెంకమ్మ గారు ఒక ఊరివారు. ఊటుకూరి వారింటి ఆడబిడ్డలు. రంగరావు దంపతులు వీరభద్ర రావుగారిని తమ కుమారుని లాగా



ఆదరించినారు. సాహిత్యాభిమానులు, దేశభక్తులు అయిన రావిచెట్టు వారి సాంగత్యం వల్ల ఆదిరాజు వారి జీవితంలో ఎంతో ఉన్నతమైన మార్పులు ఏర్పడినాయి.

11 సంవత్సరాల వయసులో హైదరాబాదులో తరువాతి విద్యాభ్యాసం మెట్రిక్ వరకు చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో పూర్తి చేశారు. అనారోగ్య కారణాల వల్ల చదువుకు కొంత అవాంతరం ఏర్పడింది. హైదరాబాదుకు చేరేవరకే వీరభద్ర రావు గారికి భాగవత భారత రామాయణ గ్రంథాలను చదవడం, అమరం లాంటి నిఘంటువులను కంఠత: నేర్చుకోవడం, శ్లోకాలు పద్యాలు శ్రావ్యంగా చదవడం వచ్చు.

1901లో ఏర్పాటు చేయబడిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వ్యవస్థాపకులలో రావిచెట్టు రంగారావుగారొకరు. మహా మేధావులు, సుప్రసిద్ధ ప్రామాణిక పరిశోధకులు అయిన కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణ రావుగారు, రావిచెట్టు రంగారావు గారు, మునగాల రాజా శ్రీ నాయని వెంకటరంగారావు గార్లు భాషా నిలయ వ్యవస్థాపనలో ప్రముఖులు. అదేవిధంగా వీరు ముగ్గురరే 'విజ్ఞాన చంద్రికా గ్రంథమాల'ను ప్రారంభించారు. ఈ రెండింటికి రావిచెట్టు వారే కార్యదర్శి. ప్రారంభంలో ఈ రెండు కార్యాలయాలు కూడా రావిచెట్టు రంగారావు గారింటిలోనే ఉండేవి. తరువాత భాషానిలయం వ్యవస్థాపన జరిగింది.

అనేక కార్యక్రమాలలో ఉన్న రంగారావు గారు తమకు తీరిక లేక ఆదిరాజు వీరభద్ర రావుగారిని భాషానిలయములో లైబ్రేరియన్

పనిలో నియమించినారు. రావిచెట్టు వారింటిలో ఉండడం వల్ల ఈ రెండు సంస్థల నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం కలిగింది. అనేక భాషా సాహిత్యాల అధ్యయనం ద్వారా సామాజిక చైతన్యం కలిగించే దిశలో కృషి ప్రారంభించిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ఆదిరాజు వారి రచనావ్యాసంగానికి, పరిశోధనలకు, అధ్యయనానికి వేదికగా నిలిచింది. వీరి స్వయంకృషికి మొదటి పాఠశాల శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం.

కొంత కాలానికి విజ్ఞాన చంద్రికా గ్రంథమాల కార్యాలయం మదరాసుకు మారింది. రావిచెట్టు వారి నివాసం కూడా అక్కడికే మారింది. వారి నిర్బంధంతో ఆదిరాజు వారు ఆ కార్యాలయంలో లేఖకులుగా నియమించబడినారు. మదరాసులో ఉన్న కాలంలో వారికి కందుకూరి వీరేశలింగం పంతులుగారు, చిలుకూరి వీరభద్ర రావుగారు, గురజాడ అప్పారావు గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, వేమూరి విశ్వనాథ శర్మ గారు వంటి విద్వాంసులు, పరిశోధకులతో, మేధావులతో కలిసి పనిచేసే సదవకాశం లభించింది. పంతులుగారి విమర్శనాశక్తి, రచనాపాటవం ఈ కాలంలో మరింత విస్తరించింది.

ఆదిరాజు వీరభద్రరావు గారు 17వ సంవత్సరంలో రంగారావుగారి ప్రేరణతో 1907లో వివాహం చేసుకున్నారు. వారి సహధర్మచారిణి పింగళి వారి ఆడబిడ్డ లక్ష్మీనరసమ్మ గారు. వారి తోడ్పాటుతో ఆదిరాజు వారి జీవితం ఆనందంగా గడించింది. వీరికి సంతానం లేదు. తమ జీవితంలో కలిగిన ఇబ్బందులను గుర్తు చేసుకొని తమ బంధువులలో నిస్సహాయ స్థితిలో ఉన్న ఇద్దరు బాలురను, ఇద్దరు బాలికలను తీసుకొని వచ్చి పెంచి, చదువులు చెప్పించి, పెండ్లిండ్లు చేసి మంచి చెడ్డలను చూసినారు. ఈ పిల్లలే తమ పిల్లలు కావడం వల్ల వారి సంతానం తమకు బాధ్యతగా కూడా మారింది. ఆదిరాజు వారు వార్ధక్యంలో మంచంపైన ఉండగానే వారి శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారు కాలధర్మం చెందినారు. వీరభద్ర రావు గారు అద్వైతులు. వైదిక ధర్మ నిష్ఠులు. ప్రతి సోమవారం ఉపవాసం చేస్తూ ఉండేవారు. హైందవాభిమానం కలిగినవారు. ఇతర మతాల వారితో మైత్రి ఉండేది. తెలుగు భాషపై అభిమానం అధికం. ఉ రుదూ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల, హిందీ సాహిత్యాలపై సమానమైన ఆదరం కలిగి ఉండేవారు. సమన్వయ దృష్టికి వీరభద్ర రావుగారు మొదట పేర్కొనదగిన వారు.

1908 నుండి 1914 వరకు మదరాసులో వీరు ఉద్యోగ జీవితంలో ప్రశాంతంగా గడిపినారు. తరువాత కొన్ని అవాంతర పరిస్థితుల వల్ల ఉద్యోగాన్ని మానుకొని వారు హైదరాబాదుకు తిరిగి వచ్చినారు. 1914లో నగరానికి వచ్చిన వెంటనే సికింద్రాబాదులో మహబూబ్ కళాశాలలో ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా 1921 వరకు పనిచేశారు. ఇది ప్రైవేటు సంస్థ. తర్వాత తాము విద్యను అభ్యసించిన చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో తెలుగు బోధకులుగా ప్రవేశించినారు. ఇది ప్రభుత్వ పాఠశాల. 1921 నుండి 1948 వరకు దీనిలో వారు పనిచేసినారు. తమ 58వ ఏట ఉద్యోగం నుండి విరమించినారు. తర్వాత మాడపాటి వారు తాము నిర్వహిస్తున్న నారాయణగూడ బాలికోన్నత పాఠశాలలో పనిచేయాలని కోరగా 1949 నుండి 1953 వరకు వారు పనిచేసినారు.

ఉద్యోగం నిర్వహిస్తూ, రచనా వ్యాసంగం చేస్తూ వారు ప్రతిఫలాపేక్ష లేక ప్రజా సంస్థలతో సహరించేవారు. సమకాలికులైన రచయితలతో, పత్రికాధిపతులతో, సంఘ సేవకులతో, రాజకీయ నాయకులతో వారికి సన్నిహిత సంబంధాలుండేవి.

**ఆదిరాజు వారి రచనా వ్యాసంగం :**

ఆదిరాజు వారి కలం నుండి వేరు వేరు సందర్భాలలో జాలువారిన రచనలు, పరిశోధనాత్మకాంశాలు అనేకం. వానిని ఒకసారి పరిశీలిస్తే తెలంగాణ కేంద్రంగా మొట్టమొదట జరిగిన పరిశోధనలు మనకు అర్థం అవుతాయి. వారి గ్రంథాలను విశ్లేషిస్తే ఆ యా భావాలు మనకు పరిచయం అవుతాయి.

ఆదిరాజు వారి మొదటి గ్రంథం **"జీవిత చరితావళి"**. వారు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి కార్యాలయం మద్రాసులో పనిచేస్తున్నప్పుడు ఆ గ్రంథ మండలి సభ్యులైన వేమూరి విశ్వనాథ శర్మగారి ప్రోత్సాహంతో 1910లో ఈ పుస్తక రచన చేశారు. దీనిలో రావిచెట్టు రంగారావు, ఉమేశచంద్ర బెనర్జీ, రమేశచంద్ర దత్తు గారల జీవిత చరిత్రలున్నాయి. ఈ గ్రంథం 1911లో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి పక్షాన ప్రకటించారు.

హైస్కూలు విద్యార్థుల కోసం ఆదిరాజు వారు 1957లో ప్రకటించిన మరో గ్రంథం **'చైతన్యము'.** దీనిలో చైతన్య మహాప్రభువు, యులిస్సిజ్, మధుకైటభులు, జేమ్స్ గార్ ఫీల్డ్ అనే నాలుగు కథలున్నాయి.

విద్యార్థుల కోసమే వ్రాసిన మరో గ్రంథం **'లలిత కథావళి'**. ఇది 1950లో ఆంధ్ర బుక్ హౌస్ వారిచే ప్రచురితమైంది. దీనిలో నాలుగు పాఠాలున్నాయి. 1. రమేశ్ చంద్ర దత్తు ఐసిఎస్ 2. అజంతా–ఎల్లోరా 3. పెరుస్యుసు 4. శ్రావణి.

ఆంధ్ర బుక్ హౌస్ వారు 1950లో ఆదిరాజు వారి **'రత్నప్రభ'** అనే మరో గ్రంథాన్ని ప్రచురించారు. అరేబియన్ నైట్స్ కథల్లోని అల్లాఉద్దీన్ విచిత్రదీపం కథ భారతీయ వాతావరణంలో చిత్రించినారు వీరభద్రరావుగారు.

వీరి పరిశీలనాశక్తికి, పరిశీలనాసక్తికి, పరిశోధనా పటిమకు ఉదాహరణగా చెప్పుకోదగిన గ్రంథం **'ప్రాచీన ఆంధ్ర నగరములు' (మొదటి భాగం)**. ఆంధ్ర చంద్రికా మండలి నాల్గో గ్రంథంగా రావిచెట్టు రంగారావుగారికి అంకితంగా 1950లో మొదటిసారి ప్రకటించబడింది. దీనిలో ఆలంపురం, ఆనెగొంది, కల్యాణి,

కొండాపురం, కొలనుపాక, గోలకొండ, పానుగల్లు, ప్రతిష్ఠానము, భువనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుకొండ అనే పన్నెండు ప్రాచీన నగరాల చరిత్ర ఉన్నది. ఈ గ్రంథం రెండు మూడు సార్లు పునర్ముద్రణం పొందింది.

పది చారిత్రక వ్యాసాల సంకలనంగా **'మన తెలంగాణము'** పేరుతో ఆదిరాజు వీరభద్రరావు రాసిన గ్రంథాన్ని వట్టికోట ఆళ్వారుస్వామి వారు దేశోద్ధారక గ్రంథమాల తరపున ప్రచురించారు. కాకతీయుల రాజవంశం, కాకతీయులు సాంఘిక చరిత్ర, తాళపత్ర గ్రంథములు, నాణెములు, శాసనాలు, పాకాల సరస్సు, దేవాలయాలు, గోలుకొండ పట్టణము, కెయిరనుల కథనము, తెలంగాణము అనే వ్యాసాలున్నాయి.

భారతీయ పౌరాణిక గాథల గూర్చి విద్యార్థులకు వచ్చిన అనుమానాలు తీర్చడానికి సమానమైన పాశ్చాత్య సంబంధ పురాణాలను వెతికి, గ్రీకు, రోమన్, బాబిలోనియా గాథల పుస్తకాలన్నీ చదివి, పిల్లల సందేహాలు తీర్చినవారు ఆదిరాజు వారు. అవే గాథలను సుజాత మొదలైన పత్రికల్లో ప్రచురించారు. ఎన్నో గాథలలో 68 గాథలను ఏరి రాజమహేంద్రవరం విశ్వసాహిత్య మాల వారు 1958లో **'గ్రీకు పురాణ గాథలు'** అనే పేరుతో ఒక పుస్తకం ప్రచురించారు.

**'తెలంగాణ శాసనములు' (మొదటి సంపుటం)** అనే గ్రంథం వీరభద్ర రావుగారి శాసన పరిశోధనకు పరాకాష్ఠ. ఈ గ్రంథం 1935లో ప్రకటింపబడింది. దీనిలో 57 కాకతీయులవి, 42 చాళుక్యులవి, 24 ఇతరులవి, మొత్తం 123 శాసనాలు, వాటి పరిష్కరణ ఇతర వివరాలున్నాయి.

ఓరుగల్లు పురాన్ని పునరాక్రమించి దాని పూర్వవైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించిన మహావీరుడు షితాబ్‌ఖాన్ అనే బిరుదం గల సీతాపతి రాజు. ఇతని శాసనం ఓరుగల్లు కోటలో ఉంది. **'షితాబుఖాన్'** పేరుతో పది ప్రకరణాల గ్రంథంగా లక్ష్మణరాయ పరిశోధక మండలి పక్షాన వీరభద్రరావు గారు 1961లో ప్రకటించి తెలుగువారి చరిత్రకు, పరిశోధనకు గొప్ప ఉపకారం చేశారు.

85 శాసనాలు, పాఠ పరిష్కారాలతో కూడుకున్న **'తెలంగాణ శాసనాలు' (రెండవ సంపుటం)** లక్ష్మణరాయ పరిశోధక మండలి పక్షాన, దాని కార్యదర్శిగా పీఠికను సమకూర్చి ఆదిరాజు వారు ప్రకటించారు. శేషాద్రిరమణకవులు, గడియారం రామకృష్ణ శర్మ గారు సేకరించి పరిష్కరించిన శాసనాలివి.

1954లో వీరభద్ర రావుగారు ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన జీవితచరిత్రలు వ్రాసి ప్రకటించారు. రఘునాథ నాయకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుడు మొదలైన నలుగురి చరిత్రలు చిన్న పిల్లలకు అర్థమయ్యేవిధంగా, అవసరాలను తీర్చే విధంగా, నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ గ్రంథంలో శ్రీ వీరభద్రరావు గారు రచించారు.

మిఠాయి చెట్టు, తామర కొలను, నలుగురు పాటకులు అనే మూడు కథలతో కూడుకున్న **'మిఠాయి చెట్టు'** అనే గ్రంథం ఆంధ్ర సారస్వత పరిషత్ వారే ప్రకటించారు. గోల్కొండ పత్రికలో అప్పుడప్పుడు వెదజల్లే హాస్య విశేషాలలో నూరింటిని ఒక గుచ్ఛంగా చేసి **'నవ్వుల పువ్వులు'** అనే గ్రంథంగా 1953లో ప్రచురించారు. గోలకొండ ముద్రణాలయం వారు ముద్రించిన గ్రంథం ఇది.

మాడపాటి హనుమంతరావు గారి 81వ దినోత్సవం సందర్భంగా సన్మాన సంఘం పక్షాన 1965లో **'మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర'** అనే 119 పుటల గ్రంథాన్ని ఆదిరాజు వారు రచించారు.

1927 ప్రారంభంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రజతోత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా 1927లో ఒకటి 1928లో మరో ప్రత్యేక సంచికలు వెలువడినాయి. ఈ రెండు సంచికల బాధ్యత వహించింది ఆదిరాజు వారే. 1951లో భాషానిలయం స్వర్ణోత్సవాలు జరిగాయి. ఆ స్వర్ణోత్సవ సంచికను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వారు వీరభద్ర రావు గారే. 1946లో మాడపాటి వారి షష్టిపూర్తి ఉత్సవాలు ఆంధ్రదేశమంతటా జరిగాయి. ఆ సందర్భంగా వెలువడిన ఒక గొప్ప సంచిక ప్రఖ్యాత పండితులు, నాయకులు, చారిత్రకుల రచనలతో వెలువడింది. దాని నిర్వహణ కూడా ఆదిరాజు వీరభద్ర రావు గారు స్వీకరించారు. 1934లో సురవరం ప్రతాపరెడ్డి గారు వెలువరించిన గోలకొండ కవుల సంచిక నిర్వహణ భాగంలో చాలాభాగం పంచుకొని తీర్చిదిద్దినవారు కూడా ఆదిరాజు వారే.

ఆదిరాజు వారి మరో ఉన్నతమైన కృషి సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం. ఇది ఎనిమిది సంపుటాలు. 1955 నుండి 1970 మధ్యలో జరిగిన కృషి ఇది. ఈ విజ్ఞాన కోశంలోని **'ఆంధ్రదేశము – విశేష శీర్షికలు'** అనే భాగానికి వారే సంపాదకులు. ఈ ఎనిమిది సంపుటాల్లో వీరభద్ర రావు గారి పేరుతో ఉన్న వ్యాసాలు 45.

ఆదిరాజు వీరభద్ర రావు గారు గోలకొండ పత్రికకు తరచుగా వ్రాస్తుండేవారు. వారం వారం వచ్చే సాహిత్యానుబంధం లోను, గోలకొండ గ్రంథాలయం అనే పుస్తక సమీక్షలలోనూ, అప్పుడప్పుడు దినపత్రికల్లో అనేక వ్యాసాలు, కథలు, గ్రంథ సమీక్షలు, ప్రత్యేక సంచికలలో వ్యాసాలు నిరంతరం వ్రాస్తూనే ఉండేవారు. నీలగిరి, మీజాన్, భాగ్యనగర్, తెలుగుదేశం, దేశబంధు, ప్రగతి, కాకతీయ, తెలంగాణ పత్రిక, పద్మశాలి, ఆంధ్రాభ్యుదయము, ఆంధ్ర పత్రిక, తెలుగుతల్లి మొదలైన పత్రికల్లో అనేక వ్యాసాలు ప్రచురించినారు.

వీరభద్ర రావు గారు దాదాపు నూటయాభై రేడియో ప్రసంగాలు చేసినారు. దక్కన్ రేడియోలో తెలుగు విభాగం ఆరంభించినప్పుడు వారితో తొలి ప్రసంగం చేయించింది కీ.శే. భాస్కరభట్ల కృష్ణారావు గారు. తరువాత ఆలిండియా రేడియోకు సంబంధించినవి.

**ఆదిరాజు వారు – అనుబంధ సాహితీ సంస్థలు :**

ఆదిరాజు వీరభద్ర రావు గారికి అనేక సాహితీ సంస్థల వ్యవస్థాపన, నిర్వహణలో భాగస్వామ్యం ఉన్నది. 1901లో స్థాపించిన **శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయా**నికి మొదట వీరు లైబ్రేరియన్‌గా, మదరాసు నుండి వచ్చిన తర్వాత ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారితో కలిసి కార్యవర్గ సభ్యునిగా, కార్యదర్శిగా, అధ్యక్షులుగా భాషా సేవలందించారు.

1905లో ఏర్పాటు చేయబడిన **"విజ్ఞాన చంద్రికా గ్రంథమాల"**లో వీరు లేఖకులుగా పనిచేసేవారు. 1908లో ఇది మదరాసుకు మార్చబడినప్పుడు అక్కడ కూడా లేఖకులుగా పనిచేసినారు. ఈ సంస్థ జీవిత చరిత్రలు, దేశ చరిత్రలు, కవుల చరిత్రలు, వివిధ విజ్ఞాన శాస్త్రాలను వెలువరించినది. దాదాపు 6 సంవత్సరాలు ఈ సంస్థలో మద్రాసులో వీరు పనిచేసినారు.

1921లో తెలుగువారి అస్తిత్వం కోసం ఏర్పాటు చేయబడిన **ఆంధ్ర జనసంఘం**లో వీరు కార్యవర్గ సభ్యులు. తరువాత ఇది **ఆంధ్ర మహాసభ**గా రూపుదిద్దుకున్నది. వీరు ఉపాధ్యాయులుగా ఉండడం వల్ల ప్రత్యక్షంగా రాజకీయాలతో సంబంధం పెట్టుకోక సాహిత్య సాంస్కృతిక వ్యవహారాలను చూస్తూ ఉండేవారు.

తెలుగువారి సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించి ఆంధ్ర జన సంఘానికి అనుబంధంగా **'పరిశోధక మండలి'** 1922లో స్థాపించబడింది. తెలంగాణలో అపారంగా ఉన్న తామ్ర శిలా శాసనాలను, నాణేలను, తాళపత్ర గ్రంథాలను సేకరించి ప్రచురించడం, పరిశోధించడం ఈ మండలి లక్ష్యం. ఇది స్వతంత్ర సంస్థగా మారిన తర్వాత వీరభద్ర రావుగారు దానికి కార్యదర్శిగా పనిచేసినారు. ఇది 1931లో కొమఱ్ఱాజు వారి మరణం తరువాత **'లక్ష్మణరాయ పరిశోధక మండలి'**గా మారింది. దీనికి కార్యదర్శి కూడా ఆదిరాజు వారే. దీని నిర్వహణలో వీరు ఎన్నో కష్ట నష్టాలను అనుభవించినారు.

1941లో సురవరం ప్రతాపరెడ్డి గారు ఉత్తమ రచయితలను సిద్ధం చేయాలనే సంకల్పంతో ప్రారంభించిన **విజ్ఞాన వర్ధనీ పరిషత్తు**లో ఆదిరాజు వారు సభ్యులుగా ఉన్నారు. 1943లో తెలుగు భాషావ్యాప్తి, సంస్కృతి ప్రచారం, ఉత్తమ గ్రంథ ప్రచురణ లక్ష్యాలుగా ప్రారంభించిన **ఆంధ్ర సారస్వత పరిషత్తు** వ్యవస్థాపకులలో ఆదిరాజు వీరభద్ర రావుగారొకరు. వారు మరణించువరకును పరిషత్తుకు కార్యవర్గ సభ్యులుగా, పరీక్షకులుగా, సలహాదారుగా ఉండి పరిషత్తు అభ్యున్నతికి తోడ్పడినారు.

1948వ సంవత్సరంలో ఉత్తమ గ్రంథ ప్రచురణ కోసం ప్రారంభించిన **'ఆంధ్ర చంద్రికా గ్రంథమాల'**కు ఆదిరాజు వారు ప్రధాన సంపాదకులుగా కార్యనిర్వహణ చేసినారు. మాడపాటి హనుమంత రావు గారిచే ప్రారంభించబడిన **'ఆంధ్ర బాలికోన్నత పాఠశాల'** అభివృద్ధి కోసం చాలాకాలం పనిచేసినారు. సంగ్రహ రూపంలో విజ్ఞాన కోశాన్ని ప్రకటించాలని ప్రయత్నం జరిగి 'సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ సమితి' ఏర్పడింది. ఈ సమితి కార్యాలయ ప్రధాన నిర్వాహకులుగా ఆదిరాజు వారిని కోరి నియమించినారు. వారి ఆరోగ్యం సహకరించకపోయినా శక్తికి మించి ఈ సంస్థకోసం కృషి చేసినారు.

1957లో ప్రారంభించిన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వీరభద్ర రావుగారిని విశిష్ట సభ్యులుగా ఎన్నుకొని దుశ్శాలువాతో సువర్ణ పథకంతో గౌరవించింది. వారి చివరి నిమిషం వరకు ఆర్థిక సహకారం అందించింది.

65 సంవత్సరాల పాటు తెలుగు భాషా, కళలు, సంస్కృతి, చరిత్రల కోసం నిరంతరం కృషిచేసిన ఆదిరాజు వీరభద్ర రావుగారు 29 సెప్టెంబర్ 1973లో పరమపదించినారు. తెలంగాణ ప్రాంతంలోని ప్రజలు తమ అస్తిత్వాన్ని తాము తెలుసుకొని స్వతంత్ర జీవనాన్ని సాగించడానికి, పరాయి పాలనను ఎదిరించడానికి, తమ మూలాలను తాము అన్వేషించడానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేసిన ప్రముఖులలో ప్రత్యేకంగా గుర్తింపదగిన వారు ఆదిరాజు వీరభద్ర రావుగారు.

రావుగారు స్నేహశీలి. స్నేహలతను పెంచుకోవటానికి కులమత వర్గ భాషా భేదాలెరుగని అమృతమూర్తి. చెప్పబోయే విషయములో చక్కని పాండితి నలవరచుకున్న సాహితీ విశారదుడే మంచి వక్త కాగలడు. వక్తృత్వానికీ రచనలకూ ఒకేరీతి విజ్ఞానసంపత్తి అవసరము. అవి రెండూ రావుగారికి పుష్కలంగా ఉన్నాయి. రావుగారు విజ్ఞాని – వ్యవహర్త – చేతలందున భావాలందున పెద్ద – మాటలలో నేర్పరి – వక్త – ప్రవక్త – నేత – వ్రాతకాడు. (తేజోమూర్తులు – ఇల్లిందల సరస్వతీదేవి)

పంతులుగారి జీవిత చరిత్ర ఒక వ్యక్తి చరిత్ర కాదు. ఇది గడచిన ఎనుబది సంవత్సరాలలో తెలంగాణములో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవన సమీక్ష; ఇచట సాగిన ప్రజోద్యమాల చరిత్ర. ఈ నగరమునందు పంతులుగారి ప్రత్యక్ష సంబంధ సహకారములు లేని గ్రంథాలయముగాని, ఆంధ్ర విద్యాలయము గాని, సాహిత్య సంస్థగాని, ఆంధ్ర సంఘము గాని లేదన్నచో అతిశయోక్తి కాదు. (తెలుగు వైతాళికులు – గడియారం రామకృష్ణ శర్మ – ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ)

ఆదిరాజు వీరభద్ర రావు గారి జీవితం – రచనలపై సమగ్రమైన విశ్లేషణలతో కూడిన పరిశోధనలు రావలసిన అవసరం, వారి రచనలను ఒక చోట చేర్చి పునర్ముద్రణ చేయాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతో ఉన్నది. తాము ఎన్నో బాధలను అనుభవించినా, ఈనాడు మన ఆనందానికి కారణమైన ఇటువంటి పెద్దల పేరుమీద గొప్ప పురస్కారాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది.

**జయంతితే సుకృతినో రససిద్ధా: కవీశ్వరా:**

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# తెలుగు సినిమా సాహిత్యంలో సంభాషణలు - ఒక పరిశీలన

**గంజి శశిధర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9492734183

**"వాగ్భూషణం భూషణమ్"** మానవునికి అన్నింటికన్నా గొప్ప అలంకారం వాక్కు. ఈ గొప్పసత్యాన్ని రెండువేల ఏళ్లకు పూర్వమే భర్తృహరి తన సుభాషితాలలో తెలియజేశాడు. **"నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది"** అని తెలుగులో నానుడి. ఉద్యోగం, వ్యాపారం, వినోదం, జీవితం అన్నీ మాటలతో ముడిపడి నడుస్తుంటాయి. నేడు మనిషి మనుగడకు మాట ప్రధానసాధనం, సినిమా మనిషి వినోదానికి ప్రధానకారకం. ప్రేక్షకుల్ని రంజింప జేయడానికి సినిమాలోని సంభాషణలు కీలక పాత్ర పోషిస్తాయి. దృశ్యం కథను చెప్పలేనిచోట సంభాషణలు చెబుతాయి. కథను ముందుకు తీసుకుపోతాయి. అటువంటి సంభాషణల గురించి చర్చించడం నా పరిశోధన యొక్క ముఖ్య ఉద్దేశం.

పరిశోధనాంశం **'తెలుగు సినిమా సాహిత్యములో సంభాషణలు – ఒక పరిశీలన'** ను ఎనిమిది అధ్యాయాలుగా విభజించుకున్నాను.

మొదటి అధ్యాయం **'సినిమా కళ – ప్రస్తావన'** లో సినిమా కళ ప్రారంభం, పరిణామం, వికాసం గురించి సూక్ష్మంగా తెలియ జేశాను. ముందుగా కళను గురించి వివరించి, కళ యొక్క వివిధ నిర్వచనాలను, కళ ఉద్దేశాన్ని, కళల వర్గీకరణను పేర్కొన్నాను. 64 కళల్లో ఒకటైన రూపకం (నాటకం) గురించి వివరించి దశరూపకా లను పేర్కొన్నాను. రూపకభేదాలలో ప్రధానమైన నాటకమే తెలుగు సినిమాకు తల్లి అని తెలియజేశాను.

ప్రపంచ సినిమా ఏ విధంగా పుట్టింది, ప్రపంచ సినిమా పితామహులు లూమియర్ సోదరులు సినిమాను వ్యాపారాత్మకంగా ఏ విధంగా ప్రపంచవ్యాప్తం చేశారో తెలియజేశాను. భారతీయ చలనచిత్ర పితామహులు దాదాసాహెబ్ ఫాల్కే తీసిన మొదటి మూకీసినిమా 'రాజాహరిశ్చంద్ర'తో భారతీయ సినిమారంగానికి బీజం పడితే, ఆర్దేషిర్ ఎం.ఇరానీ తీసిన తొలిటాకీ 'ఆలం ఆరా'తో సినిమా మాటలు నేర్చిన విషయాన్ని పేర్కొన్నాను. తెలుగుసినిమా పితామహులు రఘుపతి వెంకయ్య తెలుగువారికి సినిమాను పరిచయం చేసిన విధాన్ని, ఆయన కుమారుడు రఘుపతి ప్రకాష్ విదేశాలలో సినిమావిద్యను నేర్చుకుని వచ్చి తెలుగువాళ్ళ తొలి మూకీసినిమా 'భీష్మప్రతిజ్ఞ' తీసిన వైనాన్ని తెలియజేశాను. హెచ్.ఎం.రెడ్డి తెలుగులో తొలిటాకీ సినిమా 'భక్తప్రహ్లాద' గురించి తెలియజేశాను. తరువాత తెలుగు సినిమారంగం ఏ విధంగా విస్తరించిందో వివరించాను.

రెండవ అధ్యాయం **'సినిమా సాహిత్యం'** లో సినిమాలో సాహిత్యం యొక్క ప్రాధాన్యత గురించి, సినిమా సాహిత్యంలోని వివిధ దశల గురించి చర్చించాను. వినోదాన్ని అందించే సాహిత్యం సాంకేతిక విజ్ఞానంతో సమ్మేళనం చెంది సినిమాగా మారి ప్రేక్షకుల్ని ఎలా అలరిస్తుందో వివరించాను. తెలుగు సినిమా సాహిత్యంలో కథ, కథనం, సంభాషణలు, పాటలు, పద్యాలు ఉంటాయని పేర్కొని వాటి గురించి వివరించాను.

సినిమాకథను చదవడం కోసం రాయరు, తెరకెక్కించవలసిన అంశాలను కథారూపంలో రాసుకుంటారు. ముందుగా కథకు ప్రాణంలాంటి ఒక స్టోరీలైన్ అనుకుంటారు. ఆ తర్వాత స్టోరీలైన్‌కు అనుగుణమైన సంఘటనలను రాసుకుంటూ కథారూపంలోకి విస్తరిస్తారు. అది కథే అయినా చదవడానికి అనువైన కథ మాత్రం కాదు అని వివరించాను. కథ అవసరానికి అనుగుణంగా తగినన్ని పాత్రలను సృష్టించుకొని, పాత్రల స్వభావాలను నిర్ధారించుకొని, ఆ తర్వాత సంఘటనలను ఏ కాలక్రమంలో తెరమీద చూపించాలో నిర్ణయించుకొని ఆ దృశ్యాలను ఒక్కొక్క వాక్యంలో లేదా రెండ్రెండు వాక్యాలలో రాసుకుంటారు. దీనిని వన్లైన్ ఆర్డర్ అంటారు అని తెలియజేశాను. దీని ఆధారంగా దృశ్యాలను సవివరంగా అవసరమైనన్ని పేజీలలో రాసుకుంటారు. తెర మీద కనబడవలసిన పూర్తి సినిమాను కాగితం మీద రాయడాన్నే కథనం అంటారు అని తెలియజేశాను. సినిమా స్క్రిప్ట్ రాయడంలో సంభాషణలు రాయడం చివరిదశ అని వన్‌లైన్ ఆర్డర్, స్క్రీన్ ప్లేల ఆధారంగా డైలాగులు రాసి ఫైనల్ స్క్రిప్ట్ పూర్తి చేస్తారు అని వివరించాను. ఒక సినిమా కొన్ని సన్నివేశాలు (సీక్వెన్స్)గా, సన్నివేశాలు దృశ్యాలు(సీన్స్)గా, దృశ్యాలు షాట్స్‌గా విభజింపబడ్డాయి అని తెలియజేశాను.

మూడవ అధ్యాయం **'సంభాషణా ఔచిత్యం'**లో నిత్యజీవితంలో సంభాషణలు ఏ విధంగా ఉంటాయి, అవి సినిమాలో ఏ విధంగా మార్పు చెందుతాయి అనే అంశాలను వివరించాను. ముందుగా భాష ఎలా పుట్టింది, భాష యొక్క లక్షణాలు, మనిషి జీవితంలో సంభాషణ యొక్క అవసరం, సంభాషణ యొక్క లక్షణాలు వివరించాను. నిత్యజీవితంలో అంటే ఇంటిలో ఉండే కుటుంబసభ్యుల మధ్య, బంధువుల మధ్య, స్నేహితుల మధ్య, ప్రేమికుల మధ్య, శత్రువుల మధ్య, స్కూలు కాలేజీ యూనివర్సిటీలలో విద్యార్థుల మధ్య, విద్యార్థులు టీచర్ల మధ్య, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆఫీసులలో అధికారులు ఉ ద్యోగులు ప్రజల మధ్య, వ్యాపారసంబంధమైన మార్కెట్లలో, వ్యవసాయ క్షేత్రాలలో, భవననిర్మాణాలలో, కర్మాగారాలలో, కోర్టులో, పోలీసు స్టేషనులో, హాస్పిటళ్ళలో, పండుగలు జాతరలు ఉత్సవాలు వివాహాది వేడుకలు మరియు విషాదాలు మొదలైన సందర్భాలలో సంభాషణలు

ఏ విధంగా ఉంటాయో, ఇవే సందర్భాలను సినిమాలలో చూపిస్తే అక్కడ సంభాషణలు ఏ విధంగా మారుతాయో వివరించాను.

నాలుగవ అధ్యాయం **'కథావైవిధ్యం – సంభాషణాసరణి'**లో కథావైవిధ్యాన్ని బట్టి సినిమాలు నాలుగు రకాలుగా ఉంటాయని తెలియజేశాను. అవి పౌరాణికచిత్రాలు, జానపదచిత్రాలు, చారిత్రక చిత్రాలు, సాంఘికచిత్రాలు. కథ ప్రఖ్యాతం, కల్పితం, మిశ్రమం అనే మూడువిధాలుగా కూడా ఉంటుందని వివరించాను. పౌరాణిక చిత్రాలలో భాష సాధారణంగా గ్రాంథికంగా ఉంటుంది. ప్రేక్షకుల సౌలభ్యం కోసం వాడుకభాషలో రాసినా గ్రాంథికపదాల ఉపయోగం ఏదో ఒకచోట సినిమాలో తప్పనిసరి అని తెలియజేశాను. ముఖ్యంగా సంబోధనలు గ్రాంథికంలోనే ఉంటాయి. నాథా, స్వామీ, ప్రభూ, మిత్రమా, గురువర్యా, మాతా, పితామహా మొదలైనవి. ఉదాహరణగా దానవీరశూరకర్ణ, మాయాబజార్, శ్రీకృష్ణపాండవీయం, శ్రీరామరాజ్యం, లవకుశ మొదలైన సినిమాల సంభాషణల గురించి వివరించాను. జానపదచిత్రాలలో కూడా సంభాషణలు గ్రాంథిక ఛాయల్లోనే ఉంటాయి. పాతాళభైరవి, కీలుగుఱ్ఱం, గుణసుందరికథ, మంగమ్మశపథం, జగదేకవీరునికథ, సువర్ణసుందరి, జయసింహ మొదలైన సినిమాలలోని సంభాషణల గురించి చర్చించాను. చారిత్రక చిత్రాలలో సంభాషణలు కథా కాలానుగుణంగా ఉంటాయి. మల్లీశ్వరి, మహామంత్రి తిమ్మరుసు, రుద్రమదేవి, గౌతమీపుత్ర శాతకర్ణి మొదలైన సినిమాల్లోని సంభాషణల గురించి చర్చించాను. పౌరాణిక, జానపద, చారిత్రకకథలతో వచ్చిన సినిమాలు పరిమితంగా ఉంటే సాంఘిక కథాచిత్రాలు విస్తృతంగా ఉంటాయి. విభిన్న ఇతివృత్తాలతో రూపొందే ఈ చిత్రాలలో సంభాషణలు వీలైనంతవరకూ ప్రజల వ్యావహారిక భాషలో ఉంటాయి. అవి దేశ, కాల, పాత్రలను బట్టి మారుతుంటా యని వివరించాను. రైతుబిడ్డ, గృహప్రవేశం, వందేమాతరం, గుండమ్మ కథ, మిస్సమ్మ, షావుకారు, తాతామనవడు, ఒకేకుటుంబం, అడవిరాముడు, శంకరాభరణం, బొబ్బిలిపులి, సిరివెన్నెల, జగదేకవీరుడు అతిలోకసుందరి, కలికాలం, మాతృదేవోభవ, శుభ లగ్నం, పెళ్లిసందడి, నిన్నే పెళ్ళాడుతా, సమరసింహారెడ్డి, బొమ్మరిల్లు, హ్యాపీడేస్ మొదలైన సినిమాలలోని సంభాషణల గురించి చర్చించాను.

ఐదవ అధ్యాయం **'సన్నివేశం – సంభాషణా స్వరూపం'**లో సినిమా సన్నివేశాలుగా ఎలా విభజింపబడ్తుంది, పలు దృశ్యాలు కలిసి సన్నివేశంగా ఎలా రూపొందుతాయి, దృశ్యాలలో పాత్రలు ఏవిధంగా మాట్లాడుతాయి, పాత్రల మాటల వల్ల కథ ఎలా ముందుకు సాగుతుంది, ఏ విధంగా మలుపులు తిరుగుతుంది, ప్రేక్షకులకు ఏ విధంగా ఆనందం కలుగుతుంది అనే విషయాల గురించి చర్చించాను. ఒక్కమాట సినిమా ఆత్మగా ఎలా మారుతుంది వివరించాను. సింహాద్రి సినిమాలో "పదిమంది చల్లగా ఉండడం కోసం ఒకన్ని చంపడానికైనా నేను చావడానికైనా సిద్ధం", నాయకుడు సినిమాలో "నలుగుర్ని బతికించే పని ఏదీ తప్పు కాదు" లాంటి మాటల గురించి చర్చించాను. పాత్రలను బట్టి సంభాషణలు ఎలా రూపొందుతాయి, పాత్రధారుల శైలిని బట్టి సంభాషణలు ఏ విధంగా మారుతాయి, పాత్ర స్వభావాన్ని నిలబెట్టడానికి రచయితలు సంభాషణలు ఏ విధంగా రాస్తారు అనే విషయాలను కూడా వివరించాను.

ఆరవ అధ్యాయం **'సినిమా సంభాషణలు – రసము, అలంకారాలు'** లో "వాక్యం రసాత్మకం కావ్యమ్" అన్నట్లుగా "రసాత్మక దృశ్యమే సినిమా" అని తెలియజేశాను. కథను చదివే పాఠకుడి కయినా, సినిమా చూసే ప్రేక్షకుడికయినా పరమప్రయోజనం రసాస్వాదన కనుక సినిమా సంభాషణలు రసాస్వాదన కలిగించడానికి ఏమేరకు ఉపయుక్తమవుతున్నాయి, అలంకారాలు అందుకు ఏ విధంగా తోడ్పడుతున్నాయి అనే విషయాలను చర్చించాను.

శృంగార హాస్య కరుణ రౌద్ర వీర భయానక బీభత్స అద్భుత శాంత రసాలన్నీ వాసనా మాత్రంగా ప్రేక్షకుడిలోనే ఉంటాయి. సంభాషణలు రసాన్ని వాచ్యం చేయకుండా రససిద్ధిని కలిగించడానికి దృశ్యానికి ఎలా సహాయపడుతాయో తెలియజేశాను. ఉదాహరణకు కరుణరసాత్మక చిత్రం 'మాతృదేవోభవ'లో కవల పిల్లలని దత్తత ఇచ్చే సన్నివేశంలో దత్తత వెళ్తున్న కొడుకుతో అక్కడ ఎవరితో గొడవపడకు అని తల్లి చెప్తే "అక్కడ ఎవరున్నారమ్మా గొడవ పడడానికి" అనేమాట, వికలాంగుడైన కొడుకుని ఎవరు దత్తత తీసుకోకపోవడంతో అతను "అమ్మా నేను ఈ అవిటికాలితో పుట్టటం నా అదృష్టం కదమ్మా" అనేమాట ఈ దృశ్యాలలో రససిద్ధిని కలిగించడంలో కృతకృత్యమైనాయని వివరించాను. అట్లానే వివిధ సన్నివేశాలను, దృశ్యాలను తీసుకొని వాటిల్లో రసస్థాయి పెరగడానికి సంభాషణలు ఏవిధంగా తోడ్పడ్డాయో వివరించాను.

కథానాయకుడు, కథానాయిక, ప్రతినాయకుడు, ఇతర ముఖ్య పాత్రల గొప్పతనాన్ని లేదా స్వభావాన్ని తెలియజేయడానికి అలంకార పూరితమైన సంభాషణలు ఉపయోగపడుతాయని వివరించాను. ఇవి కథలు నవలలు కావ్యాలలోని వర్ణనలకు దగ్గరగా ఉంటాయని తెలియజేశాను.

ఏడవ అధ్యాయం **'సినిమా సంభాషణలు – విశేషాలు'**లో సినిమా సంభాషణలకు సంబంధించిన ఇతర విశేషాల గురించి వివరించాను.

సంభాషణల్లో వచ్చే ఊతపదాల గురించి "ఫేస్ టర్నింగ్ ఇచ్చుకో, అంత సీన్ లేదు, లైట్ తీసుకో, అంతేగా అంతేగా, నిజం చెప్పమన్నారా అబద్ధం చెప్పమన్నారా, తప్పు తప్పు రాణీగారి తమ్ముణ్ణి" మొదలైన సంభాషణలను ఉదాహరణగా తీసుకుని వివరించాను.

రచయిత దర్శకుల శైలిని బట్టి తన శైలిలో మార్పుతో సంభాషణలను రాస్తాడు. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలోని 'అడవిరాముడు', కె.విశ్వనాథ్ దర్శకత్వంలోని 'శంకరాభరణం'

సినిమాలకు ఒకే సమయంలో జంధ్యాల ఏ విధంగా వేర్వేరు శైలులలో సంభాషణలు రాశాడో అట్లానే స్వీయదర్శకత్వంలోని హాస్యభరిత చిత్రాలకు ఏ విధంగా సంభాషణలు రాసాడో వివరించాను. రచయితలు దర్శకుడి శైలిని బట్టి విభిన్న రీతిలో సంభాషణలు అందించిన పలు సినిమాల గురించి చర్చించాను.

సినిమా సంభాషణలపై ఆధిపత్యం చెలాయించిన మాండలికం గురించి చర్చిస్తూ సినిమా కథ ఏ ప్రాంతానికి చెందినదైనా సినిమాలోని కథానాయకుడు మాత్రం కోస్తాంధ్ర మాండలికంలో మాట్లాడడం, హాస్యానికి శ్రీకాకుళం, తెలంగాణ మాటలను వాడడం మొదలైన అంశాల గురించి చర్చించాను.

దాశరథి రంగాచార్య గారి కథా, సంభాషణల రచనతో వచ్చిన 'చిల్లర దేవుళ్ళు' తెలంగాణ కథ, భాషతో రూపొందిన తొలి సినిమా. అయితే గౌతమ్ ఘోష్ దర్శకత్వంలో బి.నర్సింగరావుగారు నిర్మించిన 'మాభూమి' పూర్తిస్థాయి వాస్తవిక తెలంగాణ సంభాషణలతో తెలంగాణ ప్రజల వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించిన సినిమా. 'మాభూమి' తర్వాత ఆ ప్రస్థానం ముందుకు సాగలేదు. తెలంగాణ భాష కేవలం హాస్యానికి, రౌడీలకి మాత్రమే పరిమితం చేయబడింది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయం నుండి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. 2016లో తరుణ్‌భాస్కర్ తీసిన 'పెళ్లిచూపులు' సినిమాతో సహజమైన తెలంగాణ భాష సంభాషణల్లో మొదలైంది. ఫిదా, అర్జున్ రెడ్డి సినిమాలతో తెలంగాణ భాష హీరోహీరోయిన్ల భాషగా మారింది. ఆ తరువాత పూర్తిగా తెలంగాణ భాషలోనే వస్తున్న సినిమాలు అనేకం ఉన్నాయి. ఇది చిత్తూరు, కడప, అనతపురం, విజయనగరం, శ్రీకాకుళం యాసలలో కూడా సినిమాలు రావడానికి మార్గదర్శకం అయింది అనే విషయాన్ని కూడా చర్చించాను.

ఎనిమిదవ అధ్యాయం **'సినిమా సంభాషణారచయితలు – చాతుర్యం'**లో తెలుగు సినిమా రచయితలను మూడు విభాగాలుగా చేయవచ్చునని వివరించాను. 1) కథ, మాటలు, పాటలు రాసేవారు, 2) కథ/మాటలు రాసేవారు, 3) కేవలం పాటలు మాత్రమే రాసేవారు.

తెలుగు సినిమా సంభాషణారచయితలు వారు రాసిన సినిమాలు, వారి రచనాశైలీ ప్రత్యేకతల గురించి చర్చించాను. 'తాతాజీ' తాపీ ధర్మారావునాయుడు, 'కవితాకళానిధి' బలిజేపల్లి లక్ష్మీకాంతకవి, త్రిపురనేని గోపీచంద్, సముద్రాల రాఘవాచార్య, పాలగుమ్మి పద్మరాజు, డి.వి. నరసరాజు, పినిశెట్టి శ్రీరామమూర్తి, 'కథాశివ బ్రహ్మం'గా పేరుపొందిన వెంపటి సదాశివబ్రహ్మం, పింగళి నాగేంద్ర రావు, ఆరుద్ర (భాగవతుల శంకరశాస్త్రి), ఆచార్య ఆత్రేయ (కిళాంబి నరసింహాచార్య), దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, సముద్రాల రామానుజం (జూనియర్ సముద్రాల), రాజశ్రీ (ఇందుకూరి రామకృష్ణంరాజు), మహారథి (బాలగంగాధర్ తిలక్), ముళ్ళపూడి వెంకటరమణ, గొల్లపూడి మారుతీరావు, దాసరి నారాయణరావు, జంధ్యాల (వెంకటదుర్గా శివసుబ్రహ్మణ్యశాస్త్రి), గణేశ్ పాత్రో, యం.వి.యస్. హరనాథరావు, కొండవీటి వేంకటకవి, పరుచూరి బ్రదర్స్, దివాకర్ బాబు, సత్యానంద్, త్రివిక్రమ్ శ్రీనివాస్, పూరి జగన్నాథ్, బుర్రా సాయిమాధవ్, అబ్బూరి రవి మొదలైన తెలుగు సినిమా సంభాషణారచయితల గురించి, వారి రచనాశైలి గురించి చర్చించాను.

పరిశోధనాంశం **'తెలుగు సినిమా సాహిత్యంలో సంభాషణలు – ఒక పరిశీలన'**ను ఈ విధంగా ఎనిమిది అధ్యాయాలుగా విభజించుకుని పరిశోధించాను.

## రైతే దేశానికి వెన్నుదన్ను..!

రైతు లేని నాడు రాజ్యాలు మనలేవు
వ్యవసాయ మదియు వరము మనకు
పాడి పంటలిలను ఫలవంత మైనను
మనిషి మనుగడకు మార్గమౌను!

పంచె గోచి జుట్టి పరగ మడులు దున్ను
మట్టి వాసన లది మధువు గ్రోల
రైతు చెమట లోన రవి బింబము లెన్నొ
మెరిసి మురిసి పోవు మేలు జూసి!

మట్టి పైన రైతు మమ కారమును జూడు
పసిడి పంటల కిల పరగ పెంచు
ఉరుముమెరుపులనక వుత్సహించియుసాగు
రైతు వెన్ను దన్ను రాజ్యములకు!

ధరలు సరిగ లేక ధరణి యందును తాను
కాపు రంబు తాను గాంచ లేక
వ్యవసాయ ఫలము వంచన వేదన
మిగిలి పోయి బాధ మ్రింగు చుండె!

హాలికులను ప్రభుత నాదుకున్నను నాడె
పుడమి జనుల కంత బుట్టు కూడు
సర్వ జీవ సతము సౌఖ్యముగా నుంచు
కలియుగాన దైవ కర్షకులును!

**డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్‌నగర్, ఫోన్ : 8555 899 493

# మూసీ పదవినోదం - 32

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 2 అ | 3 | జా | | X | 7 ప్ర | | 1 మ |
| 3 | డి | | X | 8 మా | | X | న్ను |
| గి | | X | 9 స్తో | | గ | | తి |
| 4 | డు | 6 | త | | ము | X | |
| తే | X | 10 | మి | X | X | 17 | పా |
| 5 | 12 వ | | శు | | 15 చే | | ము |
| 11 ను | | X | 14 | క | | లు | |
| 13 | కు | | X | 16 | పు | | క్క |

**ఆధారాలు (అడ్డం)**

2. ఇది సినిమాలు చూపించే వేదికగా ఈరోజు ప్రసిద్ధి కాని వాస్తవానికి ఇది దక్షిణ అమెరికాలోని పెద్ద అడవి (4)
3. కీటక వినాశక ద్రవ్యములలో ఒకదానికి సంక్షిప్త రూపం (3)
5. చెంప పగలగొట్టుము అనటానికి గౌరవప్రదమైన భాష (8)
4. మధ్య కాలమున కలిగినది (6)
7. మొదట (3)
8. నెల (2)
9. అందాల యువతి (5)
10. సమూహము (శ్రీనాథుని ప్రసిద్ధ సమాసంలోని మొదటి రెండు అక్షరాలు) (2)
11. మంచము అల్లు సన్నపుదారములో చివరిపోగు తెగిపోయింది(2)
13. నవ్వటంలోని ధ్వన్యనుకరణ పదము (3)
14. ఇక వద్దులే (5)
16. సాయంకాలపు నక్షత్రం (4)
17. పసిపాపని పిలవండి (2)

**ఆధారాలు (నిలువు)**

1. సుప్పనాతి ఇలా కూర్చున్నదని తెలంగాణపు సామెత (8)
2. అష్ట కష్టములలో ఒకటి (8)
3. పొట్ట విచ్చి చూడ దీనిలో పురుగులున్నాయన్నాడు వేమన (4)
6. ఉర్దూలో తలబిరుసుగాడు (3)
7. ఉపన్యాసము (4)
8. ఈ ప్రపంచం ఇదెరా (3)
12. దిక్కు సంస్కృత శబ్దము, మన తెలుగులో దానిని ఇలా అనాలి (3)
16. నమస్కారానికి తెలుగులో మూడు అక్షరాలు (3)
17. విడుచుచు అనే అర్థం వచ్చే క్రియలో అక్షరంగా అదనంగా విడవకుండా 'లు' వచ్చింది (4)

(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)

నిర్వహణ

**డా. తాడేపల్లి పతంజలి**

ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.

ఫోన్ : 98666 91587

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# బంజారా నృత్య వైవిధ్యం

**ఆచార్య సూర్యాధనంజయ్,** అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 9849104187

భారతదేశం విభిన్న జాతులకు నిలయం. కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు పంజాబ్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు అనేక సంస్కృతులతో విరాజిల్లుతున్నదీ దేశం. విలక్షణమైన జాతులు, తెగలు, భాషలు, నృత్యాలు, గీతాలు, సంప్రదాయాలతో భిన్న సుందరంగా ఈ దేశం శోభిల్లుతున్నది. ఇక్కడి అడవులు అత్యంత సుందరమై పచ్చని చీరను కట్టుకున్నట్లుంటాయి. ఈ అడవితల్లి ఒడిలో ఎన్నో గిరిజన జాతులు తమ ఉనికిని నిలుపుకుంటున్నాయి. మైదాన ప్రాంతాల్లోంచి హరిత వర్ణమైన ఈ వనాల్లోకి ప్రవేశిస్తే అందమైన మరో లోకం మనకు దర్శనమిస్తుంది.

నక్షత్రాల్ని కోసుకొచ్చి అద్దాలుగా మలచి రంగురంగుల వస్త్రాలకు ఆభూషణాలుగా చేసిన కళంకారి చైతన్యం బంజారాలు. గడ్డి గుడిసెల్ని అందంగా పేర్చి ఆటపాటలతో జీవన సౌందర్యాన్ని ఆవిష్కరించే బంజారాలు భారతదేశానికి సాంస్కృతిక వారసులా అన్నట్టుగా మనకు తారస పడతారు. తీరొక్క పువ్వు నవ్వినట్టు ఆటపాటలతో, అలయ్ బలయ్‌లతో, తలపాగాలతో, ఘూంగ్టో, ఛూరియాలతో ఇంద్రధనుస్సును ఇలకు దింపుతారు. ఆట, పాట వీరికి ప్రాణం.

ప్రకృతి ఆవిర్భావం నాటి నుండి పక్షులు తమంత తామే కిలకిల రావాలు నేర్చినట్టు, నెమళ్ళు పురివిప్పి నాట్యం చేసినట్టు, బంజారాలు ప్రకృతిలోని మార్పులను తమలోకి ఒంపుకొని ప్రకృతి పులకరింతకు పాటగా, ఆటగా మారిపోతారు. ఆదిమ కాలం నుండి ఆధునిక కాలం వరకు తాము నేర్చిన విలువలను, సంస్కృతిని, సంప్రదాయాలను సజీవంగా ఉంచుతున్నారు. నాడు రాజులుగా రాజస్థాన్ ప్రాంతంలో, వనచరులుగా నేడు దేశమంతా విస్తరించినా దేశకాల పరిస్థితులను తట్టుకుంటూనే వీరి ఉనికిని కాపాడుకుంటున్నారు. భారతీయ సంప్రదాయానికి ప్రతిరూపాలైన ఆటను, పాటను, ఎంతో పవిత్రంగా భావిస్తూ తమ జీవనంలో భాగం చేసుకున్నారు. సంతోషం కలిగినా, బాధ కలిగినా పాటే వీరికి ఊరటనిస్తుంది. బాధను దిగమింగు కోవాలన్నా, సంతోషాన్ని నలుగురితో పంచుకోవాలన్నా, పాటే వీరికి మాధ్యమంగా నిలుస్తుంది. పాటకు తోబుట్టువైన ఆట (నృత్యం) వీరి హృదయగతికి జతగా నిలిచి తండాను ఆనందమయం చేస్తుంది.

చరిత్రను పరికించి చూసినట్లయితే బంజారాల నృత్యానికి ఆనవాళ్ళు లభిస్తాయి. వాటి ఆధారంగా బంజారాల నృత్యానికి జన్మస్థానాన్ని నిర్ణయించవచ్చు. సింధూ నాగరికతను అందలి విశేషాల్ని గమనిస్తే త్రవ్వకాల్లో దొరికిన నాట్యగత్తె విగ్రహం ఆమె చేతి మణికట్టు నుండి మోచేతి వరకు అక్కడినుండి భుజంవరకు తొడిగిన గాజులు, ఆభరణాలు, సంప్రదాయాలు అన్ని బంజారాలను పోలి ఉంటాయి.



ఆనాటి ఆ సింధూ ప్రజలే నేడు రాజస్థాన్ కేంద్రంగా పాలించిన రాజపుత్రులు. కనుక బంజారా నృత్యానికి జన్మస్థానం రాజస్థాన్, పంచజింగ్ ప్రాంతం (ఐదు నదుల కలయికల ప్రాంతం) గా చెప్పవచ్చు. రాజపుత్రులు యుద్ధ సమయాల్లో ఉత్సాహాన్ని నింపేందుకు సైనికులతో కలిసి కత్తులు, డాలులతో కూడిన నృత్యాన్ని చేసేవారు. నంగారా దానికి వాద్య సహకారం అందించేది. నంగారాతో పాటు రబాబ్, సారంగి, డప్పు మొదలైనవి అనుబంధ వాద్య సహకారాన్ని అందించేవి.

క్రీ.శ. 6వ శతాబ్దం నుండి 12వ శతాబ్దం వరకు పశ్చిమాన రాజస్థాన్ నుండి తూర్పున ఉత్తరప్రదేశ్ వరకు, ఉత్తరాన హర్యానా నుండి దక్షిణంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సరిహద్దు వరకు వీరు రాజ్యం చేసినారు. అరబ్బులు, తురుష్కులు, మొగలుల దండయాత్రలు వీరిని చెల్లాచెదురు చేశాయి. తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో వీరు వనచరులుగా మారారు. ఆ వనచరులే నేటి బంజారాలు. అడవుల్లోనూ తమ రాజసాన్ని తమ పాలనా విధానాలను విడవకుండా తమ జీవితంలోని ప్రతీ సందర్భాన్ని శౌర్య ప్రతాపాలతో, ఆట పాటలతో నింపి ఆనందంగా ఉంటారు బంజారాలు. ఈ క్రమంలో వీరు దేశంలోని అన్ని రాష్ట్రాలలో స్థిరపడ్డారు. దక్షిణ భారతదేశంలో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో అధికంగా కనిపిస్తారు.

**బంజారాల నృత్య ప్రాముఖ్యం :**

మనిషి జీవనంలో పని, పని నుండి పాట, పాట నుండి ఆట పుట్టాయి. ఇది ప్రాకృతిక సత్యం. శబ్దం చేసే దరువులకు అనుగుణంగా మనిషి తనకు తెలియకుండానే పుట్టిన ఉత్సాహంలో చిందులు వేసాడు. అట్లా వేసిన చిందులు ఒక క్రమ పద్ధతిలో అమరి నృత్యం (ఆట) పుట్టింది.

మనస్సులోని ఉద్వేగాన్ని, సంతోషాన్ని, ఉత్సాహాన్ని పాటకు అనుగుణంగా చేతలకు చేర్చుతూ, తమ కదలికలో చూపిస్తే నృత్యం



అనబడుతుంది. బంజారాలను చూస్తే మనకు అదే స్థితి గోచరిస్తుంది. యదలో ఉవ్వెత్తున ఎగసిపడే ఆనందపు అలల్ని తన్మయత్వం చెందుతారు వారు. వీరి నృత్యం ప్రకృతి సహజంగానే ఆవిర్భవించిందని చెప్పవచ్చు. డప్పు చేసే శబ్దాన్ని వినగానే వారి పాదాలు అలవోకగా కదలడం మనం గమనించవచ్చు. హృదయాన్ని ప్రకృతిలో లీనం చేసుకున్నవారు కనుక వారిలో ఆ ప్రతిస్పందన సహజం.

శబ్దం చేసే విన్యాసానికి అనుగుణంగా నృత్యం చేయడం బంజారాల్లో కనిపిస్తుంది. గుండ్రంగా తిరుగుతూ, చేతులను పైకి ఊపుతూ, సమూహంగా నృత్యం చేస్తారు వీరు. నృత్యం చేసేటప్పుడు వాద్య సహకారాన్ని నంగారా, డప్పు, గజ్జెలు అందిస్తుంటాయి. వేషధారణ, ఆభూషణాలు నృత్యానికి మరింత వన్నెను తీసుకొస్తాయి. అద్దాల్ని అందంగా పేర్చుతూ, వస్త్రాల్ని వీరు స్వయంగా కుట్టుకుంటారు. కుట్లు, అల్లికలు వీరికి వంశపారంపర్యంగా వచ్చే విద్యలు. అందమైన కలంకారి వస్త్రాలను ధరించి, కాలి అందెలు మోగుతుండగా నంగారా శబ్దాన్ని నాట్యంగా మారుస్తారు బంజారాలు.

డా॥ చిగిచెర్ల కృష్ణారెడ్డి తన "జానపద నృత్యకళ" అనే గ్రంథంలో బంజారాల నృత్యాన్ని "సుగాలి" నృత్యం పేరిట విశ్లేషించారు. ఆంధ్రప్రదేశ్‌లో బంజారాలను సుగాలీలంటారు. అందుకే ఆ ప్రాంతంలో "సుగాలి నృత్యం"గా బంజారా నృత్యం పేరు పొందింది. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు తన "తెలుగు వారి జానపద కళా రూపాలు" అనే గ్రంథంలోనూ బంజారాల నృత్యాన్ని గూర్చి పేర్కొనడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**బంజారా నృత్యంలోని అంశాలు :**

బంజారా నృత్యం అడుగుల కదలిక. చేతుల భావ ప్రకటనతో కూడి పాటకు, డప్పుకు అనుగుణంగా సాగుతుంది. అడుగుల కదలిక ఇందులో అత్యంత ప్రాధాన్యతను కలిగిన అంశం. అడుగుల కదలికే నాట్యాన్ని నిర్మిస్తుంది. చేతులు పాటలోని భావాన్ని చెబుతూ ఎదుటి వారిని స్పందింప జేస్తాయి. అడుగులు చేతుల ప్రతిస్పందనతో విలక్షణంగా ఉంటుంది బంజారా నృత్యం. నృత్యాన్ని ఆరంభించేది అడుగులే. అడుగులు లయాత్మకంగా కదులుతుంటే చేతులు అలవోకగా తిరుగుతుంటే, పాట నృత్యానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. సంప్రదాయ వాద్యాలైన డప్పు, గజ్జెలు, నంగారా మోతలతో సందర్భాన్ని రసరమ్యం చేస్తుందీ బంజారా నృత్యం.

శబ్దం నుండి సంగీతం ఆవిర్భవిస్తే ఆ సంగీతం మనిషి హృదయాన్ని లయాత్మకంగా ఛేదిస్తుంది. తదనుగుణంగా పాదాలు, చేతులు, శరీరం కదులుతుంది. బంజారా నృత్యం సమయంలోనూ నంగారా చేసే లయాత్మక శబ్దాలకు అనుగుణంగా అడుగులు కదుపుతూ ఒకరి ప్రక్కకు ఒకరు చేరి గుండ్రంగా తిరుగుతూ నృత్యం చేస్తారు. డప్పు చేసే మొదటి శబ్దానికి అందరి అడుగులు ఒక్కసారిగా ముందుకు కదులుతాయి. పాదాల కదలికకు అనుగుణంగా స్త్రీలంతా ముందుకు వంగుతూ చేతులను ఆడిస్తారు. మొదటి శబ్దంలో పడిన ముందడుగులు ఒక్కొక్కటిగా వచ్చే రెండు, మూడు, నాలుగవ శబ్దాలకు అనుగుణంగా వెంటవెంటనే ప్రక్కప్రక్కనే పడుతుంటే ముందుకు వంగిన స్త్రీలు క్రమ పద్ధతిలో నిలుచుంటూ ప్రక్కకు కదులుతుంటారు. పాదాల కదలికకు అనుగుణంగా చేతులు వెనక్కి త్రిప్పుతూ, ముందుకు త్రిప్పుతూ, అరచేతులు తెరుస్తూ, మూస్తూ భావ ప్రకటన చేస్తారు.

పాట ఈ నృత్యానికి ఆత్మలా నిలబడుతుంది. పాట, శబ్దం రెండూ పాదాల్ని, ముందుకు కదుపుతాయి. శబ్దానికి అనుగుణంగా నాటి సందర్భాన్ని పాట సజీవం చేస్తుంది. చూసేవారికి భావప్రసారం జరిగి, వారు కూడా తన్మయులై పాట ఎత్తుకున్న వస్తువులోకి వెళ్లిపోయి గత స్మృతుల్ని తాజా చేసుకుంటారు.

వస్త్రధారణ బంజారాల నృత్యానికి ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవచ్చు. అందంగా పొదగబడ్డ అద్దాలు, గవ్వలు, మువ్వలు, వివిధ దారాలతో అల్లిన కుచ్చులు, పూసలు పొదిగిన ఘుంగ్టోని తలపై ధరించి, తలపై నుంచి వెంట్రుకలను సంధానం చేస్తూ కనిపించే టోప్లీలు, తల మధ్యలో టీకీ, ముక్కుకు భూరియా, చేతులకు నిండుగా బలియాలతో పాటు కడియాలుగా చెప్పుకొనే బాజూబంద్, కసోటీలు, మెడకు హాంస్‌లో, పేటియా, వాంక్డీలు, కస్సీలు అనబడే కాళ్ళ కడియాలు, ఘాగ్రో ధరించి స్త్రీలు నర్తిస్తుంటే... తలకు తలపాగ, కాళ్ళకు గజ్జెలు, ధోవతి, అంగి, పై పంచె, కొన్ని చోట్ల చేతి దండలకు ఊలుతో చేసిన బంతులు, భుజాల పైనుండి పట్టెడను పురుషులు ధరిస్తారు. స్త్రీలు గుండ్రంగా తిరుగుతూ నర్తిస్తుంటే పురుషులు నంగారా, డప్పు వాయిస్తూ మధ్యలో నిలబడతారు. ఈ బంజారానృత్యాన్ని ముఖ్యంగా శీత్లా పండుగ, తీజ్ పండుగ, హోలీ, దసరా, దీపావళి, వంటి పండుగలే కాకుండా వివాహ మహోత్సవాలపుడు ప్రత్యేకంగా చేస్తారు.

**బంజారా నృత్యం - శైలీభేదాలు :**

బంజారా ప్రజలు వారి జీవితంలోని ప్రతి సందర్భాన్ని ప్రేమిస్తారు. అలాగే సంవత్సరం పొడుగునా వచ్చే పండుగలను కూడా అంతే వైభవంగా జరుపుకుంటారు. అందుకు అనుగుణంగా ఆట పాటలు

ఉంటాయి. బంజారాలు చేసే నృత్యాల్లో ముఖ్యంగా మజాదూరేరో నాచ్, జనావరేరో (పెద్దపులి) నృత్యం, పీరేరో నాచ్, ఝుంఝుం నాచ్, ఊంచహాతేరో, టూంటి టాంగేరో, ఉత్రుమారేర్ (పురుషులకు సంబంధించినది), బ్యాస్కుమారేర్ (పురుషులకు సంబంధించినది), ఏక్ టాంగేరో, దీ టాంగేరో, డాలియార్ నాచ్, అడుగు నృత్యం వంటి నృత్య శైలులు కనిపిస్తాయి.

**జనావరేరో నృత్యం :**

డప్పు దరువు మార్చడం ఒక కళ. భిన్నమైన దరువుల్లో ప్రకృతిలోని ప్రాణులను, వాటిలోని ప్రతిస్పందనలను, భావావేశాలను చూపించడమంటే సామాన్యమైన విషయం కాదు. ప్రకృతికి, జంతువులకు ఎంతో దగ్గరగా ఉంటే కాని వాటి భావావేశాల్ని డప్పు దరువుల్లో చూపించలేము. ఇటువంటి కళ చాలా అరుదుగా ఉంటుంది. పెద్దపులిని బంజారాలు జనావర్ అంటారు. బంజారాలు పెద్దపులి గర్జనలను, వేటాడేటప్పుడు అది చేసే గాంభీర్యమైన అరుపులను, దాని నడకను, దాని రాజసాన్ని డప్పు దరువుల్లో చూపిస్తుంటారు. దానికి అనుగుణంగా స్త్రీలు పెద్దపులి అడుగులను తమ అడుగుల్లో, పెద్దపులి ముఖ విన్యాసాలను తమ ముఖంలో చూపుతూ ఒక కాలు ముందుకు కదిపినాక, శబ్దానికి అనుగుణంగా వెనక్కి కదులుతూ, చేతులను పులిపంజాలుగా చేసి ముందుకు, వెనుకకు కదుపుతూ నృత్యం చేస్తారు. ఈ నృత్యాన్నే "జనావరేరో నృత్యం" అంటారు. ఈ నృత్యం చూపరుల హృదయాలను హుషారెత్తిస్తుంది. బంజారాల వీరత్వాన్ని ప్రతిబింబిస్తుంది. పది నుంచి పదిహేను మంది స్త్రీలు నృత్యం చేస్తూ ముందుకు కదులుతుంటే ముగ్గురి నుండి ఐదుగురు పురుషులు దరువేస్తుంటారు. ఈ నృత్యం చూస్తుంటే, దరువుల చప్పుడు వింటుంటే రోమాలు నిక్కపొడుచుకుంటాయి.

**పీరేరో నాచ్ :**

యేటా దసరాకు ముందు వచ్చే మొహర్రం పండుగను పీర్ల పండుగ అంటారు. బంజారాలు పీరీల పండుగ సందర్భంగా చేసే నృత్యాన్ని పీరేరో నాచ్ అంటారు. మహమ్మద్ ప్రవక్త కుమారులైన హసన్, హుసేన్‌లను కీర్తిస్తూ పీరీల పండుగను జరుపుతారు. వారి త్యాగాలను ప్రతిబింబిస్తూ వేసే తీన్‌మార్ లాంటి దరువులకు చేసే నృత్యమే ఈ పీరేరో నృత్యం. బంజారాలు సకల సంస్కృతులను తమలో కలుపుకునే తత్త్వం మనకిక్కడ కనబడుతుంది. తీన్‌మార్ దరువుకు అనుగుణంగా అడుగులు కదుపుతూ, చేతి విన్యాసాలతో నాట్యం చేయడం ఈ నృత్య రీతి విశేషం.

**ఊంచే హతేరోనాచ్ :**

చేతులను పైకెత్తుతూ చేసే నృత్యాన్ని ఊంచే హతేరో నాచ్ అంటారు. బంజారాలు వివాహ సందర్భాలల్లో, వివిధ పండుగలప్పుడు ఈ నృత్యాన్ని చేస్తారు. దరువు చేసే విన్యాసాలకు స్త్రీలు చేతులు పైకెత్తి ముందుకు, వెనక్కి కదులుతూ లయబద్ధంగా కదలిపోతారు. నయన



మనోహరంగా ఉంటుంది ఈ నృత్యం. డప్పు దరువుకు కాలి గజ్జెల చప్పుడు రమ్యతను తీసుకొస్తుంది.

**టూంటి టాంగేరో నాచ్ :**

బంజారాలు చేసే నృత్యంలోని మరొక శైలి టూంటి టాంగేరో నాచ్. ఒక కాలును పైకెత్తి, మరొక కాలుతో చేసే నృత్యం ఇది. ఈ నృత్యాన్ని పండగలప్పుడు చేస్తారు. సరదాగా సాగిపోయే నృత్యంలో ఒక కాలును పైకెత్తి, మరొక కాలుతో క్రింద పడకుండా చేతులను మూస్తూ, తెరుస్తూ, పైకెత్తుతూ, దించుతూ, విన్యాస భరితమైన అడుగులు వేయడం ఉంటుంది. ఎంతో ఏకాగ్రత ఉంటే గానీ, గంటసేపు ఈ నృత్యం చేయడం సాధ్యం కాదు. సాధన కూడా అంతే అవసరం అవుతుంది. వీరు అలవోకగా గంటసేపు ఈ శైలిలో నృత్యం చేస్తారు.

**ఉత్రూ మారేర్ నాచ్ :**

ప్రత్యేకంగా హోలి పండగప్పుడు చేసే నృత్య రీతి ఇది. పురుషులు ఈ నృత్యాన్ని చేయడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. పురుషులు క్రింద కూర్చొని ఒక కాలును దూరంగా చేస్తూ, మరొక కాలును దగ్గరగా చేస్తూ, తర్వాత దూరం చేసిన కాలును దగ్గర చేస్తూ, దగ్గర చేసిన కాలును దూరం చేస్తూ చేతులపై భారాన్ని మోస్తూ చేసే నృత్యం ఉత్రూమారేర్ నాచ్. హోలీ అంటే బంజారాలకు ఎంతో యిష్టమైన పండుగ. హోలీ అంటేనే రంగుల పండుగ. ఫాల్గుణమాసంలో విరబూసే (కేసులా పూల్) మోదుగ పువ్వులను తెచ్చి, రంగును తయారుచేసి ఒకరిపై ఒకరు చల్లుకుంటూ పండుగ నిర్వహిస్తారు. ఆ సందర్భంగా చేసే నృత్యరీతి ఈ ఉత్రూ మారేర్ నాచ్. అంతేకాదు హోలి సందర్భంగా దరువులకు అనుగుణంగా అడుగులు కదుపుతూ ఊరూరు తిరుగుతూ, రంగులు జల్లుతూ, పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. వీరిని గేరియాలంటారు. పురుషులందరు రంగుల దుస్తులను ధరించి, గజ్జెలు కట్టుకొని, చేతిలో గొడుగులు పట్టుకొని నృత్యం చేస్తుంటే చూడడానికి రెండు కళ్లు సరిపోవు.

**దేవరకొండ బసతీమ ఛ్వారిభారి మసతి**
**ఊ చాలతే గేరియాతి ధూంగో గసతి ॥ ఛ్వారి మసతి॥**
**ఛ్వారీ మసతి సాసిజ్‌గా**
**ఛ్వారీ మసతి ద్వాల్లేతి**
**ఛ్వారీ మసతి గంతేతి**



అంటూ పాడుతుంటారు గేరియాలు. దేవరకొండ బస్తీల అమ్మాయిలకు పొగరెక్కువ, అటు నుంచి వెళ్తున్న గేరియాలను కవ్విస్తూ పోతున్నారని ఈ పాట భావం.

**బ్యాస్కు మారేర్ నాచ్ :**

కింద కూర్చుని చేసే నృత్యరీతి ఇది. పురుషులు మాత్రమే ఈ నృత్యాన్ని చేస్తారు. పురుషులు క్రింద కూర్చుని కాళ్ళను ముందుకు వెనక్కు కదుపుతూ చేసే నృత్యం ఇది. ప్రత్యేకంగా హెూళీ పండగప్పుడు చేసే నృత్యం. లయబద్ధంగా శబ్దం చేసే డప్పుకు అనుగుణంగా విన్యాసభరితంగా ఉంటుందీ ఈ నృత్య శైలి. చూసే వారిని కన్ను తిప్పనివ్వని నృత్య శైలి ఇది.

**మజాదూరేరో నాచ్ :**

బంజారాల సంతోషాన్ని రెట్టింపు చేసేవి పర్వదినాలు, పెళ్లిళ్లు. ఈ సందర్భంగా ఆనందాన్ని అందరూ పంచుకుంటూ చేసే నృత్యమే ఈ మజాదూరేరో నృత్యం. మజాదూర్ అంటే సంతోషభరితమైన అని అర్థం. బంజారాలు ఆప్యాయతకు, అనురాగాలకు పెట్టింది పేరు. ప్రతీ సందర్భాన్ని తమ వారందరితో కలిపి ఆనందంగా జరుపు కుంటారు. మజాదూరేరో నృత్యంలో స్త్రీలు తమ కాలి అడుగుల్ని విభిన్నంగా కదుపుతూ చేతులను పైకెత్తి, అర చేతులను మూస్తూ, తెరుస్తూ ముందుకు కదులుతుంటారు. ముందుకు కదిలిన స్త్రీలందరూ ఒక్కసారిగా గిర్రున తిరుగుతూ వెంటనే వెనక్కి వెళ్తారు. ఇలా గంటల తరబడి అలుపు లేకుండా నృత్యం చేస్తారు. ఈ నృత్యానికి నంగారా లేదా డప్పు వాద్య సహకారం అందిస్తుంటే పాట నృత్య సందర్భాన్ని ప్రతిబింబిస్తుంది. గజ్జెల గలగలలతో, పాటల తియ్యదనంతో, నంగారా శబ్దంతో తండా మొత్తం నృత్యమయమవుతుంది.

**ఝుంఝుం నాచ్ :**

ఝుంఝుం అనబడే మువ్వల వాద్యాన్ని లయబద్ధంగా ఊపుతుంటే వచ్చే శబ్దాన్ని అనుసరించి చేసే నృత్యాన్ని ఝుంఝుం నాచ్ అంటారు. ప్రత్యేకంగా బంజారాలు తమ వీరత్వాన్ని ప్రదర్శించే సందర్భాల్లో ఈ నృత్యం చేస్తారు. రాజపుత్ర శూరత్వపు ఆనవాళ్లు ఈ నృత్యంలో కనబడతాయి. యుద్ధ సమయానికి ముందు చేసే నృత్యంలాగా ఉంటుంది ఈ నృత్యం. కాకతీయుల కాలంలో సైనికుల్లో ఉత్సాహాన్ని నింపడానికి పేరిణీ నృత్యాన్ని చేయించేవారు. ఈ ఝుంఝుం నాచ్ కూడా అలనాడు రాజపుత్ర సైనికుల్లో అలాంటి ఉత్సాహాన్నే నింపేది. ఈ నృత్యాన్ని స్త్రీ పురుషులు కలిసి చేస్తారు. ఒక వైపు నంగారా, ఇంకోవైపు ఝుంఝుంలు శబ్దం చేస్తుంటే స్త్రీ పురుషులు విభిన్నమైన అడుగులు వేస్తూ, గుండ్రంగా ముందుకు కదులుతారు. రెండు చేతులతో ఝుంఝుంలు ఊపుతూ, కాళ్లను ముందుకు, వెనుకకు కదుపుతూ వలయాకారంలో తిరుగుతూ ఈ నృత్యం చేస్తారు.

**ఏక్ టాంగేరో నాచ్ :**

బంజారాలు నృత్యం చేస్తున్నప్పుడు డప్పు చేసే శబ్దాలను బట్టి నృత్య రీతిని మార్చుకోవడం విశేషం. అందులో భాగంగా ఏర్పడ్డ నృత్యరీతి 'ఏక్ టాంగేరో నాచ్' అంటారు. స్త్రీలకు మాత్రమే పరిమితమైన నృత్యం ఇది. ఇందులో భాగంగా డప్పు విభిన్నంగా మ్రోగుతుంటే స్త్రీలు తమ కుడికాలును వెంట వెంటనే మూడుసార్లు ముందుకు కదుపుతారు. ఎడమకాలు సహాయంతో పక్కకు జరుగుతూ గుండ్రంగా కదిలి పోతుంటారు. ఈ కదలికకు తోడు స్త్రీలు చేతులు ఊపుతూ హావభావాలు ప్రదర్శిస్తుంటారు.

**ది టాంగేరో నాచ్ :**

డప్పు శబ్దం మూడేసి, మూడేసి లయల్లో మ్రోగుతుంటే చేసే నృత్యం ఇది. రెండు కాళ్ళను ఆడిస్తూ చేసే నృత్యం ది టాంగేరో నాచ్. నృత్యం చేసే స్త్రీలు ఎడమ కాలును ముందుకు వేసి వెంటనే మూడు అడుగుల దూరం ముందుకు వచ్చి, గుండ్రంగా తిరిగి మళ్లీ అదే రీతిలో వెనక్కి వెళ్తుంటారు. వెనక్కి వెళ్తున్న క్రమంలో ఒక చేతిని క్రిందికి దించి మరోచేతిని పైకెత్తడం, వెనువెంటనే ఎత్తిన చేతిని క్రిందికి దించి, దించిన చేతిని పైకెత్తడం చేస్తుంటారు. మళ్ళీ గుండ్రంగా తిరిగి ముందుకు కదులుతుంటారు.

**ఢాలియార్ నాచ్ :**

డప్పు మొదట చేసే మూడు శబ్దాలు తర్వాత చేసే రెండు శబ్దాలకు అనుగుణంగా చేసే నృత్యం ఈ ఢాలియార్ నాచ్. రెండు కాళ్ళను ఒకదాని తర్వాత ఒకటి ముందుకు వేస్తుంటే పైకెత్తబడిన రెండు చేతులు హావభావాలను ప్రదర్శిస్తుంటాయి. ఈ రకంగా స్త్రీలు ముందుకు కదిలిపోతుంటారు. ఢాఢీలు, భాట్‌లు, ఢాలియాలు బంజారా లలో వాద్యకారులుగా ప్రసిద్ధులు. ఢాలియాలు డప్పు వాయించడంలో ప్రావీణ్యం గలవారుగా చెప్పుకోవచ్చు.

**అడుగు నృత్యం :**

డప్పు శబ్దం ఒకటి, రెండు లయల్లో మ్రోగుతుంటే స్త్రీలు కుడి కాలు పాదాన్ని ముందుకు కదుపుతూ ముందుకు వంగుతూ రెండు చేతుల్ని భూమి వైపుకు చూపించడం చేస్తారు. వెంటనే వెనక్కి వెళ్లి మళ్లీ అదే రీతిలో అడుగు వేస్తారు. ఎడమ కాలి సహాయంతో ప్రక్కకు జరుగుతూ గుండ్రంగా కదిలిపోతుంటారు.

**బంజారా తెగలు - నృత్య రీతులు :**

భారతదేశంలో రాజస్థాన్ సంస్కృతికి మూల కేంద్రంగా కనిపిస్తుంది. బంజరాలకు జన్మస్థానంగా పేర్కొంటున్న రాజస్థాన్‌లో బంజారా నృత్యంలో విభిన్న శైలులు దర్శనమిస్తాయి. బంజారాల్లో ఉండే ఇతర తెగలు వారు చేసే నృత్యాలు ఈ విభిన్నతకు తావునిస్తాయి. రాజస్థాన్ రాష్ట్రంలో బంజారా తెగలైన కాల్‌బేలియా, బోపా, సతియా, సఫేరాలు కూడా తమ మనుగడను సాగిస్తున్నాయి.

**కాల్‌బేలియా తెగ :**

రాజస్థాన్ రాష్ట్రంలో కనబడే కాల్‌బేలియా తెగ ఎప్పుడూ ఒక చోట ఉండదు. తమ స్థానాన్ని మారుస్తూ వెళుతుంటారు వీరు. వీరు చేసే నృత్యాన్ని కాల్‌బేలియా నృత్యం అంటారు. వీరి నృత్యంలో చేసే విన్యాసమంతా ఒక సర్పాన్ని పోలినట్టుగా ఉంటుంది. సర్పం చేసే విన్యాసం, హావభావాలు ఈ కాల్‌బేలియా నాచ్‌లో కనబడతాయి. నృత్యం చేసే సమయంలో వీరు ధరించే వస్త్రాభరణాలు అత్యంత సుందరంగా కనిపిస్తాయి. గవ్వలు, గాజులు, కాళ్ళ కడియాలు ధరిస్తారు వీరు. చేతులను పాము పడగ ఊపినట్టు ఊపుతూ, గుండ్రంగా తిరుగుతూ అప్పుడప్పుడూ క్రింద కూర్చొని ఒక కాలును దూరంగా జాపి, ఆ కాలువైపు వంగి రెండుచేతుల్ని రెండువైపులా చాపి, పాము చేసే విన్యాసాన్ని చేతులద్వారా చూపిస్తారు. ఈ నృత్యం చూడముచ్చటగా అనిపిస్తుంది. గోర్ బంజారాల నృత్యానికి, కాల్‌బేలియాల నృత్యాలకి సారూప్యత ఉండడం మనం గమనించవచ్చు.

**బోపాతెగ :**

రాజస్థాన్‌లో నివసించే బోపా తెగ వారి సాంప్రదాయిక సంగీత వాద్యం రబాబ్, సారంగీలకు ప్రసిద్ధి చెందినవారు. రబాబ్‌ను, సారంగీని వాయిస్తూ గుండ్రంగా తిరుగుతూ తన్మయత్వం చెందుతూ, పాటలు పాడుతూ నృత్యం చేస్తారు వీరు. బోపా తెగవారు రాజస్థాన్ వీరులకు సంబంధించిన వీరగాథలను తెరచిత్రాల సాయంతో వర్ణిస్తూ కథాగానం చేస్తారు. పురుషులు కథాగానం చేస్తూ సారంగిని వాయిస్తారు. స్త్రీలు కథాగానంలో సహకరిస్తుంటారు. ఒకప్పుడు రాజాస్థానాలలో విలువైన బహుమతులను, సన్మానాలను పొందిన తెగ ఇది. తెలుగు జానపద కళారూపాల్లో తెనుగు కులాన్ని (ముదిరాజ్‌లు) ఆశ్రయించిన కాకి పడగల వారు, గౌడ కులస్తులను ఆశ్రయించిన పటం కథల వారు (గౌడ జెట్టీలు) చెప్పే వీర గాథల వలె వీరి కథాగానం ఉంటుంది. తెలంగాణలో, మహారాష్ట్ర, కర్ణాటకలో వీరిని ఢాడీలు అంటారు. ఇప్పటికి బంజారాల చరిత్రను, గొప్పతనాన్ని కథలుగా చెబుతుంటారు ఢాడీలు.

**సతియా తెగ :**

సతియా తెగ వారు ఈ ప్రపంచాన్ని దుఃఖమయంగా భావిస్తారు. ఎవరైనా జన్మించినప్పుడు వీరు ఏడవటం మనం గమనించవచ్చు. ఈ దుఃఖపు ప్రపంచంలోకి ఇంకొక ప్రాణి వచ్చిందని ఇంక కష్టాలను




ఎదుర్కొనడమే ఆ ప్రాణి జీవితమని ఈ దుఃఖపు సందేశం. ఈ తెగ వారు వారి తెగలో ఎవరైనా చనిపోతే ఏడవకుండా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, ఈ దుఃఖ ప్రపంచం నుండి తమ వారికి ముక్తి లభించిందంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. చావు సమయంలో వీరు సారాయిని తాగి, మనస్సు నిండుగా నృత్యం చేస్తారు. మగవారు ఢోలక్, బాజా, కంజీరా, రబాబ్, సారంగీలు వాయిస్తుంటే స్త్రీలు గుండ్రంగా తిరుగుతూ, చేతి విన్యాసాలతో నృత్యం చేస్తారు.

**సఫేరా తెగ :**

రాజస్థాన్ బంజారా తెగలలో పాములు పట్టి ఆడించే తెగను సఫేరా తెగ అంటారు. వీరు చేసే నృత్యాన్ని సఫేరా నాచ్ అంటారు. తలపై కడవలు పెట్టుకొని, బోర్లించిన గ్లాసులపై రెండు కాళ్లు పెట్టి ఎక్కి, నృత్యం చేస్తారు. గుండ్రంగా తిరుగుతూ విభిన్న వాద్యాలకు అనుగుణంగా నృత్యం చేయడం విశేషం. 'గులాబో సఫేరా' అనే మహిళ ఈ నృత్యంలో ఎంతో ప్రావీణ్యం చూపించారు. అందుకు గాను ఆమెను భారతప్రభుత్వం పద్మశ్రీతో సన్మానించింది. ఆమె కీర్తి అంతర్జాతీయ స్థాయిలో విఖ్యాతమయింది. గులాబో సఫేరా ఆడపిల్లగా జన్మించడంతో పుట్టగానే ఒక గోతితీసి పాతిపెట్టేశారు. అదృష్టవశాత్తు ఆమె బంధువొకరు ఆమెను కాపాడి పెంచి పెద్ద చేశాడు. ఆమె ఇప్పుడు ప్రపంచప్రఖ్యాత సపేరా నృత్యకారిణి.

**వివిధ రాష్ట్రాలలో గోర్ బంజారాల నృత్య శైలులు :**

మహారాష్ట్రలోని బంజారాలు వారి నృత్యాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. స్త్రీ, పురుషులు సమూహాలుగా, వేరు వేరుగా, పక్క పక్కనే నృత్యం చేస్తారు. మధురమైన బంజారా పాటలకు, చక్కని వాద్య సహకారంతో అందంగా, లయబద్ధంగా ఆడుతారు. పురుషుడు డప్పును వాయిస్తూ సమూహం మధ్యలో నిలబడి ఉంటాడు. గజ్జెలు, తలపాగ, అందమైన కోటును ధరిస్తాడు. అతని చుట్టూ స్త్రీ సమూహం తిరుగుతూ నృత్యం చేస్తారు. పురుషుల సమూహం కూడా డప్పు వాయిస్తున్న మరొక పురుషుని చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తారు. పురుషులు, స్త్రీలను సంబోధిస్తూ పాట పాడుతూ, గుండ్రంగా తిరుగుతూ ఒక కాలును మరొక కాలి వెనుకకు వేస్తూ, ముందుకు కదులుతారు. ఒక్కోసారి కుడివైపుకు గిర్రున తిరుగుతూ వెంటనే ఎడమవైపుకు గిర్రున



తిరుగుతూ, కాలి, చేతి విన్యాసాలతో నృత్యం చేస్తారు. స్త్రీలు, పురుషుల పాటకు సమాధానమిస్తూ, గుండ్రంగా తిరుగుతూ, వంగుతూ, నిలబడుతూ, చేతులను ఊపుతూ నృత్యం చేస్తారు. వీరు నృత్యం చేస్తుంటే అలా చూస్తూ ఉండిపోతాం. లేజివ్స్, కోలాటపు దాండియాలను వాడుతూ నృత్యం చేస్తారు.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో హోలి పర్వదినం సందర్భంగా బంజారాలు చేసే నృత్యాన్ని "ఫాగ్ నాచ్" అంటారు. ఫాల్గుణమాసంలో వచ్చే రంగుల పండుగను వీరు ఫాగ్ త్యోహార్ అంటారు. వీరు ఈ పండుగను ఐదు రోజులు నిర్వహించుకుంటారు. హోలీని పురస్కరించుకొని ఐదు రోజులు కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. పుత్ర సంతానానికి ప్రతీకగా హోలీని వీరు భావిస్తారు. పుత్ర సంతానం కలిగిన ఇంటికి వెళ్లి బిడ్డను ఆశీర్వదించి దక్షిణను పొందుతారు. అనంతరం ఇరువురు పురుషులు వెదురు బొంగును అటు, ఇటు పట్టుకోగా వెదురు బొంగుకు అటు ఇటు రెండువైపులా పురుషులు కట్టెలతో నిలబడి ఒక్కసారిగా వెదురుబొంగును బాదుతుంటారు. ఇది కూడా నృత్యపురీతిలా సాగుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో కూడా ఈ క్రతువును నిర్వహిస్తారు.

మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలలో ''లేంగి'' ని నిర్వహించు కుంటారు. ఇదొక ప్రత్యేకమైన సందర్భం. హోలీ సందర్భంగా ఈ ''లేంగీ''ని నిర్వహిస్తారు. ''లేంగీ'' నిర్వహణలో స్త్రీలు చప్పట్లు, చేతి విన్యాసాలు చేస్తుండగా పురుషులు డప్పు వాయిస్తూంటే నృత్యం సాగుతుంది. గోవాలాంటి ప్రదేశాలలో ఆధునిక హంగులు ఎన్ని వచ్చినా నేటికీ సంప్రదాయ బంజారా నృత్యాన్ని ఎవరూ మరిచిపోలేదు. తమ సంప్రదాయ నృత్యం చేస్తూనే కొంకణి సంప్రదాయాలను కలుపుకుంటూ నృత్యం చేయడం ఇక్కడి విశేషం.

ఈ విధంగా ప్రతీ పండుగను, జీవితంలోని ప్రతీ సందర్భాన్ని నృత్యమయం చేస్తారు బంజారాలు. సాంస్కృతికంగా ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని ఏకం చేస్తూ భారతీయ నృత్య సంప్రదాయాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు వారు. దేశవ్యాప్తంగా వారు ఎక్కడ ఉన్నా, తమ పూర్వీకులు తమకిచ్చిన సంస్కృతిని, సంప్రదాయాలను పవిత్రంగా భావించి కాపాడుకుంటున్నారు.

బంజారాల సాంప్రదాయ నృత్యం వారి ఘనమైన చరిత్రను చెప్తుంది. వారి చారిత్రక వాస్తవాలకు ప్రతిరూపంగా నిలుస్తుంది. అందుకే బంజారాలు వారి నృత్యాన్ని పవిత్రంగా భావిస్తారు. జానపదులు ఏ విధంగానైతే తమ నృత్యరీతుల్ని పదిలంగా ఉంచుతున్నారో అదే విధంగా బంజారాలు కూడా తమ నృత్యాన్ని, నృత్య రీతుల్ని పదిలంగా ఉంచుతున్నారు. అందుకే బంజారాల జీవనంలోని ప్రతీ సందర్భం కళామతల్లి లోగిలి అవుతుంది. నేటి ఆధునిక కాలంలో వస్తున్న సాంస్కృతిక మార్పుల ప్రభావం వీరి నృత్యంపై కూడా పడుతున్నదని గమనించాలి. నేటి డీజే, రికార్డింగ్ డ్యాన్స్‌ల ప్రభావంతో యువత వారి సాంప్రదాయిక నృత్యానికి దూరమవుతున్న పరిస్థితి ఎదురవుతున్నది. తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న బంజారా నృత్యాన్ని ప్రదర్శించేవారు తండాల్లో మాత్రమే కనిపిస్తున్నారు. అందునా ఒక తరం ముందున్నవారు మాత్రమే ఈ నృత్యాన్ని చేస్తున్నారు. కావున నేటి యువతరం తమ ప్రాచీనతను నిలిపి ఉ ంచుతున్న బంజారా నృత్యాన్ని నేర్చుకొని సజీవంగా ఉంచాల్సిన ఆవశ్యకత నేడు ఉన్నది.

బిల్ క్లింటన్, బుష్ వంటి విదేశీ అతిథులు వచ్చినప్పుడు, సభలు, ఊరేగింపుల్లో గిరిజనులను పిలిచి నృత్యం చేయిస్తున్నారు. గిరిజనులు ఆత్మాభిమానానికి ప్రతీకలు. కాబట్టి వారి నృత్య విశిష్టతను గుర్తించి వారి నృత్యానికి హెరిటేజ్ హోదాను అందించాలి. దేశవ్యాప్తంగా గిరిజనులు ఉన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తించి, వారిని ఆదరించి, రాష్ట్రాలు గుర్తించిన నృత్యాల్లో గిరిజనుల నృత్యాల్ని కూడా చేర్చాలి. దేశంలో జరిగే కోణార్క్, ఖజురహో, మామల్లాపురం, ముక్తేశ్వర్, నిషాగంధి వంటి నృత్య మహోత్సవాల్లో గిరిజనులకు పాల్గొనే అవకాశాన్ని కలిగించాలి.



# కవిత్వం - ప్రామాణికత

**ఎం. కురుమయ్య యాదవ్**
ఫోన్ : 7799553493

కవిత్వం అనగానే మనలో చాలామందికి స్ఫురించే విషయం ఏమిటంటే -

+ పెద్ద పెద్ద అర్థాలు వచ్చే పదాలను పొందికగా కూర్చడం

+ ప్రాస నియమాలతో కూడిన ఛందోబద్ధ రచన

+ ఎన్నో పెద్ద పెద్ద గ్రంథాలు పుస్తకాలు చదివిన వారు మాత్రమే రాయగలరు.

+ ఎంతో అనుభవంతో కూడుకున్న ప్రక్రియ.

+ మేధావులతోనో, అనుభవజ్ఞులతోనో సాంగత్యం చేస్తేనే కవితా రచన చేయగలం.

కాని ఇవి ఏవీ కవిత్వానికి ప్రమాణాలు కావు.

ఏ పూర్వ గ్రంథపఠనం ఉన్నందువల్ల వాల్మీకి సంస్కృతంలో ఆదికావ్యమైన 'రామాయణం'ను రచించి సంస్కృత ఆదికవిగా ప్రసిద్ధి పొందారు.

ఏ అనుభవజ్ఞుల సాంగత్య ఫలితంగా జాషువా తెలుగు సాహిత్యంలో భావవిప్లవం సృష్టించి నూతన కవిత్వ శకానికి జీవం పోసి మధుర శ్రీనాథుడుగా కీర్తి గడించారు.

ఈ ఉన్నతమైన గ్రంథాలు చదవడం వల్ల వేమన గారు నేటికీ చదువురాని వాళ్ళ నోళ్ళలో సైతం అలవోకగా పాడగల గొప్ప సంపద సృష్టించి ప్రజాకవిగా ప్రసిద్ధి పొందారు.

ఏ ఛందోబద్ధ నియమాలు పాటించడం వల్ల నేడు **మినీకవిత్వం, వచన కవితా** ప్రక్రియలుగా విరాజిల్లుతున్నాయి.

అసలు అసలు కవిత్వం అంటే ఏమిటి? అది ఎలా పుడుతుంది? వంటి అంశాలను పాలవేకరి కదిరీపతి గారు తాను రచించిన శుకసప్తతి ఎంతో చక్కగా వివరించారు. అదేమిటంటే -

**"మనసుకు అనుభూతి / బుద్ధికి ఊహ**

**అభివ్యక్తికి శక్తి చాలినంత పొందినప్పుడే అసలైన కవిత్వం పుడుతుంది"**

మనిషికి ఎదురైన అనుభవాలు అతని మనసును తాకి మనసులోని ఉద్వేగాలు కదిలించినప్పుడే అవి అనుభూతిగా మారుతాయి. ఆ అనుభూతిని ఒక అమూర్త రూపంలోకి మార్చి, దానిని పరిపూర్ణంగా వర్ణించగల శక్తి / వ్యుత్పత్తి సామర్థ్యం ఆ మనిషికి సిద్ధించినప్పుడే ఆ అనుభూతి ఒక పరిపూర్ణ మూర్తరూపం సంతరించుకుని కవిత్వంగా వెలువడుతుంది.

మనలో చాలమందికి మనసులో ఎన్నో అనుభూతులు ఉన్నప్పటికీ వాటికి ఒక అమూర్తరూపం కల్పించే సందర్భంలోనే లేక వాటిని వ్యక్తీకరించే విషయంలోనే సరైన అవగాహన లేక వాటిని కేవలం అనుభూతులు గానే తమన మనసులోనే నిక్షిప్తం చేసుకుంటున్నారు. ఇతరులు ఎవరైనా తమలాంటి భావాలనే నిపుణంగా వర్ణించినప్పుడు అరెరే నా మనసులో ఉన్న విషయం కూడా ఇదే అని చాలామంది జీవితంలో ఒక్క సందర్భంలోనైనా అనుకొని బాధపడి ఉంటారు. దానికి కారనం వాళ్ళలో ఊహాశక్తి లేదా అభివ్యక్తి లోపమే.

పుస్తకాలు చదివితే అనుభవాలు వస్తాయి. ఆ అనుభవాల ఫలితంగా మనిషికి జ్ఞానం లభిస్తుంది. తద్వారా అతను మేధావి కాగలడు కానీ ఆ అనుభవాలు మనసుతో ముడిపడినప్పుడు అవి అనుభూతులుగా మారి, ఆ అనుభూతిని పరిపూర్ణంగా వ్యక్తీకరించే రచనా కౌశల్యం తోడైనప్పుడు అది కవిత్వంగా మారుతుంది.

చరిత్రలో ఎందరో మేధావులు ఉన్నారు కానీ కొందరు కవులు ఉన్నారు. అందుకు కారణం తమ చుట్టూ ఉన్న ప్రపంచంలో జరిగే సంఘటనల వెనుక దాగి ఉన్న నిర్మాణాత్మకతను చూసేవాడు మేధావి కాగలడు కానీ ఆ సన్నివేశాల మధ్యగల సౌందర్యాన్ని దర్శించి, నిపుణంగా వర్ణించగలిగినవాడే కవి కాగలడు.

తన కళ్ళ ముందు జరిగిన క్రౌంచ పక్షుల వినియోగమే ఒక అనుభూతిగా మారి వాల్మీకి నోట అప్రయత్నంగా వెలువడిన "మా నిషాద ప్రతిష్ఠాంత ..." అన్న శ్లోకమే అంత గొప్ప రామాయణం రచనకు పునాది చేసింది.

తన జీవితంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు అవమానాలు ఛీత్కారాల ఫలితమే జాషువా లోని కవిత్వానికి మూలకారణం.

తన మనస్సులో ఏర్పడ్డ వైరాగ్య భావమే వేమనను గొప్పకవిగా చరిత్రలో నిలిపింది.

ఇన్ని పుస్తకాలు చదివితేనో, ఇంత అనుభవం పొందితేనో, జ్ఞానం వస్తుంది అని చెప్పగలం కానీ ఫలానా అంశాల సాధన వల్లనే కవిత్వ రచన సిద్ధిస్తుందని ఎవరు చెప్పలేరు కారణం **కవిత్వం అంటే మనో ఉద్వేగ పరిపక్వత.**

నేల రాలిన క్రౌంచపక్షుల వియోగబాధను వాల్మీకితో పాటు ఆ బోయవాడు కూడా చూశాడు కానీ పక్షుల విరహవేదన వెనుక ఉన్న అలౌకిక ప్రేమ తత్వాన్ని దర్శించిన వాల్మీకి ఆ సంఘటనకు ప్రతిస్పందించి, తన బాధను ఆశువుగా వ్యక్తీకరించాడు.

**పోతన తన భాగవతంలో** కవిత్వమును ఇలా నిర్వచించారు.

**"కవన ప్రధాన రచనయే కవిత్వం"** అంటే **వర్ణనాత్మకమైన నైపుణ్య రచనయే కవిత్వం** అని అర్థం.

శ్రీశ్రీ చెప్పినట్లు **"కుక్కపిల్ల - అగ్గిపుల్ల - సబ్బుబిళ్ళ - కాదేది కవిత్వానికి అనర్హం"**

ఈ సృష్టిలో కవిత్వానికి పనికిరాని వస్తువు అంటూ ఏదీ లేదు.

ఆల్చిప్పలో పడిన ప్రతి వర్షపు చినుకు మేలిముత్యంగా రూపు దిద్దుకున్నట్లుగానే కవి దృష్టిలో పడిన ప్రతి అంశం అది ఉన్నతమైన

దైనా, అల్పమైనదైనా ఏదైనా సరే అది గొప్ప కవితా రూపాన్ని సంతరించుకోగలదు. అందుకే తిలక్‌గారు కవిత్వం ఒక ఆల్కెమీ అన్నారు.

మొదట్లో కవిత్వం అంటే పురాణ ఇతిహాసాలతో కూడినది, రాజులు వారి ప్రణయ కథలు, వారి వారి రాణుల ప్రేయసుల అందచందాలను వర్ణించే పద్యరూపంగానే ఉండేది. కాలానుగుణంగా కవిత్వం కూడా మారుతూ నేడు సామాజిక అంశాలను ప్రస్తావిస్తూ గేయం, వచన రూపంలోకి మారింది.

మారుతున్న కాలానికి అనుగుణంగా కవిత్వం కూడా తన రూపాన్ని మార్చుకుంటూ వచ్చింది. ఆయా కాలాలను బట్టి కవిత్వాన్ని వివిధ రకాల పేర్లతో పిలిచేవారు. అందులో కొన్ని ...

జాతీయ వాద కవిత్వం, సంఘ సంస్కరణవాదం, భావ వాద కవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత వాద కవిత్వం ... రూపాలు వేరే అయినప్పటికీ దానిలోని మూలతత్వం ఒకటే. అదే సమాజాన్ని, ప్రజలను అనుసంధానించడం.

వేమన తన కవిత్వంతోనే తొలిసారి మానవ సమాజంలో సమ సమాజ స్థాపనకు, వర్ణ వ్యతిరేకతకు, మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.

సమాజంలో స్త్రీల అభ్యున్నతికి వీరేశలింగం గారు ఎన్నుకున్న పోరాట మాధ్యమం కవిత్వమే.

మన మనసులోని అనుభూతులకు ఒక రూపం ఇచ్చి ఎదుటి వ్యక్తి మనసును కదిలించే ప్రతిది ఒక కవిత్వమే. అది పద్యం కావచ్చు, గేయం కావచ్చు, వచనం కావచ్చు, ఒక వాక్యం కావచ్చు, చిన్న పదబంధం కూడా కావచ్చు.

జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అన్నట్టుగా కవిత్వం ఒక్కో వ్యక్తిని బట్టి ఒక్కో కాలాన్ని బట్టి ఒక్కో సమాజాన్ని బట్టి ఒక్కో వాదాన్ని బట్టి ఒక్కో విధంగా కనబడుతుంది.

"కొందరికి ఊహా ప్రేయసి గానూ..  
ఇంకొందరికి రుధిర దళ కవాతు గానూ..  
మరికొందరికి నిరసన పోరాట గర్జనల  
వేరొకరికి సమానత్వ సాధనకై సారథిగానూ...."

**"మాటవినక మారాం చేసే బుజ్జాయి నిద్రపుచ్చే జోల పాట కవిత్వమే...**  
**చెంత చేరిన చెలిని మోహపరిచే గానం కవిత్వమే**  
**అన్యాయంపై తిరగబడ్డ విప్లవ గళం కవిత్వమే**  
**సమానత్వం పోరాట సంద్రంలో ఉవ్వెత్తున ఎగిసిపడే అలల హోరు కవిత్వమే..."**

సమాజంలో నిత్యం ఎందరో రచయితలు ఎన్నో రచనలు చేస్తూ ఉంటారు. వారిలో కేవలం కొందరు మాత్రమే ఉత్తమ రచయితగా పేరు సంపాదించుకోగలరు. ఆ ప్రముఖ రచయిత యొక్క రచనలలో కేవలం కొన్ని మాత్రమే ప్రసిద్ధి పొందగలవు. ఉదాహరణకు శ్రీశ్రీ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది మహాప్రస్థానం రచన మాత్రమే. మరి ఏ అంశాల ఆధారంగా ఒక రచన ఉత్తమమైనదిగా గుర్తింపు పొందగలదు. ఉత్తమ రచనకు ఉండాల్సిన ప్రమాణాలు ఏమిటి? అని ఎందరో పరిశోధించారు. వారిలో కట్టమంచి రామలింగారెడ్డి గారు ముఖ్యులు. వీరు రాసిన కవిత్వతత్వ విచారం అన్న గ్రంథంలో ఉత్తమ కవిత్వానికి ఉండాల్సిన మూడు లక్షణాలను పేర్కొన్నారు. అవి.

భావనాశక్తి, రసానుభూతి, సర్వజనామోదం

భావనాశక్తి అంటే అంటే ఒక విషయాన్ని మనసులో ప్రతిబింబింప జేయు సామర్థ్యం... అంటే పాఠకుడు ఆ గ్రంథాన్ని చదివేటప్పుడు అందులోని అంశాలను తానే ప్రత్యక్షంగా చూసినట్లు, అవి తన కళ్ళముందే జరుగుతున్నట్లుగా అనుభూతి చెందగలగాలి. అల్లసాని పెద్దన మనుచరిత్రలో ... "అటజని కాంచె భూమి సురుడంబర .... " అన్న పద్యంలో హిమాలయాల సౌందర్యాన్ని వర్ణిస్తూన్నప్పుడు ఆ హిమాలయ పర్వతాల అందాలు, ఆ ప్రకృతి సోయగం, ఆ నెమలి నాట్యాలు .... అన్నీ పాఠకునికి ఒక్క క్షణం అలా కళ్ళముందు కదలాడతాయి. ప్రవరుడితో పాటు తాము కూడా ప్రత్యక్షంగా హిమాలయాలను దర్శించినట్లు గాని అనుభూతి పొందుతారు.

రసానుభూతి అంటే రచయిత ఏ రసాన్ని ఊహించుకొని తన రచన చేస్తాడు. అది చదివి పాఠకుడి మనసులో కూడా అదే రసస్థాయి ఏర్పడాలి. అప్పుడే అది రసానుభూతిగా పరిగణింపబడుతుంది. ఒకవేళ రచయితకు పాఠకుడికి మధ్య రససామ్యం లేకపోతే అది ఉత్తమ రచన కానేరదు.

రచయిత వీర రస ప్రధానంగా రచన చేయాలనుకున్నప్పుడు అందులోని కథానాయకుడి పాత్రను ఉన్నతంగా గంభీరంగా ఒక వీరుడిగా చిత్రీకరించాలి. కానీ పిరికివాడిలా చిత్రీకరించకూడదు.

శ్రీశ్రీ మహాప్రస్థానం అంత గొప్పగా పేరు పొందడానికి కారణం అందులో గల రసానుభూతి. ఆ రచనను చదివిన పాఠకుడికి సైతం ఉత్సాహం పొంగి తనను ఉత్తేజాన్ని కలిగిస్తుంది.

సర్వజనామోదం అంటే నిరంతర పరిణామ క్రమం చెందుతున్న ఈ సమాజంలో పాఠకాదరణ పొందాలంటే ఈ లక్షణం తప్పనిసరి. కవిత్వం అనేది నిత్యం ప్రవహించే సెలయేళ్ళు లాంటిది. సెలయేరు నిత్యం ముందుకు సాగుతూ అందరి అవసరాలను తీరుస్తుంది. నిలిచిన నీరు మురికిగా మారి తాగడానికి ఎలా పనికిరాదో అలాగే కాలంతో పాటు మారని కవిత్వం, సమాజ అవసరాలను ప్రస్తావించని కవిత్వం కూడా అలాగే మరుగున పడిపోతుంది.

ఒకనాటి కవిత్వం రాజులు, జమీందార్ల ప్రణయ, భోగ, విలాస వస్తువు. కానీ నేడు కవిత్వం అంటే సమాజ ప్రతిబింబం. నేటి కవిత్వంలో సమకాలీన సమాజంలోని అంశాలే కథా వస్తువులు.

గ్రంథాంతరంగం 06

# ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర


శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

**'గద్యం కవీనాం నికషం వదన్తి'** అన్న ఆర్యోక్తి పద్యకవుల రచనా ప్రతిభకు గద్యరచన గీటురాయి వంటిది అన్న అర్థాన్ని బలపరుస్తుంది. పద్యకవుల శేముషీ వైభవాన్ని కీర్తించిన మన విమర్శకులు, వాళ్ల కావ్యాల్లోని గద్య గరిమను గుర్తించిన ఛాయలు కాని, వచనరచనా సామర్థ్యాన్ని, గమనించిన జాడలు కాని ఆధునిక యుగం దాకా కనబడవు. వచనరచన ఆవశ్యకతనూ, ప్రాధాన్యాన్నీ, పరిశీలనా ప్రావీణ్యాన్నీ గుర్తించగలిగే దృష్టి మనకు లభించిందంటే అది పాశ్చాత్య సాహిత్య అధ్యయనం వల్లనే అని విశ్వసిస్తే 'తప్పేమి ఒప్పేయగున్.'

శ్రీ గొబ్బూరి వేంకటానంద రాఘవరావు గారు (1892–1958) రాసిన 'ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర' తొలిసారిగా 1923లో ప్రకాశితమైనది. తర్వాత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2002 జనవరిలో మలి ముద్రణగా వెలువరించింది.

చెన్నపురి ఆంధ్రసభ, బ్రాడ్వే, మద్రాసు విద్యాశాఖ వారు 'ఆంధ్ర వచన రచనా దశా పరిమాణము' అనే విషయంపై 100 పేజీల పుస్తకం రాతప్రతిని ఆహ్వానిస్తూ 1917 సెప్టెంబర్ 18 వ తేదీన ఆంధ్రపత్రిక (దిన) 20 రోజుల గడువునిచ్చి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ వ్యాస రచనల పోటీకి నలుగురు పండితులు వ్యాసాలు రాసి పంపగా, అనకాపల్లి మునిసిపల్ హైస్కూలులో విజ్ఞానశాస్త్ర బోధకులైన గొబ్బూరి వేంకటానంద రాఘవరావుగారు కీ.శే.రావు బహద్దూర్ కలువల కణ్ణన్శెట్టి గారి నూరు రూపాయలు విలువ చేసే రత్నఖచిత స్వర్ణపతకాన్ని ప్రథమ బహుమతిగా గెల్చుకున్నారు. తర్వాత ఈ వ్యాసం మరికొన్ని మార్పులు చేర్పులతో 1923లో పుస్తక రూపంగా వెలువడింది. గొబ్బూరి గారి గురువర్యులు ప్రేరకులు అయిన డాక్టరు బుఱ్ఱా శేషగిరి రావుగారు 'పీఠిక' లో మిత్ర శిష్యులైన గొబ్బూరి వారి కృతిని ఇట్లు ప్రశంసించారు– **"...పాశ్చాత్య కావ్య నిబంధనములతో ఆంధ్ర గ్రంథములను గొలిచి మన విద్యాధికులు కొందరు ప్రాచీనాంధ్ర కావ్యములను వికసించి యున్నారు. ముఖ్యముగా నిట్టివారికి నితాము నేర్చిన లక్షణము కాంధ్ర కావ్యముల నుండి లక్ష్యము లేర్పరించుకొననేరని లక్షణపరులకును నీ కృతి కావ్యాంజనమగుచున్నది."**

'ఆంధ్ర గద్యవాఙ్మయచరిత్ర' కర్త గొబ్బూరు వేంకటానంద రాఘవరావు ఈ గ్రంథంలో నన్నయ భారతంలోని గద్యాన్ని లక్ష్యంగా స్వీకరించి సంస్కృతం, ఆంగ్ల సాహిత్య లక్షణ పుస్తకాల ఆధారంగా తమ విమర్శన ప్రారంభించారు. రచయిత ఈ విమర్శన ప్రారంభించారు. రచయిత ఈ విమర్శనా కృతిలో నన్నయ గద్య వైశిష్ట్యాన్ని మాత్రమే పరిశీలించానని వినమ్రంగా 'విజ్ఞాపనము' లో ఇలా మనవి చేశారు. ఆయన ఈ గ్రంథ రచనా లక్ష్యాన్నీ, పరిమితిని ఈ విధంగా వెల్లడించారు. "... నన్నపార్యుని గద్య రచనల యందు గల ప్రాశస్త్యమును విదితమగుటయే గాక యీ గ్రంథము ఆంధ్ర గద్యరచనా విశేషములం గూడ కొంతవరకు బోధింపగల నిబంధన Elementary Principles of Telugu Prose Rhetoric గ్రంథము కావలసి వచ్చెను." నన్నయ భారతంలోని వచన పరిశీలనకే పరిమితమైన యీ గ్రంథానికి పూరకంగా గొబ్బూరివారు రాసిన "ఆంధ్ర వచన రచనా పరిణామం" వారి మరణానంతరం 1961లో వెలుగుచూసింది. మొత్తం మీద తెలుగు గద్యం గురించి ఆలోచించి, విమర్శనాత్మక దృష్టితో గ్రంథాన్ని వెలువరించిన




పండితుల్లో ప్రథమగణ్యులుగావెంకటానంద రాఘవరావు గారిని పేర్కొనవచ్చును. ఈయన అందించిన సూత్రాన్ని పట్టుకొని తెలుగు వచన సాహిత్య అధ్యయనాన్ని ముందుకు సాగించిన విద్వాంసుల్లో ప్రముఖులు శ్రీయుతులు నిడదవోలు వెంకటరావు, శ్రీవాత్సవ, ఆరుద్ర, డా. యమ్. కులశేఖర రావు గారలు.

'ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర' ఐదు ప్రకరణాలుగా విభజింపబడింది. మొదటి ప్రకరణంలో గ్రంథకర్త వాఙ్మయ నిర్వచనం, కావ్యం, కావ్యభేదాలు, గద్యకావ్యాల గురించి చర్చించారు. రెండవ ప్రకరణంలో విశ్వ సాహిత్యంలో ప్రారంభంలో పద్యమే రచింపబడిందనీ, తర్వాతనే గద్యం వెలువడిందనీ చెప్పారు. మానవుడు తన మనోభావాల్ని వ్యక్తం చేసిన కొత్తలో భావావేశం వల్ల పద్యరూపంలోనే వెలువడటానికి అవకాశం వుండిందనీ అన్నారు. పైగా లేఖనసాధనాల్ని కనిపెట్టేందుకు చాలాకాలం పట్టడం వల్ల, మొదట్లో వెలువడ్డ ఆ కవిత్వం కూడా మౌఖిక

రూపంలోనే వుండిపోయిందనీ చెప్పారు. కవిత్వాన్ని జ్ఞప్తి పెట్టుకోవడంలో వున్న సౌలభ్యం వచనానికి లేక పోవడం కూడా గద్య రచనలో విలంబం ఏర్పడిందని గొబ్బూరి వారన్నారు. జ్ఞాపకముంచుకోవడానికీ, గానానికీ గద్యం కంటే పద్యమే సులభతరం కావడం కూడా ప్రముఖ కారణమన్నారు రచయిత.

మూడవ ప్రకరణంలో నన్నయకు నూరు, నూట యాభై సంవత్సరాలకు పూర్వమే శాసనాల్లో తెలుగు పద్య గద్యాలున్నట్లు వెంకటానంద రాఘవరావు గారు సోదాహరణంగా పేర్కొన్నారు. సాహిత్యంలో పద్య గద్యాల పరస్పర సంబంధంపై వెలుగు చల్లారు.

గొబ్బూరివారు నాల్గవ ప్రకరణంలో చంపుకావ్య బాహుళ్యం సంస్కృతం, తెలుగు, విదేశీ భాషల్లో ఎందుకు కనబడుతుందో విప్పి చెప్పారు. గద్య పద్య మిశ్రితమైన చంపూ రచనల విశిష్టతను తెలియ చేస్తూ, తెలుగులో నిర్వచన కావ్యాలు ఎందుకు ఆదరణ పొందలేదో వివరించారు. కాలక్రమంలో తెలుగు కావ్యాల్లో గద్యం కనుమరుగయిందనీ, 17, 18 శతాబ్దాల్లో దక్షిణాంధ్ర యుగం తెలుగుగద్యకు వాసికెక్కిందని అన్నారు. గొబ్బూరి వారు సునిశితమతి. ఆయన ఇరవయ్యవ శతాబ్దపు రెండవ దశంలోనే తెలుగు వచన విశిష్టతను, ప్రాధాన్యాన్ని పసిగట్టారు. **"పదునేడు. పదునెనిమిదవ శతాబ్దముల యందు వెలసిన యీ కేవల గద్య వాఙ్మయ విమర్శనమునకు మన చరిత్ర యందొక ప్రత్యేక సంపుటము కావలసి యుండును"** (ఆం. గ.వా. చరిత్ర. పేజి: 38. తె. వి. వి. ప్రచురణ. 2002)

గొబ్బూరివారు ఈ గ్రంథంలో మూడు విషయాల్ని చర్చించారు. 1. నన్నయ భారతంలో వచనం పరిమితి– శాతం. 2. కవి భారత రచనలో ఏయే సందర్భాల్లో వచనం వాడారో, దాని ప్రాశస్త్య వివరణ. 3. కావ్యంలో నన్నయభట్టు ప్రదర్శించిన వచనశైలి వైశిష్ట్యం, విధానం.

గొబ్బూరి వారు శిష్యుల, మిత్రుల సహాయంతో నన్నయ నుంచి చేమకూర వేంకట కవి వరకు 12 మంది ప్రముఖ కవుల కావ్యాల్లోని వచన శాతాన్ని లెక్కింప చేసి పొందుపరచారు. (పేజి: 36) ఇలా సుప్రసిద్ధమైన తెలుగు కావ్యాల్లో వచన రచన **'దిన దినంబులు మన బలంబుసన్నంబులయ్యె'** అన్న విధంగా క్షీణింప సాగింది. నన్నయ భారతంలో 46% వున్న వచనం చేమకూర దగ్గరకు వచ్చేసరికి 4% కు దిగజారింది.

రావుగారు కావ్యంలో శైలి ప్రాముఖ్యాన్ని నొత్తి చెప్పారు. ఆయన ఈ ప్రకరణం చివరిపేజిలో శైలిని పరిశీలించేటప్పుడు క్రింది విషయాల్ని చర్చించాలని అన్నారు. గొబ్బూరివారు నన్నయ భారతం లోని వచనాన్ని పరిశీలించే, విశ్లేషించే విధానాన్ని ఈ విధంగా చెప్పారు. చంపూ కావ్యాల్లో ఒకే భావం మొదట పద్యమందు, పిదప కొంతభాగం వెలువడుతుంది. లేదా మొదట గద్యమందు కొంతభాగం పద్యంలో వ్యక్తం అవుతుంది. లేదా కొంతభాగం వచనంలో మిగతాభాగం తర్వాత వచ్చే గద్యంలో వెలువరించబడుతుంది. విమర్శకులు వెంకటానంద రాఘవరావు వచనాన్ని మూడు విధాలుగా విశ్లేషించవచ్చునన్నారు. వచనాన్ని విమర్శించేటప్పుడు దానికి ముందు, వెనుకల వున్న పద్య భాగాన్ని కూడా పరిశీలించడం అవసరమని గొబ్బూరి వారి అభిప్రాయం.

**'మహాభారత రచన – నన్నయ భట్టారకుడు'** అనబడే ఐదవ ప్రకరణం 'ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర' గ్రంథానికి ఆయువుపట్టు లాంటిది, తలకట్టు లాంటిది కూడా. ఈ ప్రకరణం 41 వ పేజి నుండి 136 వ పేజీ వరకు 95 పేజీల పాటు విస్తరించింది. గ్రంథకర్త తన శిష్యుల, మిత్రుల సాయంతో నన్నయ భారతంలోని పద్య గద్య పంక్తుల శాతం 45.8 అనీ చెప్పారు గొబ్బూరివారు. నన్నయ భట్టు లాగా గద్యానికింత ప్రాధాన్యమిచ్చిన తెలుగు మహాకవి మరొకరు లేరని సోదాహరణంగా నిరూపించారు. కాగా ఆయన నన్నయ గద్య ప్రాభవాన్ని ఇలా ఉగ్గడించారు.

**"పద్య లాంఛన ధారణమే కవిత్వ కళకు జీవనమను వారి యభిప్రాయముల పూర్వ పక్షము చేయుచు, రమణీయార్థ ప్రతిపాదకములైన గద్య రచనలు సహితము కవిత్వ శ్రీ విరాజితములే యని తన రచనా విధానము చేతనే యితడు సిద్ధాంతము చేసి యున్నాడు."** (పేజి: 46, 47)

గొబ్బూరి వారు నన్నయ వచనాన్ని నిస్సారములు, రసవంతములని రెండు ప్రధాన వర్గాలుగా విభజించారు. నిస్సారములు ఉపక్రమణశీలములు, సముచ్చయార్థకములు, పట్టికలు, గద్య అనే నాలుగు విభాగాలుగా వర్గీకరింపబడ్డాయి. ఉపక్రమణ శీలములు ఆశ్వాసాది, ఇతరములు అనే ఉప వర్గాలుగా వింగడింపబడ్డాయి. సముచ్చయార్థకములు కూడా సామాన్యములు, పూర్వాంశ సంగ్రహ ప్రశంస యుక్తములు అనే రెండు భాగాలుగా చేయబడ్డాయి. రసవంతములు అనే అంశం ఆరు విభాగాలుగా విభజింపబడింది– కథా వివరణములు, ప్రకృతి శాస్త్ర విషయములు, సంకీర్ణములు. పిమ్మట కథా వివరణములు రెండు వర్గాలుగాను విభజింపబడింది.

గ్రంథకర్త నన్నయభట్టు వచనంలోని పై అంశాల్ని సోదాహరణంగా విశదీకరించారు. కథాక్రమంలో రాబోయే విషయాల్ని, దాని సందర్భాల్ని సూచించే స్వభావం గల గద్యాల్ని ఉపక్రమణ శీలాలు అంటారు. ఆదిపర్వ ప్రథమాశ్వాసంలోని మొదటి శ్లోకం "శ్రీవాణి గిరిజాశ్చిరాయదధతోవక్షోముఖాంగేషుయే..." తర్వాత రాజభక్తిని సూచించే **"అని సకల భువన రక్షణ ప్రభువులై యాద్యులైన...."** అనే వచనం ప్రారంభమవుతుంది. ఇలా నన్నయ మూడవ ఆశ్వాస ప్రారంభ పద్యం తర్వాత గద్యాన్ని రచించి జరుగబోయే కథను సూచించారు. రెండు పద్యాల మధ్య వాటికి పరస్పర సంబంధం కలిగించే కురుచైన, లేదా పొడవైన వచనం రాసి ఆదికవి భారత కథకు రమణీయతను సంతరించి పెట్టారు. నూరుమంది కౌరవుల పేర్లను, సర్పరాజుల పేర్లను పద్యాల్లో పొదిగించుట కష్టం.

నన్నయ ఆ కష్ట కార్యాన్ని గద్యంలో కొంత, పిమ్మట పద్యం రాసి మరి కొంత పూరించి పాఠకులకు విసుగు కలుగకుండ కృతార్థు లైనారు. ఆశ్వాసాంత గద్యమందు కవి తన పేరు, తల్లిదండ్రుల, కులగోత్రాదులు పేర్కొంటూ, ఆశ్వాసంలోని కథా సంగ్రహాన్ని సూచించి, ఆశ్వాస సంఖ్యను చెప్పి, ఆశ్వాసాన్ని ముగిస్తారు.

నన్నపార్యునిరసవంతమైన వచనం గురించి గొబ్బూరివారు చేసిన విశ్లేషణ గంభీరమైనదీ, గమనార్హమైనదీనూ. నన్నయ్యగారివచనము **"ప్రథమ లక్షణమగు మృదుత్వమును వీడకయే యీ కూర్పులు మనోజ్ఞ పుష్టియు, గాంభీర్యమును గల్గి, యర్థ సౌలభ్యము చెడకుండ, జవము గల్గి శయ్యా గౌరవము నతిశయింపజేయుచుండును. మరియు సజీవమైన భారత పుణ్యవాహినీ విహారవిషయమున నీ కథా వివరణ రచనలు శీఘ్రం గమనోత్సాహ పూరితములై ముఖ్యాంశ ప్రదర్శనా శీలములై కదుంగడునొప్పారుచుండునే గాని, యీడ్చు కొనుచు, గొట్టుకొనుచు, విసుగు బుట్టించి, యెంతటదరిజేరుదుము దైవమా యనిపించవు."**(పేజీ : 53)


గొబ్బూరి వారు ఆదిపర్వం 199 అంకెగల గద్యాన్ని - **"అనిననుదంకుడట్లుచేయుదునని యద్దేవిని వీడ్కొని-మనిని బౌష్యుండిట్లనియె"** (పేజీ: 53) లోతుగా పరిశీలించి నన్నయ గద్య వైశిష్ట్యాన్ని ఈ విధంగా వివరించాడు. కవి ఈ గద్యంలో చాలా అసమాపక క్రియల్ని చాతుర్యంతో పేర్చి, వివిధ వాక్యాల కర్తల్ని అధ్యాహారంగా పెడ్తూ ఈ రచనకు శీఘ్రగమనాన్ని చేకూర్చి పెట్టాడు. సుకుమారమైన సులభ సంస్కృతపదాల్ని ఎక్కువగా వాడి, రచనకు జవ సత్త్వాల్ని కూర్చి పెట్టాడు. నన్నయ అవకాశమున్న చోట కూడా తెలుగు పదాల్ని, నుడికారాన్ని వాడక సంస్కృతభాష మర్యాదనే పాటించాడని గొబ్బూరి వారి అభిప్రాయం. కవి శర్మిష్ఠ, యుధిష్ఠిరుని జన్మ మొదలైనవి కథా వివరణా కౌశలానికి చక్కని ఉదాహరణలని వెంకటానంద రాఘవగారి అభిమతం. ప్రశ్నోత్తరాల రూపంలో వర్ణింపబడిన కథావచనాలు నన్నయ రచనా చాతుర్యానికి తార్కాణాలు.

నన్నయ ఇరువురి మధ్య సాగిన సంభాషణను చిన్నచిన్న వాక్యాలతో సంపూర్ణమైన రీతిలో రచించి తమ విదగ్ధతను ప్రదర్శించాడు. ఇంకా వాద ప్రతివాదాల, ధర్మోపదేశాదుల ప్రసంగాల నిర్వహణలోనూ కవి ప్రతిభను సోదాహరణంగా వివరించారు విమర్శకులు.

నన్నయభట్టు మూలభారతంలోని సంస్కృత సమాస భూయిష్ఠమైన, దీర్ఘములైన వర్ణనల్ని యథాతథంగానే అనువదించి వున్నారు. నన్నయ గారి వచనంలో శబ్దాలంకారాల ప్రాబల్యం కూడా కనిపిస్తుంది.

నన్నయ కథను వివరించే సందర్భంలో చిన్నచిన్న వాక్యాలని వాడారు. వర్ణనల సందర్భంలో చాలా పొడవైన వాక్యాల్నీ, శబ్దాలంకారాల్ని ప్రయోగించారు. గొబ్బూరి వారు నన్నయ అవలంబించిన వర్ణన పద్ధతిని ఈవిధంగా విశ్లేషించారు. **"... వర్ణితాంశమునగాననగు వివిధ వస్తుతతినితత్తద్గుణవిశేషముల వివరించి, బహువిధ శబ్దాలంకార భూషితములైన సమాసములతో"** (71) నింపి తమ ప్రతిభను ప్రదర్శించారు.

నన్నయ మనస్సులోని వేదనా సందర్భాల్ని వర్ణించేటప్పుడు అసమాసక క్రియల్ని ఉపయోగించి, పొడవైన వాక్యాన్ని రచించి భావ గాంభీర్యాన్ని వ్యక్తీకరించిన విధానాన్ని ఇలా సూచించారు- **"అనిన విని వెలువెల్లనై, వెచ్చనూర్చి, నిశ్చేష్టితమై కెందమ్మి రేకుల వలనందొరంగు జలకణంబులపోలె కోపారుణి తనయనంబుల బాష్పకణంబులు దొరగందలవంచి యా రాజుం గటాక్షించుచు, హృదయ సంతాపంబు తనకు దాన యుపశమించుకొని, పెద్దయుం బ్రొద్దు చింతించి, శకుంతల యారాజునకిట్లనియె."** (పేజీ :79) దుష్యంతునిచే గుర్తింపబడక, తిరస్కృత ఐన శకుంతల దుఃఖం వర్ణించడంలో




నన్నయ ప్రతిభను ఇక్కడ పాఠకులు దర్శింపవచ్చును. శకుంతల ముఖంలో దుఃఖదశలోనినానాభంగిమల్ని కవి కనపరిచిన వైనం ప్రశంసనీయం.

గ్రంథకర్త నన్నయ వచనంలో ప్రయోగించిన అర్థాలంకారాలు వ్యాస భారతం ప్రయోగాలకు మెరుగులు దిద్దాయని వాగనుశాసనుని ప్రతిభను కొనియాడారు. కుమార అస్త్రవిద్యా సందర్శన కథా సందర్భంలో (ఆది-6-8) ద్రోణ, అశ్వత్థామలు ఇలా వర్ణింపబడ్డారు. **"అట్టి యవసరంబున నాచార్యుండు శుక్లాంబరాభరణ శోభితుండు రంగ మధ్యంబుననశ్వత్థామసహితుండై విముక్త జలధర వియన్మధ్యంబున నంగారసహితుండైన యాదిత్యుండునుం బోలె"** (పే- 105)

వ్యాస భారతంలో ద్రోణుడు చంద్రునితో పోల్చబడ్డాడు. కాని నన్నయ ఇక్కడ అతన్ని సూర్యునితో పోల్చాడు కుమారుడైన అశ్వత్థామను అంగారకునితో పోల్చితే, ఆచార్య ద్రోణుని చంద్రునితో ఉపమించడమా? నన్నయగారి ఈ విశేష సామర్థ్యాన్ని గొబ్బూరు వారిలా శ్లాఘించారు- **"....ఆంధ్ర మహాభారత గ్రంథరత్నము రచించిన నన్నపార్యుడు కేవల బానిస భాషాంతరపరివర్తకుడు గాడనియు, సంస్కృత భారతంబను మేలిమి బంగరు గైకొని**

**దాని నాంధ్ర భారతమును దివ్య స్వర్ణ కమలము రచించిన నపార కళా కుశలుడగు కవి సింహుడనియు నిరూపింపదగి యున్నది."** (పేజి: 106)


మొత్తం మీద గొబ్బూరు వేంకటానంద రాఘవరావుగారు నన్నయ భారతంలోని గద్యను లోతుగా అధ్యయనం చేసి, చర్చించిన విద్వాంసుల్లో అగ్రగణ్యులని చెప్పొచ్చు. వీరు ఈ దిశలో తర్వాతి విమర్శకులకు మార్గ దర్శకులైనారన్న ఖ్యాతి పొందిన ఘనులు కూడానూ.

గొబ్బూరు వారు **'ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర'** (1923, 2002) కు పూరకంగా **'ఆంధ్ర వచన రచనా పరిణామము'** రచించారు. ఈ గ్రంథాన్ని వారి మరణానంతరం అద్దేపల్లి అండ్ కో, రాజమహేంద్ర వరం అధిపతులు 1961 అక్టోబర్ లో ప్రచురించారు. ఈ పుస్తకం తెలుగు భాషా సమితి, మద్రాసు వారి బహుమతి కూడా పొందింది.

గొబ్బూరు వారు 243 పేజీలు కల 'ఆంధ్రవచన రచనా పరిణామము' లో నన్నయ వచన రచనా వైశిష్ట్యంతో పాటు నన్నెచోడుడు, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, పోతన మొదలైన పద్యకవుల గద్యాన్నీ, దక్షిణాంధ్ర యుగకవుల వచన రచననూ, చిన్నయసూరి, వీరేశలింగం పంతులు, గార్ల గద్య రచనలు, దేశ చరిత్రలు, స్వీయ చరిత్రలు, నవలలు, శాస్త్ర గ్రంథాల్లోని గద్య రీతుల్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. ఉన్నత పాఠశాల విజ్ఞాన శాస్త్ర అధ్యాపకులుగా, న్యాయవాదిగా పనిచేసిన గొబ్బూరు వేంకటానంద రాఘవ రావుగారు తెలుగు గద్య ఉద్భవ వికాసాల్ని గంభీర అధ్యయనం చేసిన ఆద్యులు. ('ఆంధ్ర వచన రచనా పరిణామము' (1961) లోని అంశాల్ని పరిచయం చేసిన డా॥ బాణాల భుజంగరెడ్డి గారికి కృతజ్ఞతా పూర్వక వందనాలు)

---

## సత్సంగం



### ధ్యానము - విచారణ

ధ్యానానికీ విచారణకీ తేడా ఏమిటి? రెండూ ఒకటే. విచారణ చేసే యోగ్యత లేనివారు ధ్యానం చేసుకోవాలి. తనను తాను మరచి "నేను బ్రహ్మాన్ని" అనో "నేను ఈశ్వరుడు"ననో ధ్యానిస్తాడు సాధకుడు. ఈ పద్ధతి ద్వారా బ్రహ్మాన్నో ఈశ్వరుడినో విడవకుండా పట్టుకుంటాడు. చివరికిది బ్రహ్మము లేక ఈశ్వరుని ఎరుకగా మిగులుతుంది. అదే శుద్ధ స్థితి అనీ ఆత్మ అనీ గ్రహింపు కలుగుతుంది. విచారమార్గం అవలంబించేవాడు, "నేనెవరిని" అని ప్రశ్నించుకుంటూ తనని తాను విడువడు. దీనివల్ల వానికి ఆత్మఅంటే ఏమిటో విశదమవుతుంది. సచ్చిదానందంగా భాసిల్లే పరమాత్మ నేను – అని మనస్సులో ఊహించుకోవడమే ధ్యానం. మనస్సుని ఆత్మపై లగ్నం చేసి తద్వారా భ్రమని నాశనం చేసుకోవడం విచారణ.

ఆత్మ గురించి ఏ భావంతో ధ్యానం చేసినా, ఆ రూపాన్నే అందుకుంటారు. ఏ విధమైన భావమూ లేకుండా, నిశ్చలంగా ఉండేవాళ్ళు పరమోత్కృష్టమైన, నిష్కళంకమైన కైవల్యాన్ని, రూపం లేని ఆత్మని అందుకుంటారు.

ప్రారంభ దశలో ధ్యానం తేలికగా ఉంటుంది. నచ్చుతుంది కూడా. ఆ అభ్యాసమే ఆత్మవిచారానికి దారి తీస్తుంది. అక్కడ సత్యాసత్యాల విచక్షణ జరుగుతుంది. ఒకదానికి ఒకటి వైరుధ్యం కల అంశాలతో నీవు నిండి ఉన్నప్పుడు సత్యాన్ని పట్టుకొని ఉండటం వల్ల ప్రయోజనమేమిటి? "ఆత్మ ఇంకా సాక్షాత్కారం కాలేదం"టూ నీకు స్ఫురింపజేసే అవరోధాలని ఆత్మవిచారం తొలగిస్తుంది. ఆ విధంగా, నేరుగానే నీకు సాక్షాత్కారం కలుగజేస్తుంది.

సాధకుని పురోగతిని బట్టి ధ్యానం మారుతూ ఉంటుంది. యోగ్యతే ఉంటే, యోచించే వాడెవడో అని అన్వేషించడమే నయం. అప్పుడా యోచించేవాడు తన మూలంలో శుద్ధ చైతన్యంలో నిమగ్నమవుతాడు. ఆ యోచించే వాడిని విడవకుండా పట్టుకోలేకపోతే భగవంతుడిని విడవకుండా పట్టుకోవాలి. కొంతకాలానికి ఆ మనిషి స్వచ్ఛమై యోచించేవాడిని పట్టుకోగలుగుతాడు. తన మూలంలో విలీనమైపోతాడు. అహంకారాన్ని నిలుపుకుంటేనే గాని ధ్యానం సాధ్యం కాదు. ధ్యానించే అహంకారమూ, ధ్యానింపబడే విషయమూ రెండూ ఉన్నాయి. కాని ఆత్మ ఒక్కటే కాబట్టి, ఇది పరోక్ష పద్ధతి.


అహంకారం యొక్క మూలాన్ని అన్వేషిస్తే, అహంకారమే మయమవుతుంది. మిగిలేదల్లా ఆత్మే. ఈ పద్ధతి సూటి అయినది.

ఆత్మలో సంస్థితమై, సహజస్థితి నుండి ఏ విధమైన చలనమూ లేకుండా, తాను ధ్యానం చేస్తున్నానన్న భావం కూడా లేకుండా ఉండటమే ధ్యానం.

# యోగసక్తా పరిణయం - పరిశీలన

**నారాయణదాసు మంజులచారి** నాగర్ కర్నూలు.

ఫోన్ : 62815 70335



సాహిత్యం నవనవోన్మేష శోభితం. విభిన్న ప్రక్రియల సమాహార సుమగుచ్ఛం. అందులోని అద్భుతమైన కాంతాసమ్మిత కావ్యరత్నమే **"యోగసక్తా పరిణయం"** ఈ బృహత్ గ్రంథమే **"విశ్వకర్మ పురాణం"**గా కూడా వెలుగొందుతుంది.

**"యోగసక్తా పరిణయం"** కావ్యాన్ని శ్రీ మద్దిపట్ల అప్పన్నశాస్త్రి మరియు శ్రీ కొట్ర వేంకట రామకవి అను జంట కవులు రచించారు. మద్దిపట్ల అప్పన్నశాస్త్రి మహాదేవ వరప్రసాద లబ్ధుడు, కవితామాధురీ దురంధరుడు. ఈయన తండ్రి నృసింహశాస్త్రి.

కొట్ర వేంకటరామశాస్త్రి శ్రీ వేంకటేశ్వర వరప్రసాద లబ్ధుడు, సంస్కృతాంధ్ర కవితా దురంధరుడు. వేంకటశాస్త్రి పుత్రుడు. ఈ జంటకవుల ఇద్దరికీ గల సంబంధము గానీ వీరికాలము గానీ స్పష్టంగా తెలియదు. యోగసక్తా పరిణయ కావ్యాన్ని జంటకవులు ఇరువురు మహాప్రబంధమని పేర్కొన్నారు.

యోగసక్తా పరిణయం 10 ఆశ్వాసాల కావ్యం. మొదటి 5 ఆశ్వాసాలు మరియు 10 ఆశ్వాసాన్ని శ్రీ అప్పన్నశాస్త్రిగారు రచించగా 6 నుంచి 9వ ఆశ్వాసం వరకు గల 4 ఆశ్వాసాలు వేంకటరామకవి రచించినట్లుగా ఆశ్వాసాంత గద్యల వల్ల తెలుస్తుంది. శివాంకితం చేయబడింది.

ప్రథమాశ్వాసం ఇష్టదేవతా ప్రార్థనతో ప్రారంభమవుతుంది.

**దేవతా స్తుతి-**

**శా॥ "శ్రీరాజీవభవామర ప్రముఖ సచ్ఛేయోవహ ప్రస్ఫుర**
**ద్దీరాంచర్ఘర రత్న సంఘటిత కోటీక ప్రభా భాసితాం...."**

అంగీరసుని కూతురు బృహస్పతి సోదరి అయిన యోగసక్త తన చెలికత్తెలతో గంగానదీతీరంలో తపస్సు చేస్తున్న ప్రభావసుని దగ్గరకు వెళ్ళి అతన్ని మోహించి అతని వివరాలు తెలుసుకు రమ్మని చెలికత్తెలను పంపుతుంది. ప్రభావసుడు తాను విశ్వకర్మ పుత్రుడైన శిల్పి ప్రజాపతి కుమారుడనని, తపస్సు చేసుకొనుచున్నానని స్త్రీలు తపస్సు చేయువారి వద్దకు రాకూడదని వారిని వెళ్ళిపొమ్మని కోరుతాడు. చెలులు అతని విషయం యోగసక్తకి చెబుతారు. అతనినే తాను వివాహమాడుతానని లేనిచో తనువు చాలిస్తానని తల్లితో తెలుపుతుంది.

**"తల్లి నా యుల్లంబున, మల్లడిగినను నొక్క తెలుగు మాటిడనేలా"**

దీనిని బట్టి ఆనాటి కాలంలో స్త్రీలు తమ జీవిత భాగస్వామిని ఎంచుకోవడంలో స్వేచ్ఛను, భావప్రకటనను కల్గి ఉన్నారని తెలుస్తుంది. యోగసక్త తండ్రి అయిన అంగిరసుడు ఈ విషయాన్ని భృగుమహర్షితో చెప్పగా అతడు తేజోపతిపురము వెళ్ళి అక్కడ ప్రభావసుని తల్లి **పులోమ**తో జరిగిన విషయం చెబుతాడు. అనంతరం స్వయంభువు అనే మనువు తనంతట తానే కర్దమునికి తన కూతురు అయిన "దేవసూతిని" ఇచ్చిన వృత్తాంతాన్ని వివరిస్తాడు. ఇందులో మూల కథాగమనం సాగుచుండగా ఇలా మధ్యమధ్యలో అనేక కథలు తారసపడుతుంటాయి. కావున ఇందులో పురాణలక్షణం కన్పిస్తుంది.

ద్వితీయాశ్వాసంలో దేవసూతి - కర్దముల వివాహం, కపిల అవతారం వర్ణించబడింది. ఈ కథ శ్రీమద్భాగవతంలో కూడా ఉన్నది.

**"అవధరింపు మక్కథకుండు శౌనకాదులకు భృగు వృత్తాంతం బిట్లని చెప్పదొడగె"**

తృతీయాశ్వాసంలో భృగువు ప్రభావసుని వద్దకు వెళ్ళి, విచారించగా అతను వివాహానికి విముఖుడుగా ఉండగా గృహస్థ ధర్మంలోని విశేషాలను బోధించి "ఉద్ధాలకుని కథను" చెప్తాడు. అనంతరం ప్రభావసుని తండ్రి శిల్పి ప్రజాపతి భృగు మహత్యాన్ని కుమారునికి వివరిస్తాడు. ఈ కథ కూడా మహాభారతంలోని ఆది పర్వములో ఉంది. అప్పన్నశాస్త్రి ఈ కథను రచించుటలో భావముతోనే కాక పదప్రయోగంలో కూడా నన్నయ భట్టారకుని అనుసరించినట్లు అనిపిస్తుంది. ఇలా అనంతరం అందరూ వివాహానికి అంగీకరిస్తాడు. చతుర్థాశ్వాసంలో భృగువు యోగసక్తకు పార్వతీకళ్యాణం వివరిస్తారు. ఈ వివరణలో పార్వతి దేవి తపస్సు చేయు సందర్భంలో -

**వసంత ఋతువు-**

**"అంత వసంతమయ్యె గమలాంతర సాంద్ర మరందపాన......**

**గ్రీష్మ ఋతువు-**

**"సతులు పతులొక్క సెజ్జను శయనలీల**
**నలరి రతులకు దొర్కొన నలవిగాకవే**
**ఘర్మ జలముల మేనెల్ల గడలు కొనగ**
**భీష్మయై యొప్పె నప్పుడు గ్రీష్మ ఋతువు"**

**వర్ష ఋతువు-**

**"వర్ష సమయము విరహ సామర్ష మగును".**

**హేమంత ఋతువు–**

**"సీమంతినీ కుచోపరి**
**సేమంతీ దామగంధ సేవన నిరతో**
**ద్దామాధిక సుస్వాంతము**
**హేమంతము వచ్చె పథిక హృత్పులకంబై"**

వసంత, గ్రీష్మ, వర్ష, హేమంత ఋతువుల వర్ణన కలదు. అనంతరం శిల్పి ప్రజాపతి ముహూర్తం నిర్ణయిస్తారు. వైశాఖ శుద్ధ దశమి శుక్రవారము మఖా నక్షత్ర ధనుర్లగ్నమున యోగసక్తా ప్రభావసుల వివాహం జరుగునని శిల్పి ప్రజాపతి తెలియజేస్తారు.

ఈ సందర్భంలో.......

**పంచ బ్రహ్మల వర్ణన....**

**"సౌనగ మునితో ముందర**
**మానితులగు త్వష్ట శిల్పి మయ విశ్వజ్ఞత**
**జానుగ మదగజ హయరథ**
**యానంహుల నెక్కి వెడలి రానందమునన్"**

సౌనగాధుల విపుల వర్ణన ఉంది. పంచమాశ్వాసంలో పెండ్లివారు విడిది చేసిన ప్రదేశాల వర్ణనలు ఉన్నాయి. ఈ సందర్భంలో హరిబాహుదు అనే భావబోధునికి **విశ్వకర్మ కపికేతనం** లభించిన విధానం తెల్పబడింది. ఈ వృత్తాంతం అంతకు ముందు మునులకు కుమారస్వామికి వివరించారు. ఈ కథలోనే అహల్య ఇందార్కుల వల్ల వాలి సుగ్రీవులు జన్మించుట గౌతముడు అహల్యను శిలను కమ్మని శపించుట, అహల్య అంజనను అంధురాలు అగునని శపించుట. అంజనకు శివపార్వతుల అనుగ్రహంతో ఆంజనేయుడు ఉద్భవించుట. విశ్వకర్మ అతనికి కటిసూత్ర కౌపీన బ్రహ్మసూత్ర హిరణ్యకుండలం ఇచ్చి తన ధ్వజాగ్రంలో ఉండమని కోరుట. మొ॥ విషయాలు చెప్పబడ్డాయి. తర్వాత భావబోధునికి హరిబాహుదు, సుందోపసుందోపాఖ్యానం తెల్పును. ఈ కథ విశ్వకర్మ వృత్తాంతాన్ని తెలియజేస్తుంది.

షష్ఠాశ్వాసంలో భృగువు సౌనగాదుల జన్మవృత్తాంతం పత్నీ పుత్రాదుల గుణవిశేషాలను వివరిస్తాడు. విశ్వకర్మ ఉపనయనం, వివాహాది విధులను, మునులకు తెల్పుతాడు.

సప్తమాశ్వాసంలో తారకాసుర వృత్తాంతం, త్రిమూర్తులకు విశ్వకర్మ ప్రత్యక్షమవ్వటం, విశ్వకర్మ బ్రహ్మాదులకు శస్త్రాలు చేసి ఇవ్వటం, తారకాసురుల యుద్ధం మొ॥ ఘట్టాలు చెప్పబడ్డాయి.

అష్టమాశ్వాసంలో భృగువు జాబాలికి విశ్వరూపుని వృత్తాంతం చెప్పటం, వృత్తాసుర జన్మవృత్తాంతం, అగస్త్యుడు కశ్యపునికి హిమవంతుని వృత్తాంతం చెప్పటం.

నవమాశ్వాసంలో దుర్వాసుడు జాబాలికి దివ్యలింగ మహిమను తెలుపుట, విశ్వకర్మ శివలింగాన్ని సృష్టించడం, చ్యవనుడు ఇంద్రునికి అశ్వినుల వృత్తాంతం వివరించడం. సౌనగముని పెండ్లివారికి విమానాలు నిర్మించి ఇచ్చు ఘట్టాలున్నాయి. ఇలా ఆనాటి కాలంలోనే యాంత్రికమైన నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయని విశ్వకర్మలు వినూత్న ప్రయోగాలకు ఆరంభకులని చెప్పవచ్చు.

చివరగా దశమాశ్వాసంలో అంగిరసుడు త్రిమూర్తులను వివాహానికి ఆహ్వానించడం, నారాయణుడు లక్ష్మీదేవికి విశ్వకర్మ ప్రభావం తెల్పుట. శివుడు పార్వతిదేవికి సౌనగ భువనాసుల బంధుత్వం తెల్పుట.

**"ఆఖువాహు బూజించి పుణ్యాహ వాచ**
**నంబు గావించి మణికంకణముల గట్టి**
**కాంచనోపవీతంబు చొక్కముగ నుంచి**
**పెండ్లి కూతురు దేవ ముపించినంత"**

సౌనగుడు స్వర్గంలో పెండ్లికి ఏర్పాటు చేయుట సాయంకాలం మంగళస్నానం, ఎదురుకోళ్ళు, యోగసక్తా, ప్రభావసుల కళ్యాదోరి మంగళాష్టకం, సవస్యం, విందు, నాకపలి, దంపతితాంబూలం, అప్పగింతలు, భృగువు యోగసక్తకు నీతులు చెప్పుట అంగీరసుడు పెండ్లివారిని సాగనంపుట తదితర సందర్భాలతో వివిధ రకాలైన వర్ణనలున్నాయి.

**యోగసక్తా – ప్రభావసుల కళ్యాణ ఘట్టం–**

సౌనగుడు స్వర్గంలో వీరి పెండ్లికి ఏర్పాట్లు చేసిన తర్వాత, మంగళ వాయిద్యాలు వినిపిస్తుండగా యోగసక్తా, ప్రభావసుల మంగళ స్నానాలు చేయించారు. యోగసక్తను ముందుగా ఇంటిలో గౌరీపూజకు నియమించారు. పెండ్లిపందిరిపై పురోహితులు ప్రభావసునితో ఆచమనం చేయించి, రక్షాబంధనం కట్టారు. వివాహార్థం అతనికి యజ్ఞోపవీత ధారణం చేస్తారు. ఆంగీరసునితో, ప్రభావసునితో గోత్ర నామాలను ఉచ్చరింప చేస్తారు. తర్వాత ఆంగీరసుడు యోగసక్తను వేదికపైకి తీసుకువచ్చి తూర్పుముఖంగా కూర్చోబెడతారు. అపుడు వధూవరుల మధ్యలో తెరను అడ్డుగా పట్టారు. కన్యాదాత అయిన ఆంగీరసుడు ప్రభావసునికి కాళ్ళు కడిగి, మధుపర్కం ఇచ్చాడు. కన్యాదాతచే మహాసంకల్పం చదివించి, వరునితో 'నాతిచరామి' అని ప్రతిజ్ఞలు చేయించి పురోహితులు చూర్ణికలు, మంగళాష్టకాలతో వధూవరులపై జిలకర్ర బెల్లం పెట్టించి ఆశీర్వదించారు.

ఆశీర్వచన అనంతరం పురోహితులు తెరను తొలగించగా దంపతులు ఒకరినొకరు చూచుకొంటారు. తర్వాత ప్రభావసుడు యోగసక్త భ్రూమధ్యంలో దర్భకర్రతో తుడిచివేస్తాడు. కన్యకు మానసిక అరిష్ఠాలు తొలగించుటకు ఇది ఒక ఆచారంగా వారు పాటించినారని, ఇందులో తెల్పడం జరిగింది. తర్వాత అతడు మాంగల్యాన్ని కట్టి ఆమె నడుముకు ఒక దర్భను ప్రదక్షిణంగా చుట్టి, తలంబ్రాలు పోశారు. తర్వాత వీరు ప్రక్కప్రక్కన కూర్చొని ప్రధానహోమం చేస్తారు. పురోహితులు వారికి బ్రహ్మముడి వేశాడు. అతడు ఆమె చేతిని పట్టుకొని ఏడు అడుగులు నడుస్తాడు. దీన్నే పాణిగ్రహణం, సప్తపది అని పిలుస్తారు.

వరుని ఆయురారోగ్యముల పెంపుకోసం, అరిష్ట నివారణ కోసం, ఇద్దరు లాజహోమం చేస్తారు. తర్వాత విందు, నాకబలి, దంపతి

తాంబూలాలను ఇచ్చారు. సాయంకాలం అప్పగింతలు నిర్వహించారు. భృగువు యోగసక్తకు అత్తమామలపై భక్తితో మెలగమని, వారిని తల్లిదండ్రులుగా భావించమని, వారు చెప్పిన పనులను అశ్రద్ధ చేయకుండా వెంటనే చేయాలని, భర్తతో, తోబుట్టువులతో పలు మాట్లాడక, అతిగా ప్రవర్తించక, భర్తను దైవంతో సమానంగా చూచుకోవాలని

**"నన్య గృహముల వెంబడి నరుగబోక**
**పురుషులతో మాటలాడబోక**
**నెవరితోనైనను గలహించబోక**
**నుచిత గతి నుండవలయు నీలోత్పలాక్షి"**

**"అతిధుల కన్నము బెట్టుచు**
**సతతంబును దేవభూజ సల్పుచు నిత్యో**
**న్నతిగాంచి భాగ్యవంతుల**
**నుతులంగని చేయు మెల్లశుభములు తన్వీ"** అని

నీతి వాక్యాలు చెప్పాడు. అనంతరం ఆంగీరసుడు యోగసక్తను కౌగిలించుకొని "నీ అత్తమామలపై భయం, భక్తి కలిగి సుఖముగా ఉండమని కోరి ఆమెను శిల్పి ప్రజాపతికి అప్పగిస్తాడు. సానగాడులు ఏరాటు చేసిన విమానాలపై వధూవరులు, శిల్ప ప్రజాపతి మొదలైన వారు ప్రయాణమైయ్యారు. తర్వాత ఆంగీరసుడు పెండ్లి వారిని సాగనంపాడు.

అనంతరం యోగసక్త, ప్రభావసులు తేజోవతీ పురం చేరుకోగానే పురప్రజలు, అంతఃపుర కాంతలు మేళతాళాలతో స్వాగతం పలుకగా సువర్ణమయమైన తమ భవనంతో ప్రవేశించి పెద్దలను సత్కరించారు.

కాళిదాసుని ఉపమ వలె, భాగవతంలోని దశమస్కంధం వలె, యోగసక్తా పరిణయంలోని దశమస్కంధం బహువర్ణనల భూషితమై మూలకథకు మూలస్తంభంవలే ముఖ్యమైన విషయాలను వెల్లడిస్తుంది. వివాహ ధర్మం, ప్రాముఖ్యత ఆచార వ్యవహారాలు, లాంఛనాలు, నీతులు, గౌరవమర్యాదలు, ఇవన్నీ తెలుస్తాయి. ముఖ్యంగా 'స్వర్గంలో పెళ్ళి' ఆనాటి ఈ విషయం ఈ కాలంలో కూడా స్వర్గ సమాన మండపాల్లో, అంతరిక్షంలో, సముద్రగర్భంలో, వివాహమాడిన సంఘటనలు పత్రికల్లో చూస్తుంటాం.

ఈ కవులు దీనిని "మహాప్రబంధం" అన్నారు. వ్యక్తుల యొక్క గొప్పతనం అనేక విధాలు. కొందరు గుణంలో గొప్ప, కొందరు విద్యలో గొప్ప, మరికొందరు సదాచారములో గొప్ప, కొందరు వంశంలో, కొందరు మాటల్లో గొప్ప. ఈ కావ్య ప్రబంధముల విషయంలో కూడా అంతే. మనుచరిత్ర కవిత్వంలో గొప్ప వసుచరిత్ర శ్లేషలో గొప్ప. కళాపూర్ణోదయం కల్పనలలో గొప్ప, ఆముక్తమాల్యద ప్రౌఢిలో గొప్ప అలాగే ఇది విశ్వకర్మ చరిత్రలో గొప్ప అనవచ్చు.

ఇది కళ్యాణకథ నేటివారు ప్రాచీన కావ్య నాయకులందరూ ఒకే మూసలో పోసిన బొమ్మలని అంటారు. కానీ ఇది సరికాదు. సావిత్రిలో కాబోయే పతి అర్ధాయుష్కుడని తెలిపికూడా అతన్ని వరించి పిమ్మట యమున్ని మెప్పించి పూర్ణాయుష్కుని చేసుకొనెను. దమయంతి తనకొరకు దేవతలు దిగివచ్చినా కాదని నలున్నే వివాహమాడెను. రుక్మిణీదేవి వలచిన వానికి వచ్చి తీసుకొని పోవలెనని సందేశాన్ని పంపును. దీనిని బట్టి పూర్వము కన్యలకు వివాహ విషయాలలో ఎలాంటి స్వాతంత్ర్యం కలదో తెలియుచున్నది. మనసులు కలిసి ఒకటైన దంపతుల చేత గృహకళ్యాణం సమాజకళ్యాణం దేశకళ్యాణం జరుగును. అందుచేత మన వాఙ్మయములో కళ్యాణ కావ్యములు ఎక్కువగా వచ్చినవి.

విశ్వకర్మ సాహిత్యం పలువురు కవులు సూచించినప్పటికీ శ్రీనాథుడు ఒక "విశ్వకర్మ పురాణం" రచించినట్లు వేపూరి వెంకటాచారి కృతమైన విశ్వకర్మపురాణంలో చెప్పబడింది. 17వ శతాబ్దంలో తురగ రామకవి అవ్వండి బాలసరస్వతి అను జంటకవులు విశ్వకర్మ మహత్యము తెలుపు స్కాంద పురాణమందలి ప్రథమ ఖండమైన "నాగర ఖండము" అనువదించి పెందోటను పాలించు ధవలేశ్వరపు మార్కండేయ ప్రభువునకు అంకితమిచ్చారు. అలాగే **విశ్వకర్మాన్వయ ప్రదీపిక** అను గ్రంథమును గొన్నాభక్తుల వరాహ నరసింహాచార్యులు రచించారు. ప్రాచ్యలిఖిత గ్రంథాలయానికి డా॥ కొండూరి వీర రాఘవాచార్యులుగారు విరాళంగా ఇవ్వగా దీనిపై వ్యాసం 1972లో ఫిబ్రవరి భారతీ పత్రికలో వచ్చింది. సంచాలకులు క్రీ.శ. 1983 సం॥లో కపిలవాయిగారు యోగసక్త పరిణయ కావ్యాన్ని డా॥ వి.వి.ఎల్.నర్సింహారావుగారి ప్రధాన సంపాదకత్వంలో పరిష్కరించారు.

యోగసక్తా పరిణయ కావ్యంలో చంధస్సు విషయానికి వస్తే, మార్గదేశిలాగా వైదిక, దేశీయ ఆచారాలు కలిశాయి. వర్ణనలు, రసపోషణ అద్భుతం. నాయికా వర్ణన, కన్యాదానం స్థాలిపాకం, సదస్యాదులు, తలంబ్రాలలో – శృంగారరసం, "ముత్తైదువ పాత్రలు", "దీక్షలో – పారత్వం" అప్పగింతల్లో – కరుణరసం, మహాసంకల్పంలో – అద్భుతం, వియ్యపు రాండ్రును చేసుకోవడంలో – హాస్యం, దేగాటలో – భయానకం, నాగవల్లిలో – రౌద్రం సందడి ముగిసిన తర్వాత శాంతం మొ॥ రసములు సందర్భోచితంగా ఈ జంటకవులు అద్భుతంగా పోషించారు.

యోగసక్తాపరిణయకావ్య నామౌచిత్యాన్ని పరిశీలించినట్లయితే ప్రాచీన కావ్యనామముల ప్రకారం ఇందుమతీ స్వయంవరం, పార్వతీ పరిణయం, ఉషాపరిణయం ఇలా నాయిక నామానికే మొదటి స్థానమిచ్చారు. ఈ విధంగా జంటకవులైన మద్దిభట్ల అప్పన్నశాస్త్రి, కొత్ర వెంకటరామకవులు మునుమార్గ కవులైన నన్నయాదులను అనుసరిస్తూ, పురాణ, ప్రబంధ రీతుల్లో "విశ్వకర్మ పురాణం"గా యోగసక్తా పరిణయ కావ్యాన్ని మలిచినారు. తద్వారా సాహిత్య చరిత్రలో విశ్వకర్మల సాహిత్యం మరియు ఆచారవ్యవహారాలు తెలుస్తాయి. ముఖ్యంగా 16రోజుల పెళ్ళి 1, 2రోజులకు ఆధునీకరణ ఆర్భాటంలోనో, ఒత్తిళ్ల మధ్యనో కుదింపబడింది. కాబట్టి బంధాలను బలోపేతం చేయుటకు సమాజానికి ఆవశ్యకాలు ఈ పరిణయ కావ్యాలు.

## సాధన పంచకమ్

**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాऽऽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాऽऽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**


తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వగంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.

**వివరణ**

**3. శాన్త్యాదిః పరిచీయతామ్ –**

శాంతి మొదలైన సద్గుణాలను సాధకుడు తెలిసికొని తన జీవితంలో అనుష్ఠించాలి. సాధకునికి (శిష్యునికి) ముందుగా ఉండవలసింది సాధన చతుష్టయ సంపద అని చెప్పబడింది. 1. వివేకం 2. వైరాగ్యం 3. షట్క సంపత్తి 4. ముముక్షత్వం.

ఇందులో 1. శమము 2. దమము 3. ఉపరమము 4. తితిక్ష 5. శ్రద్ధ 6. సమాధానము అనే ఈ ఆరు లక్షణాలు షట్కసంపత్తిగా పేర్కొనబడినవి. శమము అంటే మనస్సును నిగ్రహించుట. దమము అంటే ఇంద్రియాలను నిగ్రహించుట. ఉపరతి అంటే స్వధర్మమును అనుష్ఠించుట. తితిక్ష అనగా శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వములను సహించుట. శ్రద్ధ అనగా శాస్త్రములయందు, గురువాక్యముల యందు విశ్వాసమును కలిగి యుండుట. సమాధానము అనగా చిత్తమునందు ఏకాగ్రతను కలిగి ఉండుట. వీటినే శాంత్యాది గుణములుగా చెప్పబడినవి. దృఢమైన భగవత్ భక్తి కలగాలంటే ఈ సుగుణాలన్నీ మనలో వృద్ధి చెంది తీరాలి.



## మాండుక్యోపనిషత్తు

ఇట్లు యోగోపాసకుడు – ధ్యా
నమ్ములో బ్రహ్మమ్ము నెఱుగుచు
కోర్కెలే నెరవేరగా తను
ప్రథముడై గౌరవము పొందును 33

మూడు మాత్రల 'ఓం'కారము
మధ్యనున్నది 'ఉ'కారమ్మగు
నద్దియే ఉత్కృష్టమైనది
మరియ స్వప్నస్థానమైనది 34

స్వప్నస్థానము నందు బ్రహ్మము
తైజసుడిగా వెలుగుచుండెడి
తీరెరింగీ ఉపాసించెడి
వాడు శ్రేష్ఠుడు; జ్ఞానవంతుడు 35

ఆత్మసామ్యము తోడ నాతడు
అందరికినీ మిత్రుడయ్యెడు;
ఎల్ల ప్రాణుల యందు నాతడు
సమముగా వర్తించుచుండును 36

ఇట్టి శ్రేష్ఠుని వంశమందున
జ్ఞానులే ప్రభవించుచుందురు
వేదవేత్తలు కాని వారలు
అతని వంశము పుట్ట నేరరు 37

ప్రణవమందు 'మ' కారమేమో
పదము అంతము దెలుపు చుండగ
ప్రళయమున ప్రజ్ఞాన ఘనుడు – సు
షుప్తి స్థానము చేరియుండును 38

అట్టి ప్రాజ్ఞుని యందునే – ఈ
సృష్టి అంతా లయము జెందును
జీవులును మరి ప్రకృతి అంతా
సూక్ష్మమై పరమాత్మ జేరును 39

ప్రణవమందలి మూడు మాత్రలు
ఆత్మయందలి మూడు పాదము
లనుచు నెఱిగిన వాడు ముక్తుడు
విశ్వమున శ్రేష్ఠాతిశ్రేష్ఠుడు.. 40

**జక్కని వెంకటరాజం**
సిరిసిల్ల, ఫోన్ : 9440021734

# అంతర్జాలంలో లఘు కవితా రూపాలు - పరిశీలన

**గొల్లపెల్లి గణేశ్,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9440 227 064

కాలానుగుణంగా కవిత్వం తన స్వరూపాన్ని మార్చుకొంటున్నది. నన్నయాదుల నాడు ఉన్న పద్య కవిత్వం తర్వాత యుగంలో వచనకవిత్వంగా మారిపోయింది. తదనంతరం గ్రాంథిక రచనను కాదని, వాడుకభాషలో కవిత్వాన్ని రాయడానికి ఉద్యమాలు జరిగాయి. ఆ తరువాత మాండలిక రచన ప్రాచుర్యం పొందింది. ఇలా ప్రజల ఆసక్తులు మార్పు చెందినప్పుడల్లా కవులు తదనుగుణంగా రచనలు చేస్తూ వస్తున్నారు. ఇప్పుడంతా జనాలు వేగానికి అలవాటుపడ్డారు. ఏదైనా అప్పుడికప్పుడే కావాలి. పెద్ద పెద్ద కవితలు, పాటలు చదివే ఓపిక వారికి ఉండటం లేదు. అలాంటి వారి అభిరుచులకు అనుగుణంగా ఆధునిక తెలుగు కవిత్వంలో విశేష ప్రాచుర్యం పొందు తున్నదే మినీ పోయెట్రీ. దానినే మనం లఘుకవిత్వం అని పిలుస్తున్నాం. సూక్ష్మంలో మోక్షం కలిగి ఉండటం ఈ లఘుకవిత్వం ప్రత్యేకత.

అంతర్జాలం ఎప్పుడైతే ప్రాచుర్యంలోకి వచ్చిందో అప్పటినుండి చాలామంది ఔత్సాహికుల్లో రాయాలన్న కోరిక పెరిగింది. ఏదో ఒకటి రాసి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. అంతర్జాల విప్లవంలో భాగంగా వచ్చిన సామాజిక మాధ్యమాలు ఈ లఘు కవితా ప్రక్రియలు ప్రాచుర్యం పొందడానికి ప్రధాన కారణమవుతున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. అంతర్జాల వేదికగా ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో సృష్టించబడి, ప్రాచుర్యాన్ని పొందుతున్న లఘు కవిత ప్రక్రియలను పరిశీలిద్దాం.

**లఘు కవిత్వం :**

ప్రాచీనకాలంలోని శతకాలు, చాటువులు మొదలైన కవిత ప్రక్రియలు చూశాం. ఇవన్నీ కూడా ముక్తకాలుగా, లఘు రూపాన్ని కలిగి, నాలుగు పంక్తుల్లోనే పాఠకులకు రసానుభూతిని అందించినవి. అయితే ఇవి ఛందోబద్ధమైనవి. ఎటువంటి ఛందో నియమాలు లేకుండా, తక్కువ పదాలలో, పాదాలలో వచన కవిత పద్ధతిలో నిర్మాణం చేస్తూ రాసేది లఘుకవిత్వం. క్లుప్తత, గాఢత, సూటిదనం వీటి లక్షణాలుగా చెప్పవచ్చు.

**లఘు కవిత్వ రూపాలు :**

ఆధునిక వచన కవిత్వంలో శ్రీశ్రీ, అలిశెట్టి, ఆరుద్ర వంటి వారు లఘు కవిత్వాన్ని ఆదరించినవారే. కానీ వీరు ఒక ప్రక్రియగా, నిర్దిష్ట లక్షణాలతో (పాద సంఖ్య/ అక్షర సంఖ్య/ పదాల సంఖ్య మొదలగు నియమాలతో) వీటిని రాయలేదు. జపాన్ కవిత్వ ప్రభావంతో తెలుగులో వచ్చిన హైకూలను తొలి లఘు కవితా రూపాలుగా చెప్తారు. వీటి తర్వాత ఆచార్య ఎన్. గోపీ గారు రూపొందించిన లఘు కవితా రూపం 'నానీలు' మినీ కవిత్వానికి ఒక టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు. నానీల తర్వాత నానోలు, రెక్కలు, మణిపూసలు, మొగ్గలు, హరివిల్లు, ఫెంటోలు, లబ్‌డబ్, ద్విపాదలు, రవ్వలు, కైతికాలు వంటి ఎన్నో లఘు వచనకవితా రూపాలు తెలుగు కవిత్వంలో రూపుదిద్దుకున్నాయి. అంతర్జాల ప్రభావంతో అటు ఫేస్ బుక్, ఇటు వాట్సాప్ వేదికలుగా అనేక గ్రూపులు (గుంపులు) ఏర్పడి ఈ నూతన కవితా రూపాలకు ప్రాచుర్యాన్ని కలిపిస్తున్నాయి. అంతర్జాలంలోని ఈ రకమైన వివిధ మినీ కవితా రూపాలను చూద్దాం.

**హైకూ :** జపాన్ కవిత్వ ప్రభావంతో తెలుగులోని వచ్చిన వచన కవితా రూపం ఇది. హైకూలో మూడు పాదాలు ఉండాలనీ, అవి 5,7,5 అక్షరాలు అనుసరించాలని వీటి లక్షణాల్ని పెన్నా శివరామకృష్ణ గారు వివరించారు. అంతర్జాలంలో హైకూలను చాలా మంది రాస్తున్నారు. "థాట్ వేవ్స్" అనే బ్లాగులో ఫణీంద్ర గారు రాసిన కొన్ని హైకూలు మనకు కనబడుతాయి. "రాలిన పువ్వు/ కొమ్మెక్కి మళ్ళీ పూసింది/ సీతాకోక చిలక"[1]. "భీంపల్లి శ్రీకాంత్" రాసిన హైకూ "పిల్లతెమ్మెర/ పరదాను తాకింది/చల్లని గాలి" [2].

**నానీ :** నాదీ నీదీ మనందరిదీ అనే స్ఫూర్తితో ఆచార్య ఎన్. గోపీ గారు నానీలను రూపొందించారు. నాలుగు లైన్లు మొత్తం 20 నుండి 25 అక్షరాలతో సాగే మినీకవితా పద్ధతిని 'నానీ'లు అంటారు. అంతర్జాలంలో చూస్తే చాలా మంది కవులు రాసిన కొన్ని వేల నానీలు మనకు కనబడుతాయి. కొంతమంది కవులు ప్రత్యేకించి నానీల కొరకే బ్లాగులు, ఫేస్ బుక్ పేజీలు కూడా రూపొందించుకున్నారు. **"నిత్యం-నానే-సత్యం"** బ్లాగులో రాఖీగారు కొన్ని వందల నానీలు రాశారు. **"అంతా నాదేననుకొంటే/ లేదే చింత/ అంతా నాకే అనుకుంటేనే/ చిక్కంతా"**[3], ఫేస్ బుక్ లో ప్రకాశ్ నాయుడు గారి నానీ **"పల్లెకొస్తే పచ్చదనం/ ఏం లాభం?/ ఎండాన ఎడారివైపే/ మళ్ళీ నా ప్రయాణం!"**[4].

**రెక్కలు : "అంతర్లోచన"** అనే బ్లాగులో రెక్కలు కవితారూపాన్ని ఇలా నిర్వచించారు **"రెక్కలు కవిత ఆరు పాదాల్లో ఉంటుంది. మొదట నాలుగు పాదాలు రాసి, చిన్న గ్యాప్ ఇచ్చి మిగతా రెండుపాదాల్ని రాస్తుంటారు. ఈ ఎడం పాఠకుని ఊహకు పదునుపెట్టేదిగా వుంటుంది. రెక్కలు కవిత రెండు భాగాలుగా ఉంటుందన్నమాట"**[5] రెక్కలు కవితాప్రక్రియని ఎం.కె.సుగమ్‌బాబు 2002లో రూపొందించారు. **"స్వతంత్రించి 73 ఏళ్ళు/ బడులలో ఇప్పటికీ/ మహిళా శౌచాలయాల/ దయనీయ అనుపస్థితి/ సిగ్గుపడే లోటు/ లోతైన కత్తిపోటు"** [6] **"అంగడి సరుకు/ అమ్ముల పొదిలో/ అమ్మకాలు/ ఆన్లైన్లో/ అర్ధ రాజ్యంలో/ ఆకలి పోరాటం"** [7]

**ఫెంటోలు :** అత్యాధునికంగా వచ్చిన మినీ కవితా ప్రక్రియలలో ఫెంటో (FEMTO) ఒక విభిన్న ప్రక్రియ. ఈ ప్రక్రియని రూపొందించిన వారు అరుణ్ రాజం. ఇది రెండు లైన్ల రచన. అనుభూతిని చిన్న వాక్యాలలో వ్యక్తీకరించడం వీటి ప్రత్యేకత. మొదటి పాదంలో పది అక్షరాలుగాను, రెండవ పాదంలో పదిహేను అక్షరాల నియమంతో సాగుతాయి. **"ఫిరాయింపులు గోడమీద పిల్లి/ ఎటు దుమకాలో రేటు నిర్ణయిస్తుంది"** [8], **"నీ చూపుల దుప్పటి నుంచి/ బయటికి రానిస్తావా? ఉదయాన్ని చూడాలి"**

**మణిమాలికలు :** ఈ ప్రక్రియ గురించి కవి యాకూబ్ చెప్తూ **"ఈ మణిమాలికలు క్లుప్తంగా సాగే ఒకానొక ప్రక్రియగా, అతిక్లుప్తతతో, భావనాశక్తితో రూపుదిద్దుకొని పాఠకుల్ని ఆకర్షిస్తున్నాయి. ఫేస్ బుక్లో ఇదొక గ్రూపుగా, వేదికగా ప్రాచుర్యం పొందుతూ ఉండడం ఈ క్లుప్త కవిత్వప్రయోగ సఫలతను చూపిస్తుంది. మొదటి వాక్యము రెండవ వాక్యానికి సంబంధించిన పదాల నిడివిని ముందే నిర్ణయించుకొని, ఆ పరిధిలో, చెప్పదలచిన భావాన్ని కుదించి చెప్పడం కవి నైపుణ్యానికి సవాలే"**[10] అని వివరించారు. ఈ ప్రక్రియను ప్రసాద్ అట్లూరి, పద్మకుమారి వంగరలు రూపొందించారు. **"ఏంటో పేజీలు తడిసినట్లున్నాయి/ నువ్వు ఏడ్చావా డైరీ"** [10], **"మనసు తోటలో విహరిస్తుంటే /తలపుల తూనీగలు చుట్టుముడుతున్నాయ్!!"** [11]

**మొగ్గలు :** ఈ కవిత ప్రకియని భీంపల్లి శ్రీకాంత్ రూపొందించారు. దీని లక్షణాలు వికీపీడియాలో ఈవిధంగా వివరించారు **"మొగ్గలు మూడు పాదాల కవిత్వం. ఎలాంటి అక్షర నియమం కానీ, ఛందస్సు కానీ లేదు. ప్రతి పాదంలో మూడు నుంచి ఐదు పదాలు ఉండాలి. ఈ మొగ్గలు మూడుపాదాల కవిత్వం అయినప్పటికీ క్లుప్తత, సరళత, సంక్షిప్తత, గాఢత దీని ప్రధాన లక్షణాలు." "బతుకు ఒక నదిలా ప్రవాహమై సాగినపుడు/ నిరంతరం రాళ్ళూరప్పలు తగలక తప్పదు/ జీవితం గాయాలను మోసే దుఃఖసముద్రం"** [12]

**కైతికాలు :** కైతికాలు అనేవి 6 పాదాల నూతన సాహిత్య వచన గేయ కవిత ప్రక్రియ. దీనిని కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయులు గోస్కుల రమేష్ రూపొందించాడు. కైతిక ప్రక్రియ లక్షణాలు : మాత్ర ఛందస్సులో రాయాలి. 1,2,3,4,పాదాలలో 9 నుండి 12 మాత్రలు ఉండాలి. 2,4 పాదాలలో అంత్యానుప్రాసలో ఉండాలి. 5 పాదంలో "వారెవ్వా" లేదా పై నాలుగు పాదాలను బలపరిచే మకుటం, లేదా సరైన పదము గానీ వాడాలి. 6 వ పాదంలో కవితాత్మక వాక్యం, నూతన పదబంధం లేదా జాతీయం, కొసమెరుపులా ఉండాలి. 5,6 పాదాలలో మాత్ర ఛందస్సు నియమం అవసరం లేదు.కాని సరితూగే అక్షరాలు ఉండాలి. పెద్ద వాక్యాల రూపంలో ఉండకూడదు. రూపొందించిన ఒక సంవత్సరంలోనే ఈ ప్రక్రియలో సుమారు 50 పుస్తకాలు ముద్రించబడ్డాయి. **"నొచ్చుకున్న గుచ్చుకున్న/ ఒక్క మాట చెబుతున్నా/ ఆడమనసు మెత్తనున్న/ ఎన్నడు నొప్పించకన్నా / వారెవ్వా బాలికలు/ మమతలకు మూలికలు"** [13]

ఇవే కాకుండా హరివిల్లు, మణిపూసలు, గింజలు, నానోలు, పూతరేకులు, ఏకవాక్య కవితలు వంటి ఎన్నో అత్యాధునిక కవితా రూపాలు రోజుకొకటి మనకు అంతర్జాలంలో దర్శనమిస్తున్నాయి. ఈ ప్రక్రియలు చాలావరకు ఏకరూపత కలిగి ఉన్నప్పటికీ, దేనికదే ప్రత్యేక లక్షణాలతో కవుల ఆదరణను చూరగొంటున్నాయి. ఈ కవితలు నాసిరకంగా ఉంటున్నాయని, మనం మాట్లాడుకునే వాక్యాలనే కవితలు అంటున్నారని అనేక విమర్శలున్నా, కొన్ని మట్టుకు భావాత్మకంగా, సూటిగా, సామాజిక స్పృహతో చదివేవారిని ఆకట్టుకుంటున్నాయని చెప్పవచ్చు. అయితే ఈ ప్రక్రియల్లో ఏది నిలుస్తుందనేది కాలగమనంలో తెలిసిపోతుంది.

**సూచికలు :**


1. https://ksmphanindra.wordpress.com/2016/09/10/mini-poems/
2. https://telugu.asianetnews.com/literature/dr-bheempali-srikanth-telugu-haikus-quhchr
3. http://rakigita9-4u.blogspot.com/2011/06/blog-post.html
4. https://m.facebook.com/groups/1448681782067912?view=group
5. https://antharlochana.blogspot.com/2013/10/blog-post_1489.html
6. https://sanchika.com/rekkalu/
7. https://m.facebook.com/groups/kavisammelanam/permalink/4052587161526245/
8. https://m.facebook.com/groups/640074976455129/permalink/1339032503226036/?m_entstream_source=group
9. https://www.facebook.com/groups/kavisangamam/posts/451604874892270
10. https://te.wikisource.org/wiki%/eTDì_eÖ*¿£\T/eTDìeÖ*¿£\T_-_yîTsÁT|ŸÚ_¿£$ÔáÇ+!
11. https://www.facebook.com/groups/kavisangamam/posts/669637043089051
12. https://kolimi.org%/J$Ôá-yîTT>·Z\T/
13. https://te.wikipedia.org/wiki%/Â¿ÕÜ¿±\T

# తెలంగాణ భాషా సంస్కృతి

**వై. సత్యనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 934 722 5379

**తెలంగాణాభాష:**

హైదరాబాద్ సంస్థానంలో ఏడో నిజాం ఉస్మాన్ అలీఖాన్ పాలనలో తెలుగు, కన్నడ, మరాఠీ, తమిళ భాషలను అణచివేసి ఉర్దూ భాషను ప్రోత్సహించాడు. విద్య, ఉద్యోగాలలో ఈ భాషకే ప్రాధాన్యం ఇచ్చాడు. ఈ భాషలు మాతృభాషగా కలిగినవారు ఉర్దూను నేర్చుకున్నారు. ఉర్దూ భాష విదేశీ భాష కానీ, మతానికి చెందిన భాష కాదు. ఉర్దూపై వ్యతిరేకత లేకున్నా మాతృ భాష, సంస్కృతుల అణచివేతను వ్యతిరేకిస్తూ వివిధ సంస్థలు, భాషోద్యమం, గ్రంథాలయోద్యమంతో ప్రజాజీవితం సాంఘిక సమస్యలపై నిజాం పాలనను వ్యతిరేకించారు.

తెలంగాణ 600 ఏళ్లు ముస్లిముల పాలనలో ఉంది. మొగలుల దండయాత్ర ఫలితంగా 1687లో కుతుబ్షాహీల గోల్కొండ సామ్రాజ్యం పతనమయిపోయింది. ఆసఫ్జాహీల రాజ్యం ఇంగ్లీష్‌లో నిజామ్ డొమినియన్ అని పేరు. 1724లోని ముస్లిం హైదరాబాద్ రాజ్యం. దక్షిణ భారతంలో ఎక్కువ కాలం ముస్లిముల పాలనలో ప్రాంతం. రాజభాష ఫారసీ. మహబూబలీ పాదుషా 1883 కాలం నుంచి ఉర్దూ రాజభాష.

హైదరాబాద్ రాజ్యంలో కొన్ని శతాబ్దాలు అరబ్బీ, ఉర్దూ, పార్సీ భాషలు అధికార భాషలుగా పాఠ్య పుస్తకాల భాషలుగా కొనసాగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోస్తాంధ్ర భాష తెలంగాణ ప్రజలపై రుద్దబడింది. సమైక్య రాష్ట్రంలో కోస్తాంధ్ర భాషను పాఠ్య పుస్తకాలల్లో, రేడియో, సినిమా, పత్రికల్లో, టీవీల్లో ప్రవేశపెట్టి తెలంగాణ భాషను ఆనవాళ్లు లేకుండా చేస్తూ వచ్చారు.

దక్కను ప్రాంతంలో వ్యవహారంలోనిది తెలుగు భాష. ప్రాచీన చరిత్ర బౌద్ధ సాహిత్యంపై ఆధారపడింది. బుద్ధుని కాలంలోనే తెలంగాణలో బౌద్ధం ఆచరణలో ఉంది. తెలంగాణ చరిత్ర, సంస్కృతి బౌద్ధ సాహిత్యంలోకి వెళ్లింది. తెలుగు మత ప్రచారంలోకి వెళ్లింది. తెలుగును ఆంధ్ర లేదా అంధక భాష అని నాటక ప్రయోగార్హం కాదని భరతుడు పెర్కొన్నాడు. వాత్స్యాయనుడు, కౌటిల్యుడు అంధక భాషను వారి గ్రంథాల్లో వాడారు.

బాలవ్యాకరణంలో చిన్నయసూరి తెలుగు భాషకు అక్షరాలు 36 అని పేర్కొన్నాడు. ఆంధ్ర భాషలో 56 అని చెప్పుతారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ భాషలో అక్షరాలు 36, తెలుగు భాషకు అక్షరాలు కుదించాలని 28 అక్షరాలు ఉంటే చాలు. ఖ,ఘ వంటి మహా ప్రాణాలు తెలుగు లిపిలో అక్కర లేదని వాటి ధ్వనులను ఇంగ్లీషు పదాలతో అనేక ధ్వనులను రూపొందినట్లుగా ఉండాలని భావించారు.

తెలుగు దేశానికి అంతటికి తెలంగాణ కేంద్రస్థానం. శాతవాహనుల నుంచి కాకతీయుల వరకుఈ కేంద్ర ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాలలో ఉంది. తెలంగాణ ముస్లింముల పాలనలో ఈ ప్రభావం తగ్గి వేరుతనం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ రాజధాని కావడంతో తెలంగాణ తెలుగు వారందరికి కేంద్ర స్థానమైంది. అలాగే భాషపై తెలంగాణ ప్రభావం పడింది. తెలంగాణలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో భాష భేదం వినిపిస్తుంది. కృష్ణా జిల్లాతో గల ఖమ్మం పొలిమేరలలో కృష్ణా జిల్లా భాష, మహబూబ్‌నగర్ రాయలసీమ ప్రభావం కనిపిస్తుంది.

తెలుగు రాష్ట్రాలలో తెలుగు మాట్లాడిన ఏ ప్రాంతం యాస ఆ ప్రాంతానిది. ఆంగ్లవిద్య ఒకచోట ఆంగ్లాంధ్రం, లేనిచోట తౌరక్యాంధ్రంగా విస్తరించింది. చాళుక్య సీమలో అభివృద్ధి చెందిన ఊర్లలో ఆంగ్లాంధ్రం వ్యాపించింది. తెలంగాణలో పట్టణాలలో ముస్లింములు ఎక్కువగా ఉండటంతో తౌరక్యాంధ్రంవ్యాపించింది. మిగిలిన పట్టణాలలో తెలుగు వెలిగింది.

**"నన్నయ, తిక్కనలు స్వర్గము నుండి దిగివచ్చినచో వారు తెలంగాణపు గ్రామీణులలో నెట్టి 'తిప్పలు' లేకయే మాటాలాడగలరు. కాని వారు రాజమహేంద్రవరమునో, నెల్లూరునకో వెడలినచో గ్రామీణుల మాటలాడు భాష వారికి కొంత 'ఎరుక' పడకపోవుట యును, వారిమాటలా గ్రామీణులకు 'నెట్టి' తెలియక పోవుటయు సంభవించునని నా నమ్మకము"** బిరుదురాజు రామరాజు తెలంగాణ, తెలంగాణేతర భాషకు ఉన్న తేడాను వ్యక్తపరిచాడు. తెలంగాణ భాష గ్రాంథికానికి సన్నిహితం. ఆంధ్ర భాషలో దేశి, జాను తెనుగు వైకృత పదసమూహం ఎక్కువ. నన్నయ, తిక్కన రచనలలో, తెలంగాణ ప్రాచీన రచనలలో వాడుక పదజాలం ఎక్కువ. మద్రాసు, విజయవాడ, రాజమండ్రి నుంచి వెలువడే పత్రికలలోని వ్యావహారిక రచనలు తెలంగాణ పాఠకలోకాన్ని ప్రభావితం చేశాయి.

తెలంగాణలో వ్యవహారంలో 'ట' ప్రత్యయానికి చేర్చి వండుటం, పెట్టుటం, తినుటంవంటి రూపాలు ఉన్నాయి. "వండుట" గ్రాంథిక రూపానికి ఒక్క అనుస్వారం మాత్రమే అతుకబడింది. కాని మహబూబ్‌నగర్ మాండలికంలో 'ట' ప్రత్యయానికి మారుగా 'క' ప్రత్యయం చేర్చి వండుకం, పెట్టుకం, తినుకం అంటారు. విశేష్యాలను కూడా నీ ప్రత్యయం చేర్చి భావార్థం వాడుతారు. రాక రావుకం వచ్చినాడు–వచ్చిండు, పోయినాడు–పోయిండు, తెచ్చినాడు–తెచ్చిండు, వండినాడు–వండిండు వంటి ఉభయ క్రియా రూపాలు వ్యవహారం.

శబ్దాలను, అక్షరాలను హ్రస్వీకరించి తెలంగాణలో మాట్లాడుతారు. వస్తావా –వస్తవా, పోతావా–పోతవా, అనే రూపాలు ఉన్నాయి. అచ్చులకు హల్లులు, హల్లులకు అచ్చులు అక్కడ–ఇక్కడ శబ్దాలకు హల్లులు చేర్చి గక్కడ–గిక్కడ అని ఉచ్చరిస్తారు. తెలంగాణలో పరుష సరళాల పరంగా 'గడప'కు 'కడప' అని 'బొక్క' కు 'పొక్క'అని ప్రయోగిస్తారు. బొక్క శబ్దానికి ఎముక అని అర్థం. బొక్క అంటే రంధ్రం అని వ్యవహారం. తెలంగాణలో 'తోలుకొని పోవుట' అనేది మనుషులకు ఉపయోగిస్తారు. 'కంచె' అనేమాటకు చేను చుట్టు వేసెడు కంప కోటే కాక బీడు అనే అర్థం.తెలంగాణలో 'తిన్నగా' అనే శబ్దానికి నెమ్మదిగ, మెల్లగ, మనోజ్ఞం అని అర్థాలు. ఇతర ప్రాంతాలలో సూటిగా అని అర్థం.

పొడుపు కథకు 'శాస్త్రం', 'తట్లు' అని తెలంగాణలో వ్యవహారం. గుండెకాయ అంటే గొంతు ముడి. గుండె పిసికటం అంటే గొంతు పిసికటం. బొండిగ అంటే గొంతు. ముచ్చట అంటే సంభాషణ. ముచ్చటించడం అంటే మాట్లాడటం. 'కబుర్లు' అని వాడుక. కబురు ఖబర్ శబ్దభవం. చిన్న మేకుకి 'మొల' అని వ్యవహారం. మొలత్రాడులోని 'మొల'కు నడుమని అర్థం.

తెలంగాణేతరులు ప్రయోగించిన శబ్దాలు ఇతర ప్రాంతాలలో లేవు. తెలంగాణలో ఈనాటికీ వాడుకలో ఉన్నాయి. 'బాగాలు' అంటే పోకలు అని అర్థం. ఇదే తెలంగాణలో ప్రచారం. ఇతర ప్రాంతాలలో పోకలనే వక్కలని వ్యవహారం. వక్కలు అంటే తెలంగాణలో ముక్కలని అర్థం. 'ఉఱుకుట' పరుగెత్తుటకు సాధారణ ప్రయోగం. కొలువు అంటే ఉద్యోగం. "మా వానికి కొలువు దొరుకలేదు" అని వ్యవహారం. అధికం అనటానికి 'లావు' శబ్దం ఉపయోగిస్తారు."లావు లావు మాట్లాడకు" "లావుగా బలిసిండు". ఈ అర్థాన్నే 'వాటము' శబ్దానికి వాడుతారు.

ఒసగు అంటే దానం/కట్నం అని అర్థం. దీనికే 'వొసు' అను వికృతరూపం. వివాహకాలంలో వధూవరుల పై నుంచి పైసలు తిప్పి సన్నాయి వాళ్లకు ఇస్తారు. 'ఒస' ఇస్తారు. తన్నుట అంటే కాలుతో తన్నడమని వాడుక. బాల బాలికలను పోరగాడు, పోరి నిందార్థంలో వ్యవహరిస్తారు. ఈ శబ్దానికి తల్లిదండ్రులు లేని వారని విశేషార్థం. బువ్వ అంటే అన్నం అనీ, బోనం అంటే కూడా అన్నమనే అర్థం. ఈ శబ్దాన్ని దేవతాపరంగా బోనాలని వ్యవహారం.

కంకులు మక్కజొన్న కంకులు, పచ్చజొన్న కంకులు అని వ్యవహారం. నోటితో కరచి తినుట వల్ల కంకి అని వ్యవహారం. పరిమాణార్థంలో కంకెడు అని వాడుక. 'కంకెడంత బువ్వ బెట్టవ్వా' అని బిచ్చగాడు వేడుకొంటాడు. కీసర అంటే ఇసుక. కీసర భూమి అంటే ఇసుక భూమి. సైసు అంటే సహించు అని అర్థం. 'కొంచెం సైసవయ్యా" అని ప్రయోగం. తెలంగాణ వారిలో సైసే గుణం ఎక్కువ.

శ్రీనాథుని కాలం నుంచి తెలుగులో పారసీ పదాలు ప్రవేశించాయి. తెలంగాణలో ఉర్దూతో కలిసిన భాష తౌరక్యాంధ్రమని కొందరి వాదన. హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే కాని గ్రామీణ ప్రాంతాలకు లేదు. తెలుగు దేశమంతా ముస్లింముల పాలనలో ఉండగా ఉర్దూ భాషా పదాలు వ్యాపించాయి.

**"తెలంగాణము పల్లెపట్టులందుకన్న ఉత్తర సర్కారులందే నేను ఉర్దూ మాటల నెక్కువగా వింటిని. కాని అవి ఉర్దూ మాటలని వారికి తెలియదు. ఇంకొక విశేషమేమన తురకల పాలనము నుండి బయట బడిన ఆయా ప్రాంతములందు (సర్కారులు) వారి చెంత నిలిచిపోయిన ఉర్దూ పదములను అపార్థములందును వాడుచుందురు"** అని బిరుదురాజు రామరాజు అభిప్రాయం. తెలంగాణ తెలుగులో పారసీ శబ్దాలు ఉన్నాయి. కీస అంటే జేబు అని అర్థం.

తెలంగాణలో తూకాల శబ్దాలలో ఇతర ప్రాంత శబ్దాలు కొన్ని పోలినను పరిమాణంలో కొంత విభేదముంది. ఎడమ చేయికి – పురచేయి, రొడ్డ చేయి, తొంటచేయి అని ఇతర ప్రాంతాలలో వ్యవహారం. చొక్కాకు 'అంగీ' అని వాడుక. బరిబాత అంటే నగ్నం అని అర్థం. బట్టబాతలోని బాతయే ఇందులో చేరింది. ప్రాణం అంటే ఆరోగ్యం. 'నా ప్రాణం బాగా లేదు' అని వాడుక. పుల్ల అంటే పుడుక 'పానకంలో పుడక వలె' – కట్టె పుల్ల వలె సన్నగా' అని ప్రయోగం. అమడాల బిడ్డలు అంటే 'కవల పిల్లలు' అని అర్థం. ముస్లింల పాలనతో తెలుగు అభివృద్ధి కుంటుబడింది. ప్రాచీన లక్షణాలు తెలంగాణ భాషలో కనిపిస్తాయి. తెలంగాణలో కళ్ళు అనీ, కండ్లు అనీ వాడుక. కన్ను కన్నులుగా, కన్నులు కళ్ళుగా మారాయి.

నల్లగొండ జిల్లా మాండలికంలో 'ఇన్ని దినాల' నుంచి అర్థంలో ఇన్ని దినాల గోలె అని అంటారు. ఇది సమయాన్ని తెలిపే పదాల మీద వస్తుంది. సమయ వాచకాల మీద వస్తుంది. కోలెన్ అనే ప్రాచీన ప్రత్యయం. 'పిన్ననాటం గోలె' నన్నయ వాడారు. అంటే చిన్ననాటి నుంచని అర్థం. ప్రాచీన పదాలు తెలంగాణ మాండలికంలో ఉన్నాయి. కుర్కాసు అంటే పొయ్యిలో సగం కాలిన కర్ర. ఎక్కువగా కట్టెల పొయ్యిని వాడేవారు కాబట్టి అప్పటి సంస్కృతిని చెప్పుతుంది. కురకచ్చు పదం గ్రామీణులు వాడుకలో కురకాసుగా మారిపోయింది.

పోతన ఉరుకు అనే పదం ఎక్కువగా ప్రయోగించారు. కొన్ని పదాలు తీసివేసి దీర్ఘమైన పదాలను వాడటం ఉంది. ఆంధ్ర ప్రాంతంలో పరుగెత్తు అనే పదం అలా వచ్చిందే. పరుగెత్తు పదం కన్నా ఉరుకు ఏక క్రియాపదం. ఉరుకు అనే పదాన్ని వాడకపోతే భాష నుంచే పోతుంది. భాష అభివృద్ధి చెందినచోట కొత్త పదాలు అనేకం కనిపిస్తాయి. ఒక్కొక్కసారి పాత పదాలు వాడకం ఉండదు. ప్రజలు నివసించే వాతావరణ, రాజకీయపరిస్థితుల వలన పదాలు చేరుతాయి. తెలంగాణలో 600 ఏళ్లు ముస్లింముల పాలన సాగింది. ఉర్దూ ప్రభావం తెలుగుపై పడింది. కోస్తాలో ఆంగ్ల ప్రభావం తెలుగుపై ఉంది.

**"ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నుంచి ఒక ప్రామాణిక భాషను భాషా శాస్త్రవేత్తలు తీసుకొనివచ్చి తెలంగాణ ప్రాంతంలోని భాష అంత ప్రామాణికం కాదని ఇక్కడి వాళ్లకే ఒక అనుమానం వచ్చేటట్లు చేసినారు. మొదట్లోనే నాలుగు ప్రాంతాల్లోని ముఖ్యమైన వాడుక పదాలతో ప్రామాణిక భాషను రూపొందించినట్లయితే ఒక ప్రాంత భాష పట్ల మరొకరికి ద్వేష భావాలు ఉండేవికావు"** అని రవ్వా శ్రీహరి అభిప్రాయం. తెలంగాణలోని దాశరథి, సి.నారాయణరెడ్డి వంటి వారు ఇంటిలో మాట్లాడే భాష ఒక తీరు, రాసేప్పుడు ఆంధ్రపత్రికలలో ప్రచురించబడి వారికి కూడా అర్థం కావాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలో ఉండే భాషవలె రాశారు.

**తెలంగాణ-సంస్కృతి :**

ఒక జాతి, ఒక దేశం భౌతికంగా, మానసికంగా దైనందిన జీవితంలోను, శాశ్వతంగా జీవితంలోనూ సాధించిన ప్రగతికి మూల్యాలే నాగరికత లేదా సంస్కృతి. భారతీయ సంస్కృతి భౌతిక, మానసిక ఆధ్యాత్మిక ప్రగతి త్రివిక్రమరూపం. భౌతిక సంస్కృతి కాలక్రమంలో జాతి ప్రగతికి అనుగుణంగా మారుతుంది. కట్టు, బొట్టు, జుట్టు, ఆహారవిహారాలు, గృహోపకరణాలు, పనిముట్లు, సంఘ వ్యవస్థ, వృత్తులు, వనరులు కాలక్రమంలో మారుతాయి. మానసిక ప్రగతిలోని సంస్కృతి ఆ జాతి విశ్వాసాలు, అభిరుచులు, ఆహార వ్యవహారాలు, నీతి నియమాలు, లలిత కళలు వంటివి తొందరగా మారవు.

తెలంగాణలో గ్రామీణ సంస్కృతి పిలుపులోనే కనిపిస్తుంది. అవ్వ, అక్క, అన్న, మామ, అయ్య వంటి సంభోదనలు ఎదుటివారిలో నెనరు పుట్టిస్తాయి. ఊరిలోని ఒక వ్యక్తికి ఊరంతా తెలుసు. ఊరిలో ఏ వేడుక జరిగినా ఊరంతా తెలుస్తుంది.

గ్రామంలో రైతు జీవన విధానమే గొప్ప సంస్కృతి. అన్ని వృత్తుల వారి జీవన విధానం సంస్కృతిలో ఒక భాగమే.

**"హైదరాబాద్‌లో సంగీత విద్వాంసుడు త్యాగరాజు, రామదాసు కీర్తనలు పాడినా శ్రోతలు స్పందించరు. సినిమా పాటలు పాడమని అడుగుతారు. గొప్ప నృత్యం చేసినా చవకబారు నృత్యం చేయమని అడుగుతారు. నాలుగు వందల సంవత్సరాల పూర్వం నిర్మించిన హైదరాబాద్ మొట్ట మొదటి నుంచి తెలుగువారి సంస్కృతికి కేంద్రం కాకపోవడమే. ఇక్కడి స్థానికుల ఆచారాలు, జీవన విధానాలు భిన్నంగా ఉండటమే. గజల్, ముషాయిరాలతో ఉన్న పరిచయం శాస్త్రీయ కర్ణాటక సంగీత నృత్యాలతో లేకపోవడం. అసఫ్‌జాహీలు, మొగలులు తెలుగును రూపుమాపి పారసీ, ఉర్దూ భాషలను ప్రవేశపెట్టారు"** అని ఉదయవర్లు అభిప్రాయం.

ఒక ప్రాంతంలోని వర్ణాతపశీలుల స్థితిగతులు, సామాజిక ప్రభావంతో పరంపరగా ఆచరిస్తున్న సంప్రదాయాలే సంస్కృతి. భారతీయ సంస్కృతిలో ఒక పార్శ్వమే తెలుగు సంస్కృతి. వేయేళ్ల రాజవంశాల పాలనలో కులవృత్తులు, మతం, పండుగలు, ఆచారాలు, సంగీతం-సాహిత్యం, కళలు ప్రవృత్తులుతెలుగువారి జీవనంలో మార్పులు ప్రవేశించాయి. తరాల సంప్రదాయాలు కాలగర్భంలో కలిశాయి.

**తెలంగాణ సంస్కృతి - ప్రత్యేకత**

తెలంగాణను కాకతీయల పతనం తర్వాత స్వాతంత్ర్యం వచ్చేదాక 6 శతాబ్దాలు బహమనీలు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు పాలించారు. తెలంగాణలోని ఆనాటి 9 జిల్లాల్లో 7 జిల్లాలకు ఇతర రాష్ట్రాలు సరిహద్దుగా ఉన్నాయి. నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాలకు మహారాష్ట్ర, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు కర్ణాటక, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు మధ్యప్రదేశ్ సరిహద్దులు ఉన్నాయి. అందుకే ఆయా రాష్ట్రాలు సంస్కృతిని ప్రతిబింబిస్తాయి.

హైదరాబాద్‌కు ఏ రాష్ట్రాలతో సరిహద్దు లేవు. పాలనకు కేంద్ర బిందువుగా భిన్న సంస్కృతి ప్రతిబింబిస్తుంది. వరంగల్, నల్గొండ జిల్లాలకు ఏ రాష్ట్రాల సరిహద్దులు లేకపోవడంతో ముస్లింముల పాలనతో ఇస్లాం సంస్కృతి ప్రభావముంది. భిన్న సంస్కృతిని మేళవించుకొని ప్రత్యేకమైన సంస్కృతిని తెలంగాణ సంతరించుకొంది. తెలంగాణ సంస్కృతి విశిష్టమైనది. ప్రత్యేక అస్తిత్వం కలిగింది. కాలగమనంలో ఆంధ్రసంస్కృతిలో భాగంగా పేర్కొని, నష్టపరిచి నప్పటికీ ఈ సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నది. కొత్త చూపుతో, అన్వేషణతో తన అస్తిత్వాన్ని తిరిగి నిర్మించుకుటుంది. విస్మరణకు, వక్రీకరణకు, అణచివేతకు గురైనా స్థానిక సంస్కృతీ రూపాల్ని సమీకరంచుకుంటూ కొత్తగా వ్యక్తీకరించు కుంటున్నదని నందిని సిధారెడ్డి గారి అభిప్రాయం. భౌగోళికంగా అనుకూలతలు, వనరులు ఉన్న ప్రాంతం కావటంతో స్థానికంగా ఎంతో చరిత్ర, నాగరికత, సంస్కృతి వెలుగొందాయి.

కతుబ్‌షాహీల కాలంలో సూఫీ తత్వానికి ప్రజాదరణ లభించింది. రామదాసు నిర్మించిన భద్రాచలం రామాలయానికి తానీషా మాన్యం ఇచ్చి సామరస్యాన్ని చాటుకున్నారు. హిందూ ముస్లింలు మతసామరస్యాన్ని పాటించారు. హైదరాబాద్‌లో బోనాల జాతరలో ముస్లిములు పాల్గొంటారు. ముస్లింల ఉత్సవాల్లో, ఉర్సుల్లో హిందువులు పాల్గొంటారు. రాజకీయ కారణాల వలన మత ఘర్షణలు చెలరేగితే పరస్పరం ఆశ్రయం పొందుతారు.

తెలంగాణలో ప్రాచీన తెలుగు సంస్కృతి ఉంది. ఫ్యూడల్ సంస్కృతి ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రజా సాహిత్యానికి పునాది. లిఖిత సంప్రదాయంలో సాహిత్యం తరతరాల మౌఖిక సంప్రదాయానికీ, ప్రజల భాషా సంస్కృతులకు దూరమైన పండిత వర్గానికి పరిమిత మైనప్పుడు దేశీయ ఛందస్సులో ప్రజల భాషలో రచనలు చేశాడు పాల్కురికి సోమన. ఆయన ప్రజా సాహిత్యానికి పెట్టిన ఒరవడి తెలంగాణలో తర్వాత కవులకు వర్తించింది. గౌరన రచించిన

## ఆశయాల దీపం - వెలుగుల ప్రతిరూపం

దీపం – జ్ఞాన సంకేతం
అమవస 'నిసి' ని – అజ్ఞానపు 'మసి'ని ఏమార్చేందుకు
కాటుక చీకట్ల కన్నీటి చారికల్ని – కడగండ్లని – నివారిస్తూ
నిలువరించేందుకు అక్షరాల దీపాలు వెలగాల్సిందే!!
గాయపడ్డ గుండె భాషల జ్ఞాపకాల్లో
సాక్షరతల జ్వలన నిర్వేదనలు వేలాది సాక్షమిస్తుంటే,
జీవన గమనంలోని అనివార్య విషాదాలు
సంఘటితంగా ఎదుర్కోగలిగే ధీశక్తికై
ఆత్మ మండిత ప్రచోదనలు అనివార్యం!
దీపాల శ్రేణుల్లోంచి విస్తరిల్లేలాగా
సంస్కృతీ సంప్రదాయాల నెలవులు
సిరిసంపదలు – శాంతి సౌభ్రాతృత్వాలు
వెలుతురు జీవద్భాషగా విస్తరిస్తుంటుంది
రాత్రి తెరుచుకున్న రహస్య ద్వారాల్నించి
ప్రభాస కాంతులు ప్రజ్వరిల్లేలా
దిగంతాల అవతల్నించి
దిగుళ్ళకుండళ్ళ నుంచి
నైరాశ్యాల్ని తరిమేసేందుకు
తిమిరంతో సమరాన్ని కొనసాగించాల్సిందే
విరిగిన రెక్కల ముందు విలపించే కంటే
ఆశయాచరణాల నిబద్ధతలు
కొనసాగించాల్సిన క్షణాలు
రేపటి వేకువ వెలుగుల జలపాతంలా
నింగిలో ఆనంద తారావళి వెల్లివిరియాల్సిందే!!
ప్రశ్న జవాబుల కాలగమనంలో
మానసికావరణంలోకి
జ్ఞానకాంతుల ప్రసారణం
కొనసాగింపు జీవితతాలకు
మరో దీపావళి ఆశల ప్రతిరూపం
ప్రదీప్త కాంతుల శోభలు
విశ్వమంతా పరచుకోవాలన్నదే
దీపావళి సర్వహితావళి కావాలి.

**వేదుల వరలక్ష్మి**
కాకినాడ, ఫోన్ : 939 626 5749

హరిశ్చంద్రోపాఖ్యానం ద్విపదలోనే వెలువడటం తెలంగాణలో ప్రజా సాహిత్య రూపాల కొనసాగింపునకు ఉదాహరణ.

విభిన్న భౌగోళిక పరిస్థితులు, సామాజిక, రాజకీయ వాతావరణాలు ఉన్న తెలంగాణకు ప్రత్యేకించిన సంస్కృతి ఉంది. వైరుధ్యాల సంగమంగా ఉండటమే తెలంగాణ ప్రత్యేకత. జానపదుల సంస్కృతే దీనికి మంచిఉదాహరణ. వేయేళ్ల క్రితం గ్రంథాలలో ప్రస్తావించిన కాకిపడగలు, గుర్రపు వారు ఉపయోగించిన ఇత్తడి వస్తు సంకేతాలు కనపడుతాయి. పదిహేను వందల ఏళ్ల క్రితం ఉన్న రాక్షస గుళ్ల సంస్కృతి కొనసాగుతుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో చనిపోయిన వారి గోరీలపై చుట్టూరా చిన్న చిన్న రాళ్లను ఉంచుతారు. తెలంగాణలో గ్రామదేవతలను పేరుతో ఉప్పలమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ పండుగలు గ్రామీణులు పెద్ద ఎత్తున చేస్తారు.

తెలంగాణలో హిందువులు ముస్లింములను, క్రైస్తవులను సంస్కృతిలో కలుపుకుంటారు. ముస్లింముల మోహరం(పీర్లపండుగ)ను హిందువులు కూడా జరుపుకుంటారు. అంతేకాక ముస్లిం దర్గాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇది ముస్లిం పాలన ప్రభావం. పుట్టిన రోజు పండుగలను క్రైస్తవ సంస్కృతి ప్రకారం కేకు కట్ చేసి క్యాండిల్స్ ఆర్పివేసి జరుపుకుంటారు. ఇది పాశ్చాత్య సంస్కృతి ప్రభావం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు ప్రత్యేక సంస్కృతితో అధికారిక ప్రాచుర్యం లేదు. బతుకమ్మ పండుగ ప్రారంభం, సద్దుల బతుకమ్మ, దసరా వ్యవహారంలోని పేర్లను పితృ అమావాస్య, దుర్గాష్టమి, నవరాత్రులు, విజయదశమి అని వ్యవహరించేవారు. ఆదిమకాలం నుంచి ఆధునిక కాలం వరకు తెలంగాణ అస్తిత్వాన్ని, ప్రత్యేకత ఔన్నత్యాన్ని కలిగి ఉంది. పురాణాలు, మహాభారతంలోనూ అశ్మకరాజులు ఈ ప్రాంతం వారే. శాతవాహనుల నుంచి అసఫ్‌జాహీల వరకు పాలించారు.

శాతవాహనుల నుంచి ఆంధ్రప్రదేశ్ చరిత్రను పరిశీలిస్తే మొదటి నుంచి తెలంగాణ ప్రత్యేక ప్రాంతంగానే రాజవంశాల పాలనలో ఉంది. 3000 సంవత్సరాల పరిపాలనలో 800 యేళ్లలో మాత్రమే తెలంగాణ ఆంధ్ర, రాయలసీమ, కర్ణాటక మహారాష్ట్ర ప్రాంతాల రాజవంశీయుల పాలనలో కలిసి ఉంది. 2000 యేండ్లకు పైగా తెలంగాణ ప్రత్యేక భూభాగంగా ఉంది. అందుకే తెలంగాణ భాష, సంస్కృతి ఇతర ప్రాంతాల కంటె భిన్నంగా ఉంది.

'ఒక పరిపాలన ఆ ప్రాంతపు సంస్కృతిని శాసిస్తుంది' పాలకుల సంస్కృతిలో భాగంగా పాలితులు ఉంటారు. శాతవాహనుల నుంచి కుతుబ్‌షాహీల వరకు తెలంగాణలో మత, రాజకీయ, సాంఘిక,ఆర్థిక సంబంధ ప్రజాజీవన వ్యవస్థలో పెద్ద మార్పులేదు. ఆయా కాలాల్లో రాజులు ఆదరించిన మతానికి అనుగుణంగా కళలు సంప్రదాయ సాహిత్యం ఆవిర్భవించాయి. సామాన్య ప్రజల జీవన సంస్కృతి దీనిలో ప్రతిఫలించలేదు.


# కాటమరాజు కథలు – 3 వ సంపుటం – ఆచార్య తంగిరాల వారి విశిష్ట పరిష్కరణ

**డా. తోట వెంకటస్వామి,** సహాయాచార్యులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం. ఫోన్ : 94926 31323

తెలుగు జానపద సాహిత్యానికి విశ్వవిద్యాలయ స్థాయిలో గౌరవం తీసికొని వచ్చిన మొట్టమొదటి మహానుభావుడు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు. వీరు చేసిన **"తెలుగు జానపద గేయ సాహిత్యము"** అనే పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు 1956లో పిహెచ్.డి. డిగ్రీ యిచ్చారు. ఇది 1958లో గ్రంథరూపంలో వెలువడి ఎంతో ప్రసిద్ధిపొందింది. వీరి తరువాత జానపద సాహిత్యరంగంలో విశేషమైన కృషిచేసిన వ్యక్తి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు. వీరు రామరాజుగారి పరిశోధనలోని మూడవ ప్రకరణమైన చారిత్రక గేయములను గ్రహించి, ఎన్నో నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు వెళ్ళారు. తంగిరాలవారు "తెలుగు వీరగాథా కవిత్వము" అనే అంశాన్ని గురించి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1963 నుండి 1968 వరకూ, ఐదు సంవత్సరాలు అహోరాత్రులు కృషిచేశారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలన్నీ పర్యటించి సుమారు 40 తాళపత్ర గ్రంథాలను సేకరించారు; ఎన్నో మౌఖిక వీరగాథలను గ్రంథస్థం చేశారు. వీరి పరిశోధనకు 1969లో పిహెచ్.డి. డిగ్రీ వచ్చింది.

భారతీయులకు ప్రపంచ ప్రసిద్ధికెక్కిన రెండు గొప్ప ఇతిహాసాలున్నాయి : (1) వాల్మీకి రామాయణం, (2) వ్యాస మహాభారతం. తెలుగువారికి ఈ రామాయణ మహాభారతాలతోపాటు మరో రెండు జాతీయమైన ఉత్తమ ఇతిహాసాలున్నాయి: అవి (1) పల్నాటి వీరచరిత్ర, (2) కాటమరాజు చరిత్ర. ఇవి ఒక్కొక్క వీరగాథలు కావనీ, ఇవి "వీరగాథాచక్రములు" (Ballad-cycles) లేక "జానపద ఇతిహాసములు" (Folk Epics) అనీ ఆచార్య తంగిరాలవారు మొట్ట మొదటసారిగా నిరూపించారు. అంతేకాదు పల్నాటి వీరకథాచక్రములో 25 వీరగాథలున్నాయని; కాటమరాజుకథాచక్రములో 32 వీరగాథ లున్నాయని స్థాపించారు; ఆ కథల పేర్లు కూడా ఇచ్చారు.

ఆచార్య తంగిరాలవారు పరిశోధన ప్రారంభించే నాటికి కాటమరాజుకథలలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కృషివల్ల మూడుకథలు మాత్రమే ముద్రితమయ్యాయి. అవి: **"ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట" – "భట్టురాయబారము" – "కోటపాటి తాటివృక్షం తెచ్చే కథ".** తక్కినవేవియు సాహిత్యలోకానికి తెలియవు. సుబ్బారావుగారు ఎంతో పరిశోధించి 32 కథల పేర్లు ఇంచుమించుగా చెప్పగలిగారు. వాటిలో 20 కథలు సేకరించారు. వీటిని 1974–75 సంవత్సరాలలో వారి పండితమిత్రులైన డా॥ చన్నాప్రగడ తిరుపతిరావుగారి సహాయ సహకారాలతో చక్కగా పరిష్కరించి, 300 పుటల సమగ్రమైన పీఠికతో సిద్ధం చేశారు. ఈ కాటమరాజు కథలను అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు రెండు సంపుటాలుగా ప్రచురించారు. ఒక్కొక్కటి సుమారు వేయిపుటలు (బౌండు పుస్తకం). 1976లో మొదటి సంపుటం, 1978లో రెండవ సంపుటం వెలువడి, ఆచార్య తంగిరాల సుబ్బారావుగారికి అఖండమైన కీర్తిప్రతిష్ఠలను సంపాదించి పెట్టాయి. నోరి నరసింహశాస్త్రిగారివంటి పండితులు వీరిని ఎంతగానో ప్రశంసించారు. అకాడెమీ అస్తమించి, తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించబడ్డాక, 1998లో (అంటే 20 ఏండ్ల తరువాత) తెలుగు విశ్వవిద్యాలయంవారు ఈ కాటమరాజు కథలు రెండు సంపుటాలనూ పునర్ముద్రించారు. మళ్ళీ ఇంకో 22 ఏండ్లు గడిచిన తరువాత యిప్పుడు తంగిరాలవారు తన 87 సంవత్సరాల వయసులో, నలుగురు మిత్రుల సహకారంతో ఈ కాటమరాజుకథల




మూడవ సంపుటాన్ని ప్రచురించారు. ఈ గ్రంథం ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ అరసవల్లి గిరిధర్‌గారి "కఠియావులరాజు" ముఖచిత్రంతో, వెనుక అట్టమీద కళాప్రపూర్ణ 'బాపు'గారి "కాటమరాజు" చిత్రంతో, కేస్ బైండింగ్‌తో సర్వాంగ సుందరంగా గత సంక్రాంతికి వెలువడింది.

కీ.శే. ఆరాధ్యుల పిచ్చయ్యగారు (1963–70ల మధ్య, ఆంధ్రప్రదేశ్ యాదవసంఘం కార్యదర్శి), కీ.శే. డా॥ కనకబండి మోహనరావు గారు, శ్రీ మట్టి గురవయ్యగారు, ప్రొ॥ మట్టిబోయిన జయదేవ్‌గారు సేకరించి యిచ్చిన నాలుగు తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి, 74 పుటల విపులమైన, మిక్కిలి విలువైన పీఠిక వ్రాసి, ఈ "కాటమరాజుకథలు" మూడవ సంపుటాన్ని నిర్మించారు ప్రధాన సంపాదకులైన మా గురుదేవులు ఆచార్య తంగిరాలవారు. ఇది మిక్కిలి విలువైన పరిశోధన గ్రంథం. సామాన్య పాఠకులు సులభంగా కథలను అవగాహన చేసుకొనేందుకు వీలుగా ప్రతికథలోను కథాగమనాన్ని సూచిస్తూ చక్కని ఉపశీర్షికలను ఉంచారు.

ఈ సంకలనంలో కాటమరాజు చరిత్రకు సంబంధించిన నాలుగు కొత్త వీరగాథలు ఉన్నాయి. అవి :

**1) కటియావులరాజు కథ :**

ప్రొ॥ సుబ్బారావుగారు 1966లోనే ఇద్దరు భిన్నకవుల రచనలైన రెండు కటియావులరాజుకథలను సేకరించి, తమ కాటమరాజుకథలు – మొదటిసంపుటం (1976)లో ముద్రించారు. ఈ సంపుటిలో ఉన్నది మరియొక కవి రచన. (ఆ కవిపేరు మాత్రం అవతారికలో లేదు.) దీనిని ఆరాధ్యుల పిచ్చయ్యగారు 1972–73 ప్రాంతంలో సేకరించారు. కటియావులరాజు, కాటమరాజు పెదతండ్రియైన సింహాద్రిరాజు కుమారుడు; ఏకాంగవీరుడు. మహాభారతంలోని భీమార్జునుల వంటి సాటిలేని మేటివీరుడు; మిక్కిలి బలశాలి.

ఐతమరాజు "ఉర్లుకొండ యలమంచి"ని పాలిస్తున్నాడు. (ఇది నేటి తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో ఉంది.) ఓరుగల్లు నుండి బాచన్న అనే బ్రాహ్మణుడు గంగ తిరునాళ్ళు చూడటానికి యలమంచికి వచ్చి, ఓరుగల్లులో "కలియుగ బేతాళుడు" అనే మాస్టీడు కోటగుమ్మానికి తన బిరుదులను వ్రేలాడగట్టాడని, ఎంత గొప్పవీరుడైనా సరే ఆ బిరుదుల క్రిందనుండి దూరిరావలెనని, లేనిచో తనతో ద్వంద్వయుద్ధంచేసి గెలవాలని చెపుతున్నాడని అంటాడు. ఈ వార్త కటియావులరాజుకు తెలుస్తుంది. అతడు బేతాళుని గర్వం అణచాలని నిర్ణయించుకుంటాడు.

అయితమరాజు, పల్లికొండ, యితర యాదవ వీరులతో కలిసి కటియావులరాజు ఓరుగంటి శంభుని తిరునాళ్ళకు వెడతాడు. తన "గండకత్తెర" అనే గొప్ప పంచకల్యాణి గుఱ్ఱంపై స్వారీచేస్తూ ఓరుగల్లు నగరంలోకి ప్రవేశించబోతాడు. కాని అతని గుఱ్ఱం కోటగుమ్మం దగ్గరే ఆగిపోయింది! లోపలికి వెళ్ళటం లేదు. కారణమేమిటో తెలియక, కటియావులరాజు గుఱ్ఱందిగి నాలుగువైపులా చూస్తాడు. గుఱ్ఱం తన ముట్టెను పైకెత్తి కోటగుమ్మంవైపు చూపెడుతుంది. అక్కడ బేతాళుని బిరుదులు వ్రేలాడుతూ ఉంటాయి. వాటి క్రిందనుండి దూరి వెళ్ళడం తనకు తన యజమానికి అవమానకరమని భావించి ఆ "గండకత్తెర" గుఱ్ఱం ఓరుగల్లు కోట గుమ్మం దగ్గరే ఆగిపోయింది! వీరుడు ఎంతగొప్పవాడో అతని గుఱ్ఱంకూడా అంతే గొప్పగా అంతే పౌరుషంతో ఉంటుంది. పలనాటి వీరకథలలో అలరాజుగుఱ్ఱం "సవరాల జిమ్మడు", పెద్దన్న బాదరాజు గుఱ్ఱం "కారుబొల్లడు" ఇటువంటి విశిష్టమైన గుఱ్ఱాలే! ఇవి వీరగాథలలో ప్రత్యేక పాత్రను పోషించాయి!

ఆ బిరుదులు తొలగించమని కటియావులరాజు అక్కడనున్న భటులద్వారా బేతాళునికి కబురుచేస్తాడు. అతడు ఏమాత్రమూ అంగీకరించడు. కటియావులరాజుకు కోపం వచ్చి, తన ఎడమకాలితో ఆ బిరుదుల్ని తన్ని నేలకూల్చి, నగరంలోనికి ప్రవేశిస్తాడు. దీనితో బేతాళుడు మండిపడి, పౌరుషం పెరిగి కటియావులరాజును ద్వంద్వయుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఇద్దరూ బేతాళుని కత్తుల గరిడిలో హోరాహోరీగా పోట్లాడుతారు. మొదట బేతాళుడు తన కత్తితో మూడు హస్తాలు చూపుతూ మూడు దెబ్బలు కొడతాడు. ఆ మూడు దెబ్బలూ చాకచక్యంగా తప్పించుకుంటాడు కటియావులరాజు. "నాకు నీలాగ మూడు హస్తాలు చూడడం (మూడుసార్లు attack చేయడం) అవసరంలేదు. ఒకే ఒక్క దెబ్బతో నిన్ను చంపేస్తాను. కాని నిన్ను క్షమిస్తున్నాను. ప్రాణాల మీద తీపి ఉంటే వెళ్ళిపో!" అని ఓరుగల్లు ప్రజలందరి ముందు ప్రకటిస్తాడు కటియావులరాజు. అహంకారియైన బేతాళుడు అతని క్షమాభిక్షను అంగీకరించడు. అందువల్ల కటియావులరాజు విధిలేక అతనిని చంపుతాడు. బేతాళుని తమ్ములు "కన్నమాధీరుడు" – "రంపాల కేశవుడు" కూడా కటియావులరాజును ఎదిరించి చనిపోతారు.

ఈ ''కలియుగ బేతాళుడు'' ప్రతాపరుద్రుని సేనానియైన "బేతాళరెడ్డి". అతనిని చంపినందులకు ప్రతాపరుద్రునికి కోపం వస్తుంది. అతడు అయితమరాజును మాయోపాయంతో చంపాలని చూస్తాడు. అలుగుల సింహాసనంమీద కూర్చోమంటాడు; పెంకి గుఱ్ఱాన్ని బహూకరించి స్వారీచేయమంటాడు; విషాన్నంపెట్టి తినమంటాడు. ఈ అన్ని ఆపదల నుండి మంత్రి పల్లికొండ అతనిని కాపాడుతాడు. యాదవులు శంభుని సేవించి తిరిగి వెళ్ళిపోతుంటే ప్రతాపరుద్రుడు వారి మీదికి సైన్యాలను పంపుతాడు. ఆ సేనలను కటియావులరాజు చిత్తుచిత్తుగా ఓడిస్తాడు. యాదవులు క్షేమంగా యలమంచికి చేరుకుంటారు. ఈ వీరగాథ చదువుతూ ఉంటే ఏదో గొప్ప హాలీవుడ్ యుద్ధచిత్రం చూస్తున్న అనుభూతి కలుగుతుంది!

**2) "పుల్లరికథ" లేక "జన్నివాడకథ" :**

దీనికే "కాటమరాజు దక్షిణాది ఆవులమేపు" అనే పేరు కూడా ఉంది. దీనిని ప్రొ॥ సుబ్బారావుగారు 1964లోనే కృష్ణాజిల్లాలో సేకరించి, తమ ''కాటమరాజుకథలు'' రెండవ సంపుటంలో (1978లో) ముద్రించారు. అయితే ఆ కథలో ప్రారంభంలో "ఇష్టదేవతా ప్రార్థన, కవివంశాదికము, పుల్లరి ఒప్పందము" అనే భాగాలు లోపించాయి. ఈ భాగాలు ఉన్న కథ (తాళపత్ర గ్రంథం) డా॥ కనకబండి మోహనరావుగారికి 1991లో లభించింది. దీనిని బట్టి కవి పేరు "కనకబండి గట్టయ్య (ఘట్టయ్య)" (ఇది "గంటయ్య" అని కూడా కావచ్చును.) ఈ కథలో పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. "నీరుకు పుట్టిన పూరెల్లమాది/ఆవుకు పుట్టిన కోడెల్లమీది" అనే పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. యాదవులు అమాయకులు కదా అని నెల్లూరిరాజు నల్లసిద్ధి వేలాది వరహాలను పుల్లరిగా ఇవ్వాలని ఈ ఒప్పందంలో చేరుస్తాడు. నల్లసిద్ధి రెండవ భార్య కుందమాదేవి బోయలచేత కాటమరాజు ఆలమందలను పొడిపిస్తుంది. దీనితో కోపించిన కాటమరాజు నెల్లూరు వరిచేలను మేపించి, పుల్లరినీయక, ఎఱ్ఱగడ్డపాడుకు వెళ్ళిపోతాడు. తనకు జరిగిన


ఆవుల నష్టానికి, నెల్లూరిరాజుకు ఈయవలసిన పుల్లరికి సరిపోయింది అంటాడు. దీనితో ఇద్దరికీ మధ్య యుద్ధం వస్తుంది.

**3) "బొంగరాల కథ" :**

ప్రొ॥ సుబ్బారావుగారు ఈ కథకు సంబంధించిన మూడు తాళపత్ర గ్రంథాలను 1966లో సేకరించి, తమ "కాటమరాజు కథలు" – రెండవ సంపుటం (1978)లో ముద్రించారు. కాని యివి అసమగ్రంగా ఉన్నాయి. శ్రీ మట్టి గురవయ్యగారు 2014లో సేకరించి యిచ్చిన తాళపత్ర గ్రంథంలో కథ సమగ్రంగా ఉంది. దీని రచయిత "గొట్టిపాటి మల్లయ్య" అని గ్రంథావతారికను బట్టి తెలుస్తోంది. ధనముకొండలో బాలరాజులైన ముమ్మయ్య – పోచయ్యలు బొంగరాలాడటం, ఆ బొంగరం వెళ్ళి కోమటి అచ్చమ్మకాలికి తగలడం, ఆమె వారిని దూషించడం, దానిని బట్టి అయితమ రాజాదులు ఎఱ్ఱగడ్డపాటి రణభూమికి వెళ్ళారని బాలరాజులు తెలుసుకోవడం, తమను కూడా యుద్ధానికి పంపుమని సిరిదేవిని కోరడం, ఆమె ఎంతో కష్టంమీద అంగీకరించడం, బాలరాజులు పాలేటికి పయనమైపోతూ వుంటే వివిధ శకునములు కావడం, ఆ శకున ఫలితాలను ముమ్మయ్య అడుగుతూ ఉంటే – పోచయ్య వివరించడం – అనే ఘట్టంలో మధ్యలో ఆగిపోతుంది సుబ్బారావు గారు సేకరించిన "వేడుక బొంగరాల కథ". శ్రీ మట్టి గురవయ్యగారు సేకరించిన "బొంగరాల కథ" ఇంకా ముందుకు సాగి, బాలరాజులు ఎఱ్ఱగడ్డపాడులో ఉన్న కాటమరాజును కలుసుకోవడం, పల్లికొండ పోలురాజుకథను వివరించి చెప్పడం, పంచలింగాల కొండమీద ఉన్న వీరశిలలను పూజించడం, అవి పలకడం, ఉత్పాతాలు పుట్టడం, యాదవులు యుద్ధసన్నద్ధులు కావడంతో ఈ కథ ముగుస్తుంది. ఈ ముమ్మయ్య – పోచయ్యల "బొంగరాల కథ", శ్రీనాథుడు రచించిన "బాలచంద్రుని యుద్ధం"లోని "బొంగరాల కథ"కు పూర్తి అనుకరణ మనుట స్పష్టము.

**4) "పాపనూక వలపోత" :**

ప్రొ॥ తంగిరాలగారికి "పాపనూక కథ" లభించింది కాని ఆమె "వలపోతకథ" లభించలేదు. దీనిని ఆంధ్ర విశ్వవిద్యాలయం నివృత్త తెలుగు ఆచార్యులు ప్రొ॥ ఎం. జయదేవ్‌గారు 2010 ప్రాంతంలో విజయనగరంజిల్లా గజపతినగరంలో పొడపోతులవారి దగ్గరనుండి సేకరించారు. పాపనూక, కథా నాయకుడైన కాటమరాజుకు చెల్లెలు. ఈమె దుష్టనక్షత్రంలో పుట్టిందనే భయంతో, జ్యోతిషులు చెప్పిన ప్రకారం, ఆమెకు పెళ్ళిచేయకుండా, ధనుమకొండ ఊరిబయట ఏడంతస్తుల ఒంటిస్తంభంమేడ కట్టించి, అందులో ఉంచుతారు. అలా ఆరునెలలు గడుస్తాయి. అప్పుడు ఎఱ్ఱగడ్డపాటి పోట్లాటలో యాదవులందరూ వీరస్వర్గమలంకరించారనే వార్త, కాశిలో ఉన్న భక్తిరన్నకు తెలిసి, అతడు ధనముకొండకు వస్తాడు. తల్లి సిరిదేవి అంతఃపురంలో పాపనూక కనిపించదు. తల్లిని ప్రశ్నిస్తాడు. ఆమె



ముఖం వెలవెలపోతుంది. అప్పుడు పల్లికొండ భార్య "పందుముల ఎరినప్ప" పాపనూక దుష్ట నక్షత్రంలో పుట్టడంవల్ల ఊరిబయట ఏడంతరాల మేడలో ఉంచిన సంగతి చెపుతుంది. భక్తిరన్న తల్లి చేసిన పనికి మిక్కిలి దుఃఖించి, పాపనూకను తీసికొని రమ్మని "ఎరినప్ప"ను, పద్మరాఘవుని భార్య "పైడిఎల్లప్ప"ను, పాపనూక చెలికత్తెలను ఊరిబయట మేడ దగ్గరకు పంపుతాడు. ఎరినప్ప ఎంత నచ్చచెప్పినా పాపనూక రాదు. తన బాధనంతా వెళ్ళగ్రక్కుతుంది. కల్యాణనగరంలో కలబోతులవారింట (పెందోట ముద్దమ్మ దగ్గర) హాయిగా ఉన్న తనను తీసికొనివచ్చి, యిలా ఊరిబయట ఉంచినందుకు భక్తిరన్న మీద మిక్కిలిగా కోపిస్తుంది. పెద్దిరాజు యుద్ధంలో మరణించడం, తల్లి పెద్దమ్మ సహగమనం చేయడం వివరంగా చెపుతుంది. పాపనూక మేడదిగిరాదన్న విషయం తన దివ్యదృష్టితో గ్రహించిన భక్తిరన్న ధనముకొండతోపాటు పాపనూక మేడకూడ అగ్నిపాలు కావాలని శపించి, విభూతి మంత్రించి చల్లి పాలేటికి వెళ్ళిపోతాడు. ఎరినప్ప, ఇతరస్త్రీలు పాపనూకతో మాట్లాడుతూ ఉండగానే, ఆ ఒంటిస్తంభం మేడకు అగ్నిముట్టుకొని యాదవకాంతలందరూ మంటలకు ఆహుతి అయిపోతారు. ఊరంతా కాలిపోతుంది.

ఈ విధంగా నాలుగు నూతన వీరగాథలను సేకరించి, సుమారు రెండులక్షల రూపాయలు వెచ్చించి అందంగా ముద్రించిన ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావుగారిని మనసారా అభినందిస్తున్నాను. ఇంకా సేకరించవలసిన ఆరుకథలనుగురించి వారు ఈ గ్రంథం చివర ఒక ప్రకటన కూడా చేశారు. అవి: "సింహాద్రిరాజుకథ" – "నలనూకరాజుకథ" – "భైరవకురవ యుద్ధం" – "అగుమంచి వలపోత" – "పల్లికొండ పుట్టుక" – "గంగపుట్టుక". వీటిని ఎవరైనా సేకరించి పంపితే, తాను ముద్రిస్తానని వాగ్దానం చేస్తున్నారు ఆచార్య తంగిరాలవారు. వీటిని సేకరించడంకోసం యువపరిశోధకులు నడుములు బిగించాలి!

(**వివరాలు :** కాటమరాజు కథలు – మూడవ సంపుటం, ప్రధాన సంపాదకులు: ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు, పుటలు : lxxiv +330, వెల : రూ. 400/-, ప్రాప్తిస్థానం : ప్రముఖ పుస్తక కేంద్రాలు)

# తెలుగు తాత్త్విక గేయాలు - ఉపనిషత్తుల ప్రభావం

**పి. శ్రీధర్‌రెడ్డి** , తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : **9949998788**

**తాత్త్విక గేయాలు**

భారతీయ ఆధ్యాత్మిక వారసత్వం కారణంగా సాధారణ ప్రజల్లో కూడా తాత్త్విక చింతన ప్రవేశించింది. ఆత్మజ్ఞానానికి సంబంధించిన ఆధ్యాత్మిక గేయాలే తాత్త్విక గేయాలు. తాత్త్వికత జనజీవనంలో, విశ్వాసంలో ఒక భాగంగా మారింది. మానవుని నిజతత్త్వాన్ని, జీవిత ప్రయోజనాన్ని తెల్పే కర్మ, భక్తి, జ్ఞాన, యోగ మార్గాలను భారతీయులు విశ్వసిస్తారు. ఈ విశ్వాసాలు, ఈ ప్రయోజనాలు మరియు మానవ సహజాసక్తి కారణంగా తాత్త్విక గేయ సాహిత్యావిర్భావం జరిగింది.

ఆంధ్రదేశమంతటా ఈ తాత్త్విక గేయాలు ఈనాటికి వినిపిస్తున్నాయి. గుడి గోపురాల దగ్గర, మఠ మందిరాల దగ్గరే కాక జనజీవనంలో కూడా ఇవి ఇంకా వినిపిస్తున్నాయి. సన్యాసులు, భిక్షుకులు, ఇతరులు పాడుతూనే వున్నారు.

**తాత్త్విక గేయాలు - వస్తుతత్త్వం**

ఈ గేయాలను అనేక రకాలుగా విభజించవచ్చు. అయితే ప్రధానంగా రెండురకాలుగా పేర్కొనవచ్చు. అవి :

1. కథా రహితాలు 2. కథా సహితాలు

పై విభజనలో మొదటిదైన కథా రహిత గేయాలను వస్తు తత్త్వాన్ని బట్టి 9 విధాలుగా విభజించవచ్చు.

1. కర్మతత్త్వ గీతాలు 2. భక్తి తత్త్వ గీతాలు 3. ఆధ్యాత్మిక తత్త్వ గీతాలు 4. వైరాగ్య తత్త్వ గీతాలు 5. యోగ తత్త్వ గీతాలు 6. మార్మిక తత్త్వ గీతాలు 7. కాలజ్ఞాన తత్త్వ గీతాలు 8. వేదాంత ప్రబోధాత్మక గీతాలు 9.సంస్కరణ తత్త్వ గీతాలు.

1.కర్మతత్త్వ గీతాల్లో వ్రతాలు, జాతరలు, పూజలు, మొక్కుబడులు, ప్రారబ్ధ కర్మతత్త్వాలు పరిశీలించే అవకాశముంది. 2. భక్తి గీతాల్లో శైవ, వైష్ణవ, శాక్తేయ, గురు, భజన, మేలుకొలుపులు, మంగళ హారతులు కనిపిస్తున్నాయి. 3. ఆధ్యాత్మిక గీతాల్లో జ్ఞాన, ఆత్మానుభవ, ఓంకారతత్త్వ, మాయావాద, హరిహరాద్వైత, సంవాదాత్మక గేయాలు కనిపిస్తాయి. 4. వైరాగ్య గీతాల్లో దేహ, సాంసారిక వైరాగ్య గీతాలున్నాయి. 5. యోగ గీతాల్లో రాజ, హఠ, సాంఖ్య, కుండలినీ యోగగీతాలున్నాయి. 6. మార్మిక గీతాల్లో ప్రతీకాత్మక, సంఖ్యాపూరణ, పొడుపుకథా, రూపక, అస్పష్ట గీతాలున్నాయి. 7. కాలజ్ఞాన తత్త్వ గీతాల్లో భవిష్యత్తు సంబంధ గీతాలున్నాయి. 8. వేదాంత ప్రబోధాత్మక తత్త్వాల్లో మానవ, జీవ, ప్రజా, స్త్రీ ధర్మ ప్రబోధాత్మక గేయాలెన్నో ఉన్నాయి. 9. సంస్కరణ తత్త్వాల్లో మూఢ విశ్వాస, నిరసన, విగ్రహారాధన నిరసన, కులమత నిరసన, కర్మకాండ నిరసన, కాపట్య నిరసన తదితరాంశాలకు సంబంధించిన గీతాలెన్నో తెలుగులో కన్పిస్తున్నాయి.

ఈ తాత్త్విక గీతాలలో మానవానుభూతి, మానవుడి నిజ స్వరూపం, చైతన్యం యొక్క చాలకశక్తి, భీతి రహిత సందేశం, జీవితాన్ని సంభాళించుకోవడం, విద్య, పనియే ఆరాధన, ఆత్మ సాక్షాత్కారం, బ్రహ్మవిద్య, ఆత్మాన్వేషణం, బ్రహ్మ సాక్షాత్కారం, యోగం అన్న భావాలు వినిపిస్తాయి.

**ఉపనిషత్తులు**

సనాతన ధర్మానికి మూలకందాలైన వేదాల్లో ఉపనిషత్తులు సారభూతమైనవి. ఉపనిషత్ అనే పదం 'ఉప – నిషత్' అంటే ఒకరి వద్ద కూర్చొను అనే అర్థం నుండి తీసుకోబడింది. గురువు వద్ద లేదా ఉపాధ్యాయుని వద్ద విద్యార్థులు కూర్చొని చదువు నేర్చుకోవటాన్ని ఈ పదం సూచిస్తుంది. కొంతకాలం తరువాత ఈ పదానికి వున్న అర్థం మారిపోయింది. కొన్ని సందర్భాల్లో విద్యార్థికి ఒక సిద్ధాంతాన్ని గాని ఒక రహస్య అంశాన్ని గాని బోధించటం అనే ప్రత్యేక అర్థం ఈ పదానికి ఏర్పడింది. యిలాంటి సిద్ధాంతాలను కలిగి వున్న పాఠ్యాలకు ఉపనిషత్ అనే పదం అన్వయించబడి చివరికి రూఢి అయిపోయింది. ఉపనిషత్తులన్నీ సాధారణంగా "వేదాంత" (వేదాలకు చివరి భాగం) అని పిలువబడతాయి. వేదయుగానికి చివర ఈ ఉపనిషత్తులు రావడం ఒక కారణం కావచ్చు. వేదయుగానికి తరువాత వచ్చిన తత్త్వవేత్తలు వీటిలో వేదాల అంతిమ లక్ష్యాన్ని కనుగొనడం వల్ల కావచ్చు, వీటికి వేదాంత అనే పేరు సార్థకమై వుంటుంది.

ఈ ఉపనిషత్తులన్నీ తత్త్వ సంబంధమైన పాఠ్యాలు. యిందులో చాలా రకాల అంశాలు చర్చించబడి వున్నాయి. అవి విశ్వాత్మ, పరమ భావన, వ్యక్తి ఆత్మ, ప్రపంచం పుట్టుక, ప్రకృతి రహస్యాలు మొదలైనవి ఎన్నో వున్నాయి. వేదయుగంలో పుట్టస్థాయినందుకున్న భారతీయ ఆలోచన సరళికి యిది ఒక మచ్చుతునక. అరణ్యాకాలలో తలెత్తిన బలి వ్యతిరేకత వీటిలో విశ్వరూపాన్ని తొల్చటం, గమనార్హం. మతపరమైన తంతుల్ని, కర్మకాండలని ఇవి వ్యతిరేకించాయి.

ఉపనిషత్తులు 108 ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి 12. అవి 1. ఐతరేయ 2. కౌశీతక 3. ఛాందోగ్య 4. కేన 5. బృహదారణ్యక 6. తైత్తిరీయ 7. కఠ 8. శ్వేతాశ్వతర 9. ఈశ 10. ముండక 11. ప్రశ్న, 12. మాండూక్య. ఇందులో 1,2 ఋగ్వేద సంబంధమైనవి. 3,4 సామవేదానికి సంబంధించినవి. 5 నుంచి 9 యజుర్వేదానికి సంబంధించినవి. 10 నుండి 12 అథర్వ వేదానికి సంబంధించినవి.

శంకరాచార్యులు (క్రీ.శ. 788 – 820) భాష్యాలు వ్రాయడానికి ఎన్నుకొన్నవి పది ఉపనిషత్తులు. వాటిని పేర్కొనే సంప్రదాయక్రమం ఇలా ఉన్నది. ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండుక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యకాలు. శ్వేతాశ్వతర అనే మరొక ఉపనిషత్తుకు కూడ భాష్యం వ్రాసారని కొందరి అభిప్రాయం.

ఉపనిషత్తుల ప్రకారం జ్ఞానం రెండు విధాలు. 1. సాధారణస్థాయి జ్ఞానం 2. ఉత్తమస్థాయి జ్ఞానం. అవినాశుడైన బ్రహ్మం గురించి మనకు తెలియజేస్తుంది. సాధారణస్థాయి జ్ఞానం 4 వేదాల నుండి వేదాంగాలనుండి గ్రహింపబడేది. ఉపనిషత్తుల ప్రకారం దేవుడు, ఆత్మ మౌలికంగా అభిన్నమైనది. వీటిమధ్య తేడాలున్నాయి. కానీ అనివార్యమైన ఏకత కూడా ఉంది. అన్నిటికన్నా ఉన్నతమైంది 'బ్రహ్మన్'. వ్యక్తిగత ఆత్మ 'ఆత్మన్'. వీటి గురించి, వీటి అభిన్నత గురించి వివరణ వుంది. అదే 'తత్ త్వమ్ అసి' ఈ ప్రపంచాన్ని పరిత్యాగం చేయడం, జగదీశ్వరున్ని తెలుసుకోవడం, ముక్తిని సాధించటం జీవిత లక్ష్యాలు.

భారతీయ ఆలోచన సరళినీ, తత్త్వశాస్త్రాన్నీ ఉపనిషత్తులు బాగా ప్రభావితం చేశాయి. భారతదేశంలో అన్ని మతాలు, తాత్త్విక వ్యవస్థలు వారసత్వంగా, సంప్రదాయబద్ధంగా, సంప్రదాయేతరంగా రక రకాలుగా ఉపనిషత్తులోంచే వూపిరి పోసుకున్నాయి. ఇందుకు తెలుగు తాత్త్విక గేయాలు మినహాయింపేమీ కాదు.

**గేయాలు – ఉపనిషత్తుల ప్రభావం**

ఈ గేయ ప్రపంచంలోకి వెడితే అంతులేనిదన్న భావన కల్గుతుంది. అర్థమైంది అణుమాత్రమే అనిపిస్తుంది. భావంలోనూ, బాణీలోను, భాషలోనూ తెలుగు తాత్త్విక గేయాలు విశిష్టమైనవి. అలాగే వీటిపై ఉపనిషత్తుల ప్రభావం విస్మరించలేనిది. మచ్చుకు

**"దేవుడు తనలో దండిగ నుండగ**
**తెలియదు మానవ పశువులకు**
**సంశయముడుగక సద్గతి మేరకు**
**సర్వము తానని తెలియవలెను**
**సర్వము తానని తెలిసేందుకు**
**గురూపదేశము కలుగవలెన్**
**గురూపదేశం కలిగేటందుకు**
**నిలకడగా మది నిలుపవలెన్"**

**(జానపద పారమార్థిక గేయాలు, పుట.101)**

పై గురుభక్తి గేయంపై ఉపనిషత్తుల ప్రభావం సుస్పష్టం. ఉప నిషత్తుల దృష్టిలో విద్య అంటే (తనను తాను తెలిసికోవటం), స్పష్టమైన దృక్పథం, చిత్తశుద్ధి, సర్వము తానని తెలుసుకోవటం. పై గేయ మూలం కఠోపనిషత్తులో రెండవ అధ్యాయం, ఏడవ మంత్రంలో తన శిష్యుడు నచికేతునికి యముడు చెప్పే సందర్భంలో కన్పిస్తుంది.

**"శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః**
**శృణ్వంతోపి బహవో యం న విదుః ।**
**ఆశ్చర్యో వక్తా కుశలోస్య లబ్ధా**
**ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥"**

(దీనిని వినే భాగ్యం, అర్థం చేసుకొనే భాగ్యం బాలామందికి తెలియదు. దీనిని నేర్చుకొనేవాడు కడు నేర్పరి. నేర్పరి అయిన గురువు వద్ద నేర్చుకొని దీనిని గ్రహించినవాడు ఆశ్చర్యం గొలుపు తాడు.)

**"న నరేణా వరేణ ప్రోక్త ఏష**
**సువిజ్ఞేయో బహుధా చింత్యమానః ।**
**అన్యన్య ప్రోక్తే గతిరత్ర నాస్తి**
**అణీయాన్ హ్యతర్క్యం అణు ప్రమాణాత్ ॥"**

'అల్పుడు నేర్పిస్తే ఎన్ని విధాల ఆలోచించినా పట్టుపడదు. అనన్యత్వాన్ని సాక్షాత్కరించుకొన్నవాడు నేర్పితే తప్ప గత్యంతరం లేదు. ఇది అణువు కన్న సూక్ష్మతరం. ఇది తర్కానికి పట్టుబడదు.

పై తత్త్వ గేయంలో పేర్కొన్న ముఖ్యమైన 3 అంశాలు 1. సర్వము తానని తెల్సుకోవటం 2. అందుకు గురూపదేశము కలుగటం 3. అందుకు నిలకడ యది కావలనే భావనలు ఉపనిషత్తు ప్రబోధమే.

క్రింది తాత్త్విక గేయాలను ఉపనిషత్తుల నేపథ్యంతో పరిశీలిస్తే సత్యం సుస్పష్టమౌతుంది.

**"గురువు లేని బాట జూట**
**గురు కీలకమెరుగుట బాటా**
**గురులను ఎరుగుట జూట**
**గురు పాదము లెరుగుట బాటా"**

అనే కాలజ్ఞాన తత్త్వంలోనూ

**"ఎంతో మరుగై యున్నది సద్గురు బోధ**
**చింతలేమియు లేనిది**
**అంత యింతని ఎంచుటకు దీని**
**అందు తెలియదు కొంతమందికి**
**సంతతము సద్గురుని పాదము**
**చెంత జేరిన అంతరాత్మాత్ములకు తప్ప..."**

అన్న గేయాలలో ప్రభావం బింబ ప్రతిబింబ సాదృశ్యం లాగా గోచరమౌతుంది.

**"ఎక్కడ జూచిన బ్రహ్మమయంబని చక్కగ ఎరుగు సుజ్ఞాని**
**అక్కరబడి ఏమన్న గురుజేరక కుక్కయి దిరుగును అజ్ఞాని**
**వాద బేధములు అణచి సద్గురు పాదము జేరును సుజ్ఞాని**
**మీద నున్న ఘనజ్యోతెరుగక వాగే విధము గోరును అజ్ఞాని"**

అజ్ఞానమో, సుజ్ఞానమో, ఏ మార్గం గొప్పదో వివరించే గేయాలు ఉపనిషత్తుల ప్రభావం నుండి ఆవిర్భవించినవే.

జీవాత్మ పరమాత్మని తెలుసుకోవటమే తత్త్వం. ఈ తత్త్వమే తాత్త్విక గేయాల్లోని “ఎఱుక”. ఎఱుక అంటే జ్ఞానమే. జ్ఞానమంటే తత్త్వమే. ఆ తత్త్వం తెలియాలి. తెలిసి వ్యవహరిస్తే “ఎఱుక”. ఇందుకు

**“గురు వుపదేశంబైనందున దుర్గుణములు మానిందెఱుక**
**మరువక సద్గురు మంత్రము లోపల మర్మము దెలిసిందెఱుక”**
**తారబ్రహ్మము తనలోనుండే దారి తెలిసిదెఱుకా**
**వారకాంతలను జూచి, తల్లిగా వర్తన చేసిందెఱుకా...”**

ఇలాంటి ఉపనిషత్తుల ప్రభావం గల తాత్త్విక గేయాలెన్నో తెలుగులో ఉన్నాయి. ఇట్టి తాత్త్విక గేయాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినప్పుడు ఉపనిషత్తుల సందేశం, ప్రభావం వ్యక్తం కావడమే కాక, మానవుడి నిజస్వరూపం, నిజమైన ఆధ్యాత్మికత, ఆత్మ సాక్షాత్కార ఫలం, బ్రహ్మసాక్షాత్కారం, జ్ఞానం నుండి విజ్ఞానం వైపు అనే భావన అవగతమవుతుంది. భారతీయమైన లోతైన జ్ఞానాన్ని సాధారణమైన భాషలో, లోకానికి వ్యక్తం చేసిన విధానం అర్థమౌతుంది.

# కాలం వెంటే మనిషి

అలసటెరుగని కాల ప్రవాహంలో
మనిషి నీటి బిందువు
యుగాలెన్ని మారినా
కాలంతోటే ముడిపడి ఉంటుంది
కాలం, అన్నిటికంటె
శక్తివంతమైంది
ఎవరినీ తన
కనుచూపు నుండి మరల నివ్వదు
కాలంలో ఇమిడిపోవడమే
మానవ జీవన సనాతన ధర్మం

అమాయకులు కొందరు
కాలాన్ని జయించామని
భ్రమల వలయంలో తిరుగుతూ ఉంటారు
కాలం తిరుగబడితే
రూపమే లేకుండా పోతారు
కెరటం తీరాన్ని తాకి
వెను తిరుగుతుంది
కాలంలో ఉదయ సంధ్యలు మెరిసినట్లే
మనిషి జీవితాన్ని
కష్టసుఖాల కెరటాలు తాకుతాయి
తాకానని ఒడ్డెక్కి కూర్చోవు
తిరిగెళ్ళి కాలంలో కలిసిపోతాయి



కాలానికీ మనిషికీ
యుగయుగాల అనుబంధం
కాలానికి ఎదురీదాలనుకోవటం
వట్టి భ్రమే అవుతుంది
ఎంత మొండివాడైనా సరే
సందర్భానుసారంగా
తనలోకి పరకాయ ప్రవేశం చేయించి
మనిషిని, అనుగుణంగా మార్చుకొంటుంది

కాలం, నిరంతర చలనశీలి
ఆగిపోవడ మెరుగని ధర్మచక్రం
భూత, వర్తమాన, భవిష్యత్తుల కలయిక
తెలివైనవాడు కాలచక్రంలో
జరిగే పరిణామాలను గమనిస్తాడు
మనసు కంటిన మలినాలను కడిగేసి
కాలంతో అడుగులు జత కలిపి
మంచి ముత్యమల్లె మెరుస్తాడు
కాలరేఖలో తనొక
వెలుగు చుక్కలా మిగులుతాడు.

**ఎస్. ఆర్. పృథ్వి**
రాజమండ్రి, ఫోన్ : 998 922 3245

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు -
సామాజిక అవలోకనం - 17

# ప్రేమబంధం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

'కె.విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం' నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం 'ప్రేమబంధం'. ఈ చిత్రం రెండు గంటల 25 నిమిషాల నిడివితో రూపొందించబడింది. శోభన్‌బాబు, వాణిశ్రీ, జయప్రదలు ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం.

**చిత్ర కథ సంక్షిప్తంగా :**

కృష్ణమోహన్ (శోభన్‌బాబు) మంచి చదువు చదివి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూ వుంటాడు. కృష్ణమోహన్ అన్న శేషావతారం (సత్యనారాయణ) చిన్న స్థాయి చెట్టుకింద ప్లీడరుగా జీవనం సాగించే వ్యక్తి. కృష్ణమోహన్‌కు అన్న – వదిన (షావుకారు జానకి)లు అంటే తల్లిదండ్రుల స్థాయి గౌరవం ప్రేమ. కృష్ణమోహన్‌ను పెద్ద ఉద్యోగంలో చూడాలనేది వదిన కోరిక. దానిలో భాగంగా కృష్ణమోహన్ ఏ చిన్నా, చితకా ఉద్యోగం చేసినా అతడిని వదిన వ్యతిరేకిస్తూ ఉంటుంది. కృష్ణమోహన్ వదినకు తెలియకుండా అన్న సహకారంతో చిన్న స్థాయి ఉద్యోగాలు చేస్తూ వుంటాడు.

గీత (వాణిశ్రీ), పద్మ (జయప్రద)లు అక్కాచెల్లెళ్ళు. ఇద్దరూ పల్లె వదిలి పట్నం వచ్చి చదువుకుంటూ జీవితంలో ఎదగాలనే కోరికతో కష్టపడుతూ ఉంటారు. గీత తన చెల్లి పద్మను మంచి చదువులు చదివించి ఉద్యోగంలో చేర్పించడానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది. దానికై గీత చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ ఉంటుంది. పద్మ స్నేహితురాలు మాలిని. మాలిని బావ రాజశేఖరం (దేవదాస్ కనకాల). రాజశేఖరం సీతాపతిరావు (రావుగోపాలరావు) అనే సంపన్నుడి కుమారుడు. అయిననూ రాజశేఖరం చాలా సాదాసీదాగా ఉంటూ తను మంచివాడిని అని అందరిని నమ్మిస్తూ ఉంటాడు.

గీత కాస్మెటిక్ మార్కెటింగ్ చేసే ఉద్యోగినిగా పనిచేస్తూ ఉంటుంది. కృష్ణమోహన్ కూడా మార్కెటింగ్‌కు సంబంధించిన ఉద్యోగమే చేస్తూ ఉంటాడు వదినకు తెలియకుండా అన్న సహకారంతో. అదే సందర్భంలో గీత కృష్ణమోహన్‌ల పరిచయం మొదలవుతుంది. వారి పరిచయం కొన్నాళ్లలోనే బలమైన ప్రేమబంధంగా మలుపు తిరుగుతుంది.

మాలిని ద్వారా పద్మతో రాజశేఖరానికి పరిచయం ఏర్పడుతుంది. రాజశేఖరం వ్యక్తిత్వాన్ని తెలుసుకున్న పద్మ తన అక్కకు అతడితో వివాహం జరిగితే బావుంటుందని భావిస్తుంది. ఒక రోజు రాజశేఖరం పద్మను తన ఇంటికి ఆహ్వానిస్తాడు. పద్మ అతడి ఆహ్వానాన్ని అంగీకరించి రాజశేఖరం ఇంటికి వెళ్తుంది. రాజశేఖరం ఆమెకు తాగడానికి మత్తుమందు కలిపిన పాలు ఇస్తాడు. పద్మ ఆ పాలు తాగి మత్తులోకి జారుకుంటుంది. ఆ తర్వాత రాజశేఖరం ఆమెను



అనుభవిస్తాడు. అనుకోకుండా రాజశేఖరం ఇంటికి వచ్చిన కృష్ణమోహన్‌కు పద్మను తీసుకెళ్లి ఆమె ఇంటి వద్ద దిగబెట్టాల్సిన అవసరం ఏర్పడుతుంది. పద్మను దిగబెట్టే సమయంలో ఆమె గీత చెల్లెలే అనే విషయం కృష్ణమోహన్‌కు తెలుస్తుంది. ఆ సమయంలో పద్మకు జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకున్న కృష్ణమోహన్ ఆమెను కాపాడాలని నిర్ణయించుకుంటాడు. రాజశేఖరాన్ని మందలించి పద్మను వివాహం చేసుకునేలా ఒప్పిస్తాడు.

రాజశేఖరం పద్మ విషయంలో చేసిన తప్పును తండ్రి సీతాపతిరావు వద్ద ప్రస్తావిస్తాడు. సీతాపతిరావుది తేనెపూసిన కత్తి వంటి వ్యక్తిత్వం. కొడుకు చేసిన తప్పుకు అతన్ని మందలించకుండా ఆ పెళ్ళి కన్నా ముందే అతన్ని విదేశాలకు పంపడానికి పథకం వేసి అమలు చేస్తాడు. గీత తన చెల్లి పద్మను తీసుకొని రాజశేఖరం ఇంటికి వెళ్తుంది. అక్కడ సీతాపతిరావు గీతతో తన కుమారుడు విదేశాలకు వెళ్ళాడు. వాడు ఇక్కడుంటే ఖచ్చితంగా పెళ్ళి చేసేవాడిని అంటూ మొసలికన్నీరు కారుస్తాడు. కాని గీత, పద్మలు ఆయన సమాధానాన్ని వ్యతిరేకిస్తారు. వాళ్ల కోపాన్ని తగ్గించడానికి సీతాపతిరావు మిమ్మల్ని మీ తల్లిదండ్రుల వద్ద మాట్లాడి నేను మీ పెళ్ళికి సహాయం చేస్తానని చెప్తాడు. దానికై గీత, పద్మలను తీసుకొని వాళ్ల తల్లిదండ్రుల వద్దకు బయల్దేరుతాడు. కాని రైల్లో వెళ్తున్నప్పుడు ఒక మంచి సమయం చూసుకొని పద్మను రైల్లోనుండి నెట్టేసి చంపే ప్రయత్నం చేయబోతాడు. గీత సరైన సందర్భంలో స్పందించి తన చెల్లిని కాపాడుకునే ప్రయత్నంలో సీతాపతిరావుపై దాడి చేస్తుంది. ఆ దాడిలో అతడు మరణిస్తాడు. దానికి గానూ గీత జైలు పాలవుతుంది. అదే సమయానికి కృష్ణమోహన్‌కు జైలర్ ఉద్యోగం

వచ్చి ఉంటుంది. కృష్ణమోహన్‌కు గీత జైలులో తారసపడడంతో షాక్‌కు గురవుతాడు. జరిగిన విషయం తెలుసుకుంటాడు. గీత చెల్లిని గతంలోనే కాపాడాలనుకున్న కృష్ణమోహన్ పద్మను తీసుకుని వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్తాడు. కృష్ణమోహన్ పద్మ తల్లిదండ్రులతో ఆమెను ప్రేమ వివాహం చేసుకున్నట్లు అబద్దం చెప్పి ఆమెకు భర్తగా నటిస్తాడు. ముందు వారు వ్యతిరేకించినా పద్మ ప్రేమ వివాహాన్ని నమ్మి అంగీకరిస్తారు. కానీ పెద్దకూతురు గీత చాన్నాళ్లనుండి ఉద్యోగం, ఉద్యోగం అంటూ ఇంటికి రావడం లేదు అంటూ ఆమె తల్లిదండ్రులు తమ బెంగను కృష్ణమోహన్‌తో ప్రస్తావిస్తారు. జైల్లో ఉన్న గీతను గుర్తుతెచ్చుకుని ఆ క్లిష్టపరిస్థితికి బాధపడుతూ గీత, పద్మల తల్లిదండ్రులకు కృష్ణమోహన్ సర్దిచెప్తాడు.

తన తండ్రి మరణించాడనే విషయం తెలిసి పద్మను తను అన్యాయం చేశాను అనే విషయాన్ని అర్థం చేసుకుని తిరిగి స్వదేశానికి వస్తాడు రాజశేఖరం. కాని అతడిలో ఉన్న దుర్లక్షణాలు మాత్రం అలాగే ఉంటాయి. రాజశేఖరం ఇంటికి వచ్చాడనే విషయం తెలుసుకుని కృష్ణమోహన్ అతడిని ఒప్పించి పద్మతో వివాహం జరిపించే ప్రయత్నం చేస్తాడు. తన కళ్లెదుటే జైల్లో వున్న ప్రేయసి గీత పరిస్థితిని చూసి కృష్ణమోహన్ బాధపడుతుంటాడు. ఒకరోజు గీత జైల్లో నుండి తప్పించుకొని రాజశేఖరం ఇంటికి వెళ్ళి అతన్ని చంపే ప్రయత్నం చేస్తుంది. అదే సమయానికి కృష్ణమోహన్ అక్కడకు చేరుకొని ఆమె తప్పును తెలియజేసి తనను పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తాడు. కొన్ని నాటకీయ పరిణామాల మధ్య రాజశేఖరం పద్మను వివాహం చేసుకోవడానికి సిద్దపడ్డాడు. కాని కృష్ణమోహన్ పద్మ గ్రామంలోని ప్రజలందరి చేత రాజశేఖరానికి తను చేసిన తప్పుకు శిక్షను అనుభవించేలా పథకం వేసి అమలుపరుస్తాడు.

రాజశేఖరం పద్మను వివాహం చేసుకోవడం, గీత చేసిన హత్య ఆమె తన ప్రాణాలను కాపాడుకునే క్రమంలో చేసిందే తప్ప హత్యకు పాల్పడలేదని కోర్టు భావించి ఆమె జైలు నుండి తప్పించుకున్న కారణానికి గాను ఆరు నెలల జైలు శిక్ష విధిస్తుంది.

**చిత్ర విశేషాలు :**

కె.విశ్వనాథ్ చిత్రాల్లో విభిన్నత అన్ని పాత్రలకు పాత్ర స్థాయి ప్రాధాన్యత ఉండడం. చిత్రకథను కేవలం కథానాయకుడి కేంద్రంగానే కొనసాగించకుండా కథనాన్ని సాగించే విధానం ఆయన చిత్రాల్లోని విశిష్టత. ఈ చిత్రంలో కూడా కృష్ణమోహన్ పాత్రకే కాక గీత (వాణిశ్రీ), రాజశేఖరం అన్న వదినలు, పద్మ ఇలా ప్రతీ పాత్రకు ఒక ప్రాధాన్యం ఉంటుంది. కృష్ణమోహన్ అన్న వదినల పాత్రలు కుటుంబ అనుబంధాలు, ప్రేమ, ఆప్యాయతలు, చిన్న చిన్న కలహాలు, బాధ్యతను అర్థం చేసుకోవడం వంటి భావోద్వేగాలను కలగలిపిన పాత్రలుగా ఉంటాయి. చిత్రంలో ఒక సన్నివేశం ప్రేక్షకుడికి కుటుంబ అనుబంధాలు ఏ స్థాయిలో ఉండాలి అనే విషయం చెప్పేదిగా ఉంటుంది. ఉద్యోగ నిమిత్తం కృష్ణమోహన్ వేరే ఊరిలో వుంటున్నప్పుడు అతడి పుట్టినరోజు నాడు అన్న వదినలు పరస్పరం ఒకరికి తెలియకుండా ఒకరు అతడి వద్దకు వచ్చి వాళ్లు తెచ్చిన వంటకాలు, బట్టలను కృష్ణమోహన్‌కు ఇస్తూ మీ అన్నయ్య పంపాడు, మీ వదిన పంపింది అంటూ చెప్పే సన్నివేశం ప్రేక్షకుడికి ముచ్చటగొలిపేలా ఉంటుంది.

ఈ చిత్రంలో మరొక విశిష్టమైన పాత్ర సీతాపతిరావు (రావుగోపాలరావు) అతడి పాత్ర ఒకవైపు మంచితనం ప్రదర్శిస్తూనే, మంచిమాటలు మాట్లాడుతూనే, హుందాతనం ప్రదర్శిస్తూనే పూర్తిస్థాయి స్వార్థంతో కూడుకున్న పాత్ర. సీతాపతిరావు పాత్ర పైకి జాలిపడుతున్నట్లు కనబడినా లోపల ఒక కర్కశమైన వ్యక్తిని దాచుకొని ఉండే స్వభావం కలిగిన పాత్ర.

గీత, పద్మలు పట్నం వచ్చి తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఉద్యోగం, చదువును సాగించే పాత్రలు. ఆ కాలానికి ఇలాంటి పాత్రలను చిత్రాల్లో రూపొందించడం అవసరం. కారణం చిత్రం చూసే ప్రేక్షకలోకానికి తమ పిల్లలను కూడా ఆడపిల్లలని ఇంట్లో బంధించకుండా చదువుకునే, ఉద్యోగం చేసుకునే స్వేచ్ఛను ఇవ్వాలి అనే ఒక ఆలోచన కల్గజేయడానికి తోడ్పడుతుంది. కె. విశ్వనాథ్ చిత్రాల్లో బలమైన వ్యక్తిత్వం, ధైర్యం కలిగిన స్త్రీ పాత్రలను తన ప్రతీ చిత్రంలోనూ చూపే ప్రయత్నం చేశారు. ఈ చిత్రంలో గీత (వాణిశ్రీ) పాత్ర అలాంటిదే. ఒకవైపు అక్కగా తన చెల్లిని ప్రగతిలోకి తీసుకురావాలనే ఆలోచన కలదిగా, మరోవైపు తన చెల్లికి అన్యాయం జరిగినప్పుడు చేసే పోరాటం, తన చెల్లిని చంపే ప్రయత్నం చేసిన సీతాపతిరావును ఎదిరించి కాపాడుకోవడం, జైలు నుంచి తప్పించుకొని రాజశేఖరం ఇంటికి వెళ్లి చేసిన అతను అన్యాయానికి చంపే ప్రయత్నం చేయడం ఇలా పలు సన్నివేశాలలో బలమైన వ్యక్తిత్వం గల స్త్రీ పాత్రగా గీత పాత్రను తీర్చిదిద్దాడు.

మొత్తంగా కె. విశ్వనాథ్‌గారి 'ప్రేమ బంధం' చిత్రం చక్కటి కుటుంబ అనుబంధాలను తెలియజేస్తూనే, పైకి చక్కటి వ్యక్తులుగా కనిపిస్తూ అన్యాయానికి, అరాచకాలకు తెగబడే మనుషుల స్వభావాలను అవగతం చేస్తుంది.

| | | |
|---|---|---|
| **చిత్రం:** | | **ప్రేమ బంధం** |
| తారాగణం | : | శోభన్‌బాబు, వాణిశ్రీ, జయప్రద, కైకాల సత్యనారాయణ, రావు గోపాలరావు, షావుకారు జానకి |
| మాటలు | : | గొల్లపూడి మారుతీరావు |
| సంగీతం | : | కె.వి.మహాదేవన్ |
| **దర్శకత్వం** | : | **కె.విశ్వనాథ్** |

కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

రెండవ పాదమున సమాక్షర యతి యున్నది. యతి స్థానములు సమ స్థానమున లేవు. ఐదేసి మాత్ర కొక గణము విరుగుటలేదు. మొదటి పాదమున 15 మాత్రల తరువాతను, రెండవ పాదమున 13 మాత్రల తరువాతను యతి యున్నది. మూడవ గణాద్యక్షరము యతిగా లేదు. ఆద్యంత ప్రాసలు లేవు. మాత్రానియమము మాత్రము కనిపించుచున్నది. ద్విరద గతి రగడ లక్షణమును లేదు. మాత్రల లెక్కను బట్టి చూచిన ప్రతి రచనయు ఏదో ఒక పద్యపాదమునకు సరిపోవును. ఇది ద్విరద గతి రగడ కాదు. వృత్తగంధి కాదు. ఈ పాదాలందలి మాత్రలు విరుగుట లేదు. ఆంధ్ర వాఙ్మయారంభ దశలో వేయబడిన రేనాటి చోళుల శాసనములందీ విధమైన వృత్తగంధి రచనలుండుట విశేషము. అప్పటికే తెలుగు భాష జనసామాన్యమున వ్యాపించి శాసనావస్థమై, గద్యపద్య రచనా విశేష సామర్థ్యమైన భాషగా రూపొందినవి. రేనాటి చోళుల శాసనములందు సీస పద్య పాదములు సైతము మనకు కనిపించును.

7. వక్రంబు వచ్చిన - వార్వారణాసియు / శ్రీవ ర్వ త ం బు వ్రచ్చిన....... ఇందు సీస పద్య లక్షణములు కనిపించుచున్నవి.

8. ప్రభు చోఅరట్టోడి - పరహితుఁడితఁడు... ఇది ద్విపద పాదము

9. కట్టించె కవిక పొం - పట్టంబు హణులుగు - కోనేపల్లి శాసనము .... సీస పాద పూర్వార్థము

10. దేవస్వంబు లంచముగొన్నవాడు / వారణాసి వ్రచ్చిన పాపంబు గొన్నవాఁడు.... ఇవి తేటగీతి పాదములు ఇందు యతి లేదు.

11. పనియు ఱోగొన్నవాడు నిచ్చినవాఁడు
చెడువాడుక్తొచ్చినవాఁడు వెంట

12. దొంగల సానికనుమ శాననమున మహాక్కర యున్నది. మహాక్కరలో ఒక సూర్యగణము, 5 ఇంద్రగణములు, ఒక చంద్ర గణముండును. ప్రాస ఉండును. పంచమ గణాద్యక్షరము యతి స్థానము.

వెంక - యాచోష్జ - మహారాజు - తెంకణాదిత్యుండు
కొమరుర - భీముండు పుసి ఇల్ల - దాష్జునీ - ధర్మ మా -
చంద్రార్క తారకం-బును వార్ది -లుచునుండు

ఇందు గణములు సరిపోవుచున్నవి. కాని ఒకటవ పాదము నందలి చంద్రగణమునొక మాత్ర తక్కువగా నున్నది.

మొదటి పాదమున నాల్గవ గణాద్యక్షరము యతి స్థానముగా నున్నది. ఇది ప్రాసయతి. కాని లక్షణ ప్రకారము 5వ గణాద్యక్షరము. యతి స్థానముగ నుండవలయును.

రెండవ పాదమున యతి ప్రాసలు లేవు. దీనిని మహాక్కఱ యనుట కన్న ఆ పాదములు గల వృత్తగంధి యనుట మంచిది.

చాళుక్య శాసనములందు పద్యములున్నవి.

1. హతక పుత్రక మునియౌ శ్రీ శిలా విశాల విపుల
 -విప్పర్ల శాసనము

ఇది సీసపద్యపాదము వలె నున్నది.

2. బెజ ఇత్త భటరళ నిల్పనదత్త
కడల్దిల ఇశరయ నిల్పిన గుడియం
 - కపిలేశ్వరపుర శాసనము

ఇవి ద్విపద పాదములు. ఇందు యతి ప్రాస లేదు. కడల్దలలోని 'ల్ద'ను తేల్చి పలుకవలెను.

3. "శ్రీ విక్రమాదిత్య - నృపాగ్రతనయుఁడైన
చాళుక్యభీమునకు - శౌచకందర్పునకు
వేగీశ్వరునకు - రణమద్దాన్వయకుల తిల
కుండైన కుసుమాయుధుండు గన్నర బల్ల
హునికి సంప్రాప్తమై నరసమర్థక శ్రీ
మదనభుజవీర్యబల పరాక్రమమున దచ్చి
కణ్ఠియం గట్టి పట్టంబెత్తి ఖడ్గ"

ఇందు ఐదేసి మాత్రలు గల నాల్గేసి గణములున్నవి. ఇవి ద్విపద గతి రగడ పాదములు. మూడు పాదములందు యతి యున్నది. ఆద్యంత ప్రాసములు లేవు.

4. కొఱవి నల్లజెఱియ - కొదుకు పెద్దన్న (న)
రావించినీవు నా ప్రాణ సమాను

ఇవి ద్విపద పాదములు ఇందు యతి సరిపోయినది. ప్రాస మాత్రము లేదు.

5. శ్రీకెల్ల దానయ ఈశుఁడై చేకొని
నిల్చి భీమ సలుకియందనేక
ఇది సీసపాదము - యతి లేదు.

6. దాని నడపక నడ్పి (డిపి) రేనియఋవదివే
లేండ్లు స్వర్గమ్మున నుండగాంత్రు
 -ఏడువాడల పాలెపు శాసనము

ఇది సీసపాదము

పైన పేర్కొనబడినవన్నియు జాతులు. జాతులు మాత్రాగ నిబద్ధములు ఇందలి గణములు పద్యపాద క్రమముగ వచనము లందుండును. కొన్ని యాదృచ్ఛికముగా గణములు, యతులు, పద్యములకు వలె సరిపోయినట్లుండును.

యతి విషయమున ఒక ప్రత్యేకత యున్నది. 'ము' విభక్తిక యతి ప్రథమా విభక్తి ప్రత్యయము. 'ఋ'రూపముతో నుండిన కాలములో నేర్పడినవని తెలియనగును. ఇది నన్నయకు పూర్వముండిన ఒక యతిభేదము.

గుణగ విజయాదిత్యుడు ఛందో గ్రంథమును వ్రాసినట్లు యాప్పిరంగలమేకారికై వలన తెలియుచున్నది.

ఇట్టి యతులు కన్నడాంధ్ర భాషలకు సంబంధించినవి. ప్రాఙ్నన్నయ యుగముననే ఇవి యున్నవి. ఇప్పుడవి లేవు.

అమహద్వాచకముల ప్రథమైక వచనముల చివర ము, మ్ము ప్రత్యయములున్నవి. ఇవి ప్రాచీన కాలములో బిందు రహితముగా 'ఋ' రూపమున నుండెను. వనఋ, సిద్ధాయము, మఠఋ, నాగఋ మున్నగునవి శాసనస్థములు.

'ఋ' క్రమముగా ంఋ, మ్ము, ముగా మారినది.

ఋతో కూడిన రూపములు మహా భారతమునందును, ఆ తరువాత గ్రంథములందును లేవు.

## మూసీ పదవినోదం - 32

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 2 అ | 3 మే | జా | ను | X | 7 ప్ర | థ | 1 మ |
| 3 డి | డి | టి | X | 8 వూ | సం | X | న్ను |
| గి | పం | X | 9 స్తో | య | గ | నా | తి |
| 4 న | డు | 6 మం | త | ర | ము | X | న్న |
| లే | X | 10 గ | మి | X | X | 17 పా | పా |
| 5 ద | 12 వ | డ | శు | ద్ధి | 15 చే | యు | ము |
| 11 ను | ల | X | 14 ఇ | క | చా | లు | ను |
| 13 ట | కు | ట | X | 16 వూ | పు | చు | క్క |

పు, ఫు, ఋ, భులకు విభక్తి 'ము'తో యతి చెల్లును. ఇది ము విభక్తిక యతి – ముకార యతియునై యున్నది. కావున పదమధ్య ముకారమునకు పు, ఫు, ఋ, భులకు యతి చెల్లును. ఇట్టి యతి నన్నయ గారు వాడలేదు కాని తరువాత వ్యాప్తిలోనికి వచ్చినది.

ముకారమునకు పు, ఫు, ఋ, భులతో యతి చెల్లుటకు కారణము అంతకు పూర్వమవి 'ఋ' రూపమును పొందియుండుటయే. పదమధ్య ముకారమును 'ఋ'కు సంబంధం లేదు. 'ము' విభక్తిక యతి సామ్యముచే తరువాత 'ము'కార యతి యేర్పడినది.

పండరంగని అద్దంకి శాసనమున ఒక తరువోజ కలదు. తరువోజ పదము ధ్రువాపదము నుండి నిష్పన్నమైనది. ధ్రువపద – దరువద – తరువద – తరువోజ అని దీని రూపాంతరములు. కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో ధృవాపద ప్రబంధము లను జెప్పినాడు. నన్నెచోడుడు మహాకవి 'తరువద'ను ఉ పయోగించినాడు. రెండు ద్విపద పాదములు కలిపిన తరువోజ యగును. ప్రబంధ కవులు దీనిని వాడలేదు. తరువోజ దంపుడు పాడు పాట యని తెలియుచున్నది.


ఒక పాదమున 3 ఇంద్ర గణములు, 1 సూర్య గణము 3 ఇంద్రగణములు, 1 సూర్యగణము మొత్తము 8 గణములుండును.

3.5.8 గణములకు యతి చెల్లును. ప్రాస నియమము కలదు. అద్దంకి శాసనమునందు గల తరువోజకీ లక్షణములున్నవి. కాని 3వ పాదమమందలి 5వ గణము 'గౌఱిల్చియ అను నక్షరములతో నేర్పడుచున్నవి. ఇప్పటివలె గురు నిర్దేశము చేసినది 'జల' గణమగును ఇంద్ర గణము కాదు. (సశేషం)


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**

**ఫోన్ : 934 7971177**

# ఎనుగంటి వేణుగోపాల్ "అమ్మానాన్న "కథల సంపుటి

కస్తూరి వేణుగోపాల్

ఈనాడు సాహిత్యం విభిన్న పార్శ్వాలను, నూతన కోణాలను స్పర్శిస్తూ ముందుకు సాగుతూ, తెలుగు సాహిత్యాన్ని శిఖరాయమానం చేస్తుంది. సాహితీ సృజనకారులెందరో తెలుగు సాహితీ కళామతల్లికి తమతమ శైలీరీతులతో ఆభరణాలను అలంకరింపజేస్తూనే ఉన్నారు.

అటువంటి తెలంగాణ తెలుగు కథా రచయితలలో ఎనుగంటి వేణుగోపాల్ గారు ఒకరు. ఈ తరం తెలంగాణ రచయితలలో వీరిదొక ప్రత్యేకమైన పథం.

వచన కవిత, పద్యం, వ్యాసం, కథ, నవల, జోక్స్ వంటి పలు ప్రక్రియలతో పాటు శతకాలు కూడా వీరి కలంనుండి జాలువారి, మనసున్న రచయితగా ముద్రవేశాయి.

తెలుగుభాష మీద మంచి పట్టు సాధించిన వేణుగోపాల్ గారి బిగిసడలని శైలి, శిల్పం చదువరులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

ఎనుగంటి వేణుగోపాల్ గారు 1965, డిసెంబర్ 27న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాలలో జన్మించారు. గంగమ్మ, రాజమల్లయ్య గార్లు వీరి తల్లిదండ్రులు. ఉపాధ్యాయుడైన తన తండ్రి మార్గదర్శనంలో సాహిత్యం మీద అభిలాష పెంచుకొని, రచయితగా జగిత్యాల ఖ్యాతిని తన ప్రతిభా పాటవాలతో సాహితీ పుటలపై చెరిగిపోని అక్షరాలుగా అమర్చారు.

తల్లిదండ్రుల సేవే జీవిత పరమార్థంగా భావిస్తూ, మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విద్యార్థుల జీవితాలలో విద్యాజ్యోతులు వెలిగిస్తూ, ఇంకోవైపు సామాజిక చైతన్యాన్ని కల్గించే రచనలకు శ్రీకారం చుట్టారు. బాల్యం నుండి చదివింది ప్రభుత్వ పాఠశాలలోనే. బి.యస్సి., లో గణితం మీద డిగ్రీ పూర్తిచేసి, ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేశారు. హిందీ మీద భాషాభిమానంతో హిందీ విద్వాన్ కోర్సును పూర్తిచేసిన వీరు, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి యం.ఏ., తెలుగు మరియు యం.ఏ., సోషియాలజిలలో మాస్టర్ డిగ్రీలు పొందారు. చదివిన చదువు గణితం, చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగంలో గణిత ఉపాధ్యాయులైనా వీరికి తెలుగు భాషంటే వల్లమాలిన అభిమానం. అందుకే మంచి రచయితగా పేరుపొందారు. వీరి తండ్రి రాజమల్లయ్యగారు తెలుగులో రచనలు చేసిన రచయిత అయినప్పటికీ వారి రచనలేవి ముద్రణకు నోచుకోలేదు. ఒకరకంగా సాహిత్య వారసత్వం వీరికి తండ్రి నుండి లభించిందనే చెప్పాలి.

వేణుగోపాల్ గారు తన ఇరవయ్యవ ఏటనే 1985లో "రివర్స్‌కిక్" అనే కథతో సాహితీ రంగంలో అడుగిడినారు. ఇది ఆనాటి 'జ్యోతి' మాసపత్రికలో ప్రచురించబడింది. అటు తర్వాత దేశభక్తి, పిల్లల, శృంగార, మినీ, మానవ విలువల, ప్రేమ తదిదర అంశాల మీద సుమారు అరవై కథలను రచించారు. 'అవని' నవల, 'గోపాలం' హాస్యకథా సంపుటి, వేణుగాన శతకంతోపాటు 'అమ్మానాన్న కథా సంకలనం' రచించారు. నాదేశం(కవిత), చెలి(ప్రేమకథ) వంటి ఎన్నో కథలు ఎన్నో సాహిత్య పత్రికలు, దినపత్రికలలో ప్రచురితమయ్యాయి. వివిధ పోటీలలో బహుమతులు గెలుచుకున్నాయి. వీరు రచించిన **"అమ్మానాన్న కథా సంకలనం"** ఈనాటి "అమ్మానాన్న కథ సంకలనం" లోని విషయం సంక్షిప్తంగా ఇది.

**'వసంతం ఎవరి సొంతం'** అనే కథలో కొడుకులకు పెళ్ళయిన తరువాత ఆ యింట్లో అత్తలకు ఇక స్థానం లేదు అని భావించే కోడళ్ళున్న సమకాలీన సమాజంలో ఓ కోడలు సంతోషం కొరకు తను ఇల్లు విడిచి వెళ్ళిపోతూ తన కోడలుకు ఓ అత్తగారు రాసిన ఆదర్శవంతమైన లేఖనే ఈ కథ. అత్తలను అసహ్యించుకునే కోడళ్ళకు తన తదనంతరం అదే పరిస్థితి ఎదురౌతుందని కాలగమనాన్ని ఎవరూ అపలేరని ఈ లేఖ తెల్పుతుంది. **"అత్తాకోడళ్ళలా కాదు వాళ్ళు తల్లీ బిడ్డల్లా కలిసిపోయారు"** అని ప్రతి కుటుంబంలోని అత్త గురించి, కోడలు గురించి చెప్పుకోవాలనే ఉన్నత సంకల్పం ఈ లేఖది. కోడలుపై అనురాగం గల ఓ అత్త మనసుకు ఈ లేఖ అద్దంపడుతుంది.

**"అమ్మ నిర్ణయం"** అనే కథలో ఉపాధ్యాయ వృత్తిలో రిటైర్డ్ అయిన మల్లయ్య గారి భార్య వైదేహమ్మ. వారికిద్దరు సంతానం. వారికి కూడా పెళ్ళిళ్ళుకూడా అయి మంచి ఉన్నత స్థితిలో ఉన్నారు. తండ్రిగా మల్లయ్య తన జీవితాన్ని పిల్లలకే ధారపోశాడు. కొడుకు చదువుల కోసం నితరంతరం శ్రమించిన ఆయన గుండె ఆగిపోయి వైదేహమ్మ కొడుకులతోనే కల్సి ఉంటుంది. తన కొడుకులు, కోడళ్ళు ప్రేమాభిమానాలకు పెట్టింది పేరని భావించింది. వారినెంతో అభిమానించింది. ఎంతో సంతోషంతో కాలం గడుపుతున్న ఆమె సంతోషం మూన్నాళ్ళ ముచ్చటనే అయింది. కోడళ్ళ అనురాగాలు, ప్రేమలు తమవద్దనున్న డబ్బులకోసం, నగలకోసమని అర్థం చేసుకుంది. అవి ఇవ్వని రోజున తనను గౌరవించే పరిస్థితి వారికిక ఉండదని భావించింది. అయినా సరేననుకొని భర్త ఆదర్శాలను వంటపట్టించుకున్న మహాయిల్లాలుగా తన వద్దనున్న డబ్బును, నగలను అనాథ శరణాలయం పిల్లలకోసం ధారపోసింది. వృద్ధాశ్రమంలో శేష జీవితాన్ని గడిపేస్తానని నిర్ణయించుకుంది. స్వార్థపరులైన కన్న బిడ్డల కంటే, అనాథ పిల్లలకు అండగా ఉండేందుకే ఆ తల్లి నిర్ణయించుకుంది. అదే ఆ **"అమ్మ నిర్ణయం".**

**"పుత్ర ధర్మం"** కథలో భానుమతి, అనంతరామయ్య, దంపతులకు ముగ్గురు కొడుకులు. అందరూ గొప్ప ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. కాని కన్నవారిని ఆదరించలేకపోయారు. అనారోగ్యంతో చావు బతుకుల్లో ఉన్న తమ తల్లిని ఆదుకోవడానికి ఏ ఒక్క కొడుక్కి మనసురాలేదు. భార్యను బతికించుకోవడానికి అనంతరామయ్య పడుతున్న బాధ ఆయన గారి ఏ కుమారునికి కన్పించలేదు. అందుకే

# నేను

అవును నేను పల్లేరు కాయనే
నీ కాలుకింద నలగకుండ ఉండడానికి
నన్ను నేను రక్షించుకోవడానికి
తప్పలేదు మరి
ఒక్కో గాయం ఒక్కోముల్లై పెరిగింది నాలో

అవును నేను ఎడారి మొక్కనే
నిస్సారమైన జీవితంలో
నన్ను నేను బ్రతికించుకుంటాను

అవును నేను తామరాకును
కుళ్ళు కుతంత్రాల సమాజంలో
పెరిగినా మచ్చుకైనా అంటక
విరబూసిన తామరను

నేను వేణువును
నిలువెల్ల గాయలున్నా
గేయమై అలరిస్తాను

మనిషితనం నామతం
మమతల గానం నాస్వరం

**బి. అంజనీ దేవి**
**హన్మకొండ**

తల్లిని రక్షించే ప్రయత్నం చేయలేదు. ఆ తల్లి ఆ పిల్లలను ఎంతో అల్లారు ముద్దుగా పెంచి, ప్రేమను పంచి వారికోసం ఇంటితో సహా అన్నింటినీ అర్పించిన విషయం ఆ కొడుకులు ఈనాడు మర్చి పోయారు. చివరికి అనంతరామయ్యగారే తన కిడ్నీ అమ్మి, రెండు లక్షలు డబ్బుతో తన భార్యను రక్షించుకున్నారు. పుత్రధర్మాన్ని మరిచిన ఆ కొడుకులు ఇక లేరని భావించిన కథయిది.

**"క్షమించు కన్నా"** అనే కథలో రమణామూర్తి తల్లిని ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. కాని ఆయన భార్య సుగుణ అత్తగారైన రాజేశ్వరమ్మను రోజు ఈసడించుకునేది. అగౌరవపర్చేది. వృద్ధాప్యంలో అత్తగారిని ఆదరించలేక పోయింది. రాజేశ్వరమ్మను వృద్ధాశ్రమంలో చేర్పించాలని భర్తను వేధించింది. చివరకు ఒప్పించింది కూడా. అటువంటి సుగుణా రమణామూర్తులు కూడా ఆ తరువాత కాలంలో తమ వృద్ధాప్యంలో తమ కోడలు ప్రతిభవల్ల తన కొడుకైన నిఖిల్ విహారీరాజ్ చేత వృద్ధాశ్రమంలో చేర్చబడతారు. తాను తల్లిలాంటి తన అత్తగారిపట్ల ఎంత అమానుషంగా ప్రవర్తించానన్న విషయం అప్పటికి గాని సుగుణకు తెల్సిరాలేదు. రమణమూర్తి తల్లిమీద అమితమైన ప్రేమ కలవాడే అయినప్పటికి భార్యపోరు వలన తన తల్లి రాజేశ్వరమ్మను వృద్ధాశ్రమంలో చేర్పించినా మానసిక క్షోభను మాత్రం అనుభవించాడు. తన కొడుకు నిఖిల్ విహారీ రాజ్ కూడా ఈరోజు అదే స్థితిలో ఉంటాడని ఆవేదన పడినటువంటివాడు. కోడలు మాటలను తలదాల్చి తన కొడుకునూ, అతని కుటుంబాన్ని వదిలి వృద్ధాశ్రమానికి వెల్తున్న ఒక తండ్రి అయిన రమణామూర్తి తన కొడుకును కూడా వదలినందుకు చెప్పిన మాటనే ఈ "క్షమించు కన్నా".

"అమ్మనై కరిగిపోతా" కార్యేషు దాసిగా, కరణేషుమంత్రిగా, భోజ్యేషు మాతగా, శయనేషు రంభగా సేవలనందించేది భార్య. ఆమెకు పెళ్ళయిన చాలా సంవత్సరాలకు గాని సంతాన ప్రాప్తిని కల్గించేలా చేయలేకపోయాడు ఆ భగవంతుడు. అటువంటి శ్రీమతి అమ్మగా కాబోతున్నదని తెలిసిన తరుణంలో ఆమె అత్తగారు ఆమె కోడలు కనబోయేది ఆడపిల్లనని తెల్సుకొని తన కొడుకుతో 'భ్రూణ హత్య'కు శ్రీకారం చుడుతుంది. కాని అమ్మప్రేమకు ఆడపిల్లయినా, మగబిడ్డైనా ఒకటే. అందుకని ఆ శ్రీమతి తన మాతృత్వాన్ని రక్షించు కోవడం కోసం, తన బిడ్డను ఈ స్వేచ్ఛా ప్రపంచంలోకి తీసుకురావడం కోసం తన భర్తనే వదలి వెళ్ళిపోతుంది. ఆ బిడ్డకొరకు **"అమ్మనై కరిగిపోతా"** నంటుంది. కోడళ్ళను మానసిక క్షోభకు గురిచేసే అత్తగారుల రాక్షసత్వాన్ని తెలిపే కథ ఇది.

**"బాధ్యత"** కథలో పిల్లల మీద తల్లిదండ్రులు వాత్సల్యం పెంచుకోవచ్చు కాని తిరిగి అదే రీతిలో వారి నుండి ప్రేమాభిమానాల్ని ఆశించడం మాత్రం ఈ రోజుల్లో స్వార్థమే అవుతుందని, పిల్లలను ప్రేమిస్తూ, వారిని తీర్చిదిద్ది ప్రయోజకులను చేయడం వరకే తల్లిదండ్రుల బాధ్యత గాని వారి అనురాగాలను చూరగొనాలను కోవడం మాత్రం కలనే అనేది ఈ కథలోని ఇతివృత్తం. బంధాలకు, అనుబంధాలకు నేటితరం యిచ్చే విలువ ఏపాటిదో ఈ కథ వలన చక్కగా తెలుస్తుంది.

**"ఋణం"** కథలో తండ్రి సుఖసంతోషాలను ప్రక్కనపెట్టి, కాయకష్టం చేసి, తన ఆస్తిపాస్తులన్నీ తెగనమ్మి కొడుకులను చదివిస్తాడు. ప్రయోజకులైన కొడుకులు సుఖాల మోజులో, భార్యల మాటలకు తలలు వంచి కన్నవారినే వీధులపాలు చేసిన ఓ కొడుకు కథే ఈ 'ఋణం'.

తమ కలంలో గొప్పకావ్యాలు రచించే ఓ రచయిత తన తల్లిని వృద్ధాప్యంలో నిరాదరణకు గురిచేసి ఆమె నుదుటిపై **"కన్నీటి కావ్యం"** రాసే కథ, అత్తమామలను అల్లుళ్ళు ఆదరించరు అనే అపోహను పోగొట్టి, అల్లుల్లే వారి పాలిట కొడుకులై ఆ అత్తామామలను **"కనురెప్పలు"** గా కాపాడే కథ, 'పుత్రధర్మాన్ని' మరచిన కొడుకులకై ఎదురు చూడక తన కిడ్నీ అమ్మి భార్యను రక్షించుకున్న ఓ తండ్రి కథ వంటివి ఈ కథాసంపుటిలో చోటుచేసుకున్నాయి.

పిల్లలను అల్లారు ముద్దుగా పెంచి పెద్దచేసి, వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో తమ సుఖ సంతోషాలను పక్కనపెట్టిన తల్లిదండ్రులను వారి అవసానదశలో ప్రక్కనపెట్టి, తమ స్వార్థం తాము చూసుకునే పిల్లలెందరో ఈనాడు సమాజంలో మనకు అడుగడుగునా దర్శనమిస్తారు. అటువంటి పిల్లలకు కనువిప్పు కల్గించే కథలెన్నో ఈ సంపుటిలో చోటు చేసుకున్నాయి.

# ఆంధ్ర సారస్వత పరిషత్తు : తెలుగు భాషా సాహిత్య సేవ

ఘట్టమరాజు, . ఫోన్ : 99640 82076

మంగళగిరి శ్రీనివాసులు ఆచార్య ఎన్.ఆర్. వెంకటేశం పర్యవేక్షణలో **'ఆంధ్ర సారస్వత పరిషత్తు : తెలుగు భాషా సాహిత్యసేవ'** అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 2019లో పిహెచ్.డి పట్టా పొందారు. తెలుగు భాషా సాహిత్య వికాసానికి కృషిచేసి కనుమరుగైన, కనుమరుగు కాబోతున్న సాంస్కృతిక సంస్థల పుట్టుపూర్వోత్తరాల్ని తవ్వి తలకెత్త వలసిన అవసరం ఎంతగానో వుంది. ఆంధ్ర సారస్వత పరిషత్తు 1943లో హైదరాబాదులో స్థాపించబడి తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసింది. 2015లో తెలంగాణ ఆవిర్భావ కారణంగా తెలంగాణ సారస్వత పరిషత్తుగా రూపొందినా, ఆనాటి పరిషత్తు ఉదాత్త, ఉదార ఆశయాల్నే పాలిస్తూ, సుయోగ్య పాలకవర్గం చేతుల్లో సురక్షితంగా వుంటూ వుండటం ఉభయ రాష్ట్రాలకు తారకమూ, శ్రీరామ రక్ష కూడానూ.

**'ఆంధ్ర (తెలంగాణ) సారస్వత పరిషత్తు : తెలుగు భాషాసాహిత్య సేవ'** సిద్ధాంతగ్రంథం ఐదు అధ్యాయాలుగా విభజించబడింది. 1. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పాటు, ఆవశ్యకత 2. ఆం.సా.ప. తెలుగు భాషా వ్యాప్తి. 3. పరిషత్తు సేవలో సారస్వత మూర్తులు 4. ఆం.సా.ప. కార్యక్రమాలు అనుబంధంలోని పరిషత్తు ప్రచురనల సూచిక, పరిషత్తు వర్తమాన అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డితో సిద్ధాంతకర్త ముఖాముఖి గమనించదగ్గవి.

**మొదటి అధ్యాయం : 'ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పాటు ఆవశ్యకత'** లో సిద్ధాంతకర్త డా. మంగళగిరి శ్రీనివాసులు హైదరాబాద్ నిజాం మీర్ ఉస్మాన్అలీ ఖాన్ 91911-1948) పాలనా కాలంలో తెలంగాణలో అణగారిపోతున్న తెలుగు భాష పునరుద్ధరణకై కంకణం కట్టుకొన్న మహనీయులు శ్రీయుతులు వామన్ నాయక్, షబ్నవీసు వెంకట రామ నరసింహారావు, మాడపాటి హనుమంతరావు, కొత్వాలు వేంకట రామారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి ప్రభృతులు 1923 జులై 26వ తేదీన హనుమకొండలో ఆంధ్రజన మహాసభను స్థాపించి, కాలక్రమంలో తెలంగాణలోని జిల్లాల్లో ఆంధ్రమహాసభల్ని ఘనంగా నిర్వహించిన వైనాన్ని చక్కగా వివరించారు. హైదరాబాదు రెడ్డి హాస్టలులో 1943 జూన్ 1వ తేదీన లోకనంది శంకర నారాయణరావు గారు అధ్యక్షులుగా, బిదురు వేంకట శేషయ్య ప్రధాన కార్యదర్శిగా, మాడపాటి హనుమంతరావు కోశాధికారిగా మరికొంతమంది ప్రముఖులతో ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యవర్గం రూపొందింది.

**రెండవ అధ్యాయం - 'ఆంధ్ర సారస్వత పరిషత్తు : తెలుగు భాషా వ్యాప్తి'.** పరిషత్తు ఏటేటా తెలుగులో ప్రాథమిక నుంచి విశారద వరకు పరీక్షలు నిర్వహించేది. విశాలాంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కూడా ఈ పరీక్షలు విజయవంతంగా జరిగేవి. 1944-92, 2016-17 అవధిలో సుమారు మూడున్నర లక్షల మంది ఈ పరీక్షల్లో పాల్గొని తమ తెలుగుభాషా జ్ఞానాన్ని పెంపొందించు కున్నారు. పరిషత్తు హైదరాబాదు నగరంలోనూ, తెలంగాణాలో పలుచోట్ల రాత్రిపూట వయోజన విద్యాకేంద్రాలు నడిపించి, తెలుగు పండిత శిక్షణశాల, ప్రాచ్యభాషా కళాశాలలు నిర్వహించి నూరారుమందికి ఉపాధి కల్పించింది.

**'పరిషత్తు సేవలో సారస్వత మూర్తులు' అనే మూడవ అధ్యాయంలో** పరిషత్తుకు అవిస్మరణీయ సేవ చేసిన సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ మొదలు డా. సి.నారాయణరెడ్డి, ఎల్లూరి శివారెడ్డి, డా. చెన్నయ్య వరకు ఎందరో మహానుభావుల్ని పరిశోధకుడు స్మరించాడు.

ఈ పరిశోధనా గ్రంథంలో అతి ముఖ్యమైన అధ్యాయం **నాలుగవదైన 'ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు - సాహిత్యం'.** పదికాలాలపాటు పరిషత్తు పేరు నిలిచిపోవడానికి కారణమైన జనప్రియ, పండితప్రియ పుస్తకాల ప్రచురణ. ఈ దిశలో ఆంధ్ర సారస్వత పరిషత్తు అమోఘమైన సేవ చేసింది. పరిషత్తు 1949లో ప్రచురించిన సురవరం ప్రతాపరెడ్డిగారి 'ఆంధ్రుల సాంఘిక చరిత్రకు' 1955 కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఈ బహుమతిని అందుకొన్న మొట్టమొదటి గ్రంథం ఇదే. 'కృష్ణశ్రీ' గారి సంపాదకత్వం వెలువడ్డ పల్లె పదాలు, స్త్రీల రామాయణపు పాటలు, స్త్రీల పౌరాణికపు పాటలు దేశి సారస్వత విభూతికి సహజాలంకారాలు. పరిషత్తు రజతోత్సవ సంచిక (1978), స్వర్ణోత్సవ సంచిక (1995), వజ్రోత్సవ సంచిక (2003)ల ప్రచురణ కూడా ప్రశంసార్హమే. ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రచురణలో కలకాలం గుర్తుంచుకోదగ్గ కొన్ని గ్రంథాలు రాళ్ళపల్లి వారి శాలివాహన గాథా సప్తశతి సారము, ప్రముఖుల ఉపన్యాసాల సంగ్రహాలైన ఆంధ్ర మహాభారత, మహా భాగవతోపన్యాసాలు ఉల్లేఖింపదగినవి. ప్రాచీన, ఆధునిక తెలుగు సాహిత్యాల గురించి సారమతులచే ప్రసంగాలు చేయించి, వాటిని పుస్తకాల రూపంలో ప్రచురింపచేసిన ఘనత డా. కె.కె. రంగనాథా చార్యుల గారిది. వీరి సంపాదకత్వంలో వెలువడ్డ తెలుగు సాహిత్య వికాసం, తెలుగు సాహిత్యం మరోచూపు, తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక, నూరేళ్ళ తెలుగునాడు, తెలుగులో తొలి సమాజకవులు ఎంతో లోచూపు ప్రదర్శించిన ప్రశస్త విమర్శనా వ్యాస సంకలనాలు. పునర్ముద్రణకు ఎంతగానో నోచుకోదగ్గ డా. డి. చంద్రశేఖర్‌రెడ్డిగారి 'తెలుగు పీఠిక' సిద్ధాంత గ్రంథం పరిషత్తు ప్రచురణల్లో ఉల్లేఖింపదగ్గ

కృతుల్లో ప్రముఖమైనది. ఈ విధంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు భాషా సాహిత్యాలు గర్వించదగ్గ సుకృతులను ప్రచురించింది.

ఈ సిద్ధాంత గ్రంథంలో చివరిదైన **ఐదవ అధ్యాయం 'సారస్వత పరిషత్తు కార్యక్రమాలు'.** 14 పేజీల ఈ అధ్యాయం వెనుకటి అధ్యాయాల్లో ప్రస్తావించిన విషయాల పునరుక్తే.

డా. మంగళగిరి శ్రీనివాసులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ సిద్ధాంతగ్రంథం రాశారు. ఈయన విషయ సేకరణ శ్రమ సాధ్యమైనది. విషయ విశ్లేషణ విస్తారమైనది. విషయ వ్యక్తీకరణ సుస్పష్టమైనది. గ్రంథకర్త సర్వదా అభినందనీయులు.

ఒకటి, రెండు సూచనలు. ఉర్దూ అనే పదానికి సైన్యం అన్న అర్థం (పేజి. 10) తప్పు. ఉర్దూ అంటే మార్కెట్టు, బజారు, సరుకులు అమ్మే సంతలాంటిది అన్న అర్థం. అలాగే ఆలంపురంలో 1953లో జరిగిన పరిషత్తు 7వ మహాసభకు ముఖ్య అతిథిగా వచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు అప్పుడున్నది ఉపరాష్ట్రపతి హోదాలో, రాష్ట్రపతి హోదాలో కాదు (పే. 185).

**ఆంధ్ర సారస్వత పరిషత్తు – తెలుగు భాషా సాహిత్య సేవ**
**గ్రంథకర్త : డా. మంగళగిరి శ్రీనివాసులు**
**పేజీలు : 238 వెల : రూ. 300/–**
**ప్రతులకు : రచయిత, ఫోన్ : 949138862**
**తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, ఆబిడ్స్,**
**హైదరాబాద్, ఫోన్ : 040–24753724**

# దారి

తొక్కీ తొక్కి వెనక్కి నెట్టినా
ముందుకే తీసుకుపోతుంది
దారి!

చిన్నదో ? పెద్దదో?
బురదగుంటలో?
పూల పరుపులో?

పాదంతో పదపద మంటుంది!
మనతో తనూ తోడుగా నడుస్తుంది!!

చిన్నా పెద్దా తేడా లేకుండా
పిల్ల దారులను కలుపుకు పోతుంది
పెద్ద మనసుతో...

సంఘటిత గుణం ఉన్న
నిత్య గమ్య నిర్దేశకురాలు
దారి!

అర్ధరాత్రి అయితే
నగరంలో
ఎందరో అనాథలకు
అమ్మవుతుంది!

ఎన్ని రంగులున్నా..
ఎన్ని రూపాలున్నా..
నిత్యం సమానత్వాన్ని సమ్మోదంతో
పల్లకీ ఎక్కించి మోస్తుంది దారి!


దారి
ఎన్నెన్ని రక్తసిక్త పాదాల
ఆర్తగీతాలను విందో?
ఎన్నెన్ని రిక్త హస్తాలను
మనసారా హద్దుకొని
ఓ ఆశాపథమైందో?


దారి
త్రివర్ణం కప్పుకున్న అమరుల
పార్థివ దేహాన్ని
ఐదవ వ్యక్తై మోస్తుంది..
ఆ సైనికుడికి
సగర్వంగా సెల్యూట్ చేస్తుంది!

గమనం దాని ఊపిరి
ఆగిపోయిందా?
ఊపిరి ఆగిపోయినట్టే..

కాల పరీక్షలో
రహదారులు ధనాత్మకం
మట్టి దారులు ఋణాత్మకం
ఏదేమైనా దారి ప్రయాణం
కళాత్మకం!
దారిలో అందరం
ఒకరికొకరు స్నేహితులం!!


**నరసింహా రెడ్డి**
**ఫోన్ : 98491 50476**









## 'స్వీకృతి'




**రసభావ చిత్రాలు (కవితా సంపుటి) (ఆంగ్లానువాదం)**
ముదిగొండ వీరభద్రయ్య
వెల : 150/-
**ప్రతులకు :** ఎస్.ఆర్. పబ్లికేషన్స్, దిట్టకవి రాఘవేంద్రరావు వీధి, ఇన్నర్ రింగ్ రోడ్ (అంబాపురం), విజయవాడ రూరల్ - 520 013. ఆంధ్ర ప్రదేశ్. ఫోన్ : 94948 75959




**నానీల పరిమళాలు**
పి.వి. రమణ రావు, వెల : 80/-
**ప్రతులకు :** శ్రీమతి పి. భారతి, 17-44, సరస్వతి నిలయం, నేతాజీ రోడ్, సత్తుపల్లి - 507 303. ఖమ్మం జిల్లా
ఫోన్ : 9440 533 032




**ఫిరంగిదళం (సురవరం మొగ్గలు)**
డా. భీంపల్లి శ్రీకాంత్, వెల : 30/-
**ప్రతులకు :** రచయిత, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 903 284 4017




**పద్మశాలి మొగ్గలు**
డా. భీంపల్లి శ్రీకాంత్, వెల : 30/-
**ప్రతులకు :** రచయిత, 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 903 284 4017



**సంత్ కబీరు సప్తశతి**
అనుసృజన : శ్రీ యల్లాప్రగడ ప్రభాకర రావు
శ్రీ పంగులూరి హనుమంతరావు
వెల : రూ. 200/-
**ప్రతులకు :** శ్రీ పంగులూరి హనుమంతరావు, 16-11-511/జి/7, శాలివాహన నగర్, దిల్ సుఖ్ నగర్, హైదరాబాద్ - 500 006.
ఫోన్ : 99086 48474, 934 638 5669

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com


# ఉస్మానియా విశ్వవిద్యాలయం











ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఉద్యమాల వసంతాలయం
జ్ఞానపుత్తడిల నిండు భాండాగారం.
విశ్వ వెన్నెల మరకత మణిహారం.
నా ఉస్మానియా
రారాజుల రాజ మందిరం
నా ఉస్మానియా
కోటి కుసుమాల జ్ఞాపక నిలయం.

సంస్కార ధిక్కార భావాలనేర్పరచునది
విద్యార్థులను విజ్ఞాన
గ్రంథాలుగా మార్చునది
చెరగని స్నేహపరిమళాలను వెదజల్లునది
ప్రణయ బాసలకు
పరిణయ పిలుపులకు వేదికైనది
నా ఉస్మానియా
జీవనాభ్యున్నతికి ఆరంభ ద్వారం
నా ఉస్మానియా
మహా నాయకులకు పురిటి స్థలం.

ప్రపంచరాజకీయ వ్యూహాలకు
జాతి నిర్మాణసూత్రాలకు
స్వతఃసిద్ధ కళల ప్రేరణకు
వయసు పొద్దువాలుతున్న యథార్థాలకు
ఆనంద, విసుగుల
విశ్రాంతాలకు మాతృభూమిక
నా ఉస్మానియా
శతాధికుల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం
నా ఉస్మానియా
దేశ ప్రధానినందించిన విద్యాపీఠం.

సాహిత్యం సామాజికం
సకల శాస్త్రాల అధ్యయనకేంద్రం.
పుస్తకాలనే పువ్వులపై
సీతాకోకచిలకలల్లే వాలిన
విద్యార్థుల చూపుల
గుంపుల గ్రంథాల సముద్రం
ఎర్రకోటను తలపించే
ఎత్తైన మేధోనందనం
నా గ్రంథాలయం.
నా ఉస్మానియా
విప్లవ చైతన్యానికి వే సూర్యుల కాంతి పథం
నా ఉస్మానియా
అంతులేని స్వప్నాల తీరం.

మేటి ఉద్యాన వనానికి
కుర్రజంటల రంగుల రాజ్యానికి
పచ్చికల పిల్లతెమ్మెరలకు
ఒక్కో వృక్షానికి ఒక్కో బుద్ధావతారాలకు
సందడైన సన్న సన్న జల్లులకు
సుందరాకృతి దాల్చిన
నా ల్యాండ్‌స్కేప్ గార్డెన్
నా ఉస్మానియా
దేశ దేశాలకు దిక్సూచి యంత్రం
నా ఉస్మానియా
త్యాగాలకు తొలి జననం.

విశ్వ కళాప్రదర్శనకు
కవి సమ్మేళన రస పద విన్యాసాలకు
అనుభవ శాలుల జ్ఞాన ప్రసంగాలకు
పండితుల పట్టాల పంపకాలకు
విశ్వకవి పేరిట వెలసిన
నా ఠాగూర్ ఆడిటోరియం.
నా ఉస్మానియా
జన్మజన్మలకు మరువని విద్యా క్షేత్రం
నా ఉస్మానియా
విద్యార్థులకు దీవెనలిచ్చే మాతృహృదయం.

**డా. కందుల శ్రీను**
నల్గొండ, ఫోన్ : 85559 76629